
www.andhrajyothy.com srikakulam
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



16

శ్రీకాకుళం
బుధవారం 2 ఆగస్టు 2017



కుసుంపురంలో అనాథలుగా మారిన.. దుమ్ము పుణ్యవతి, లక్ష్మి

- తల్లిదండ్రులను కబళించిన కిడ్నీ భూతం
- అనాథలుగా మారిన బిడ్డలు
- దీనంగా మారిన బతుకులు
- సాయానికి చూపులు

అమ్మ తోడూ.. నాన్న నీడా లేదు!

అమ్మ ఒడిలో... నాన్న నీడలో... ఆడుతూ పాడుతూ పెరిగిన చిన్నారులు వారు. అమ్మ చేతి గోరు ముద్దలు తింటూ... నాన్న చెప్పే నీతి కథలు వింటూ... ఏ ఆలోచననూ దరిచేరనీయకుండా.. ఆనందంగా గడిపిన పసివాళ్లు. ఎంతో ఎత్తుకు ఎదగాలని కలలు గన్న చిరుదివ్వెలు. ఇదంతా గతం. ఇప్పుడు గోరు ముద్దలు తినిపించేందుకు అమ్మ లేదు. భవిష్యత్తుకు మార్గ నిర్దేశం చేసేందుకు నాన్న లేడు. చూస్తుండగానే అమ్మానాన్నలిద్దరినీ కిడ్నీ భూతం పొట్టన పెట్టుకుంది. జీవితాలను చీకటి మయం చేసింది. భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చింది. చిన్నవయసులోనే అనాథలుగా రోడ్డున పడేసింది. ఒంటరితనమే లోకమైంది. పుస్తకాలు పట్టుకోవాల్సిన వయసులో పలుగూ పారా పట్టాల్సిన దుస్థితి. పవన్‌కల్యాణ్ చొరవతో ఇన్నాళ్లకు మళ్లీ వారి ఆశలు చిగురించాయి. అనాథ బాలల సంరక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకుంటున్న ప్రత్యేక సంస్థను ఉద్దానంలోనే ప్రారంభిస్తామన్న సీఎం చంద్రబాబు మాట... మళ్లీ వారిని భవిష్యత్తు వైపు దృష్టి సారించేలా చేస్తోంది.

- మధ్య పేజీల్లో..



కిడ్నీ బాధితులతో మాట్లాడుతున్న హార్వర్డ్ వైద్యుల బృందం

- కిడ్నీ బాధితులకు అండగా ప్రభుత్వం
- పూర్తిస్థాయిలో వ్యాధి నివారణకు కృషి
- మూలాలు కనుగొనేందుకు వడివడిగా అడుగులు
- త్వరలో పరిశోధన కేంద్రం, మరిన్ని 'డయాలసిస్' సెంటర్ల ఏర్పాటు

చిగురించిన ఆశలు

(సోంపేట)

కిడ్నీ వ్యాధి.. ఉద్దానం ప్రాంతాన్ని ఏళ్ల తరబడి కబళిస్తోంది. నిత్యం ఎక్కడో ఓ చోట... ఎవరో ఒకరు ప్రాణాలు కోల్పోతుండటం... కన్నీరు కార్చడం మినహా ఏమీ చేయలేకపోవడం... సుమారు దశాబ్దాలుగా ఇక్కడ నిత్యకృత్యం. ఈ నేపథ్యంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చొరవతో.. ఈ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుండడం బాధితుల కళ్లల్లో ఆనందాన్ని నింపుతోంది. పవన్‌కల్యాణ్ ఈ ఏడాది జనవరి 3న ఇచ్ఛాపురంలో పర్యటించి.. కిడ్నీ బాధితులతో సమావేశమయ్యారు. బాధితుల కష్ట నష్టాలు తెలుసుకుని ప్రభుత్వానికి - మిగతా 14లో



మనోరమ సస్పెన్షన్!

- పాలకొండ సీడీపీవోపై వేటు!
- కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడమే తరువాయి
- త్వరలో విచారణకు ఆదేశం

(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి)

పాలకొండ స్త్రీశిశు సంక్షేమశాఖ సీడీపీవో మనోరమపై సస్పెన్షన్ వేటు పడనుంది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, - మిగతా 14లో



కౌలు కష్టం

- ఖరీఫ్ సేద్యానికి మదుపు లేక రైతుల విలవిల
- పంట రుణాల మంజూరుకు బ్యాంకర్ల వెనుకంజ

(శ్రీకాకుళం సిటీ)

'జిల్లా 70శాతం వ్యవసాయ రంగంపై ఆధార పడి ఉంది. సాగునీటి వనరులకు లోటు లేదు. ఉన్నదల్లా పంటలకు మదుపులు లేకపోవడమే. జిల్లాలో దాదాపు 80 శాతం మంది కౌలు రైతులు ఉన్నారు. వారు పేదరికంలో ఉన్నా.. భూమిని కౌలుకు తీసుకుని.. మనకు పట్టెడన్నం పెడు తున్నారు. నిబంధనల పేరిట వారికి పంట రుణాల మంజూరులో మోకాలడ్డవద్దు. సకాలంలో రుణాలు అందజేసి మానవత్వాన్ని చాటుకోండి. వసూళ్లలో సమస్యలుంటే - మిగతా 14లో

జిల్లాలో ఇదీ పరిస్థితి

వరిసాగు విస్తీర్ణం : 2.08 లక్షల హెక్టార్లు
కౌలు రైతులు : సుమారు రెండు లక్షలు
రుణ అర్హత కార్డులు మంజూరైనవి: 16,000
సాగు ధ్రువీకరణ పత్రం పొందిన రైతులు : 11,000
ఇప్పటివరకూ పంట రుణం పొందిన రైతులు : 436 మంది
ఖరీఫ్ రుణ లక్ష్యం : 1,580 కోట్లు
పొందిన రుణం : రూ.1.13 కోట్లు



ఆరుబయట స్క్రీన్‌పై వివరాలు చూస్తున్న ఉపాధ్యాయులు

రోజంతా సాగిన ఎస్జీటీల కౌన్సెలింగ్

బదిలీ ఉత్తర్వులు విడుదల

16లో



'వంశధార' జాప్యానికి కారణమేంటి?

- నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాం
- అయినా పనులు ఎందుకు పూర్తికావడం లేదు?
- జిల్లా ప్రగతికి సహకరించాలి
- మంత్రి అచ్చెన్నాయుడు

7లో

వాల్తేరులో ఐదిళ్లు భస్మీపటలం

6లో

బీమాతో ధీమా

● మరింత ప్రచారం అవసరం
● బ్యాంకర్లు ఖాతాదారులకు అవగాహన కల్పించాలి
● బ్యాంకులు, బీమాపై సంతోష్‌రంగనాథ్ పరిశోధన



పరిశోధనను వివరిస్తున్న సంతోష్ రంగనాథ్ (ఫైల్)

ఎచ్చెర్ల: బ్యాంకులు, బీమాను వేర్వేరుగా ఆలోచించలేం. బ్యాంకర్లు బీమాను భారంగా కాకుండా బాధ్యతగా వ్యవహరించాలి. బ్యాంకింగ్ వ్యవస్థకు, వినియోగదారునికి ఎంతో ప్రయోజనకరమైన బీమాపై మరింత ప్రచారం చేపట్టాలి. ఖాతాదారుల్లో అవగాహన కల్పించాలి. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంటు విభాగానికి చెందిన ఎన్.సంతోష్ రంగనాథ్ బ్యాంకింగ్, బీమా, వినియోగదారుల కేస్‌స్టడీపై పరిశోధన చేశారు. పీహెచ్‌డీలో భాగంగా బ్యాంకు ఇన్సూరెన్స్ అనే అంశంపై చేసిన పరిశోధన వివరాలను ఇటీవల అందజేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.తులసీరావు పర్యవేక్షణలో ఈయన పరిశోధన పూర్తిచేశారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

జిల్లాలో 26 జాతీయ బ్యాంకు శాఖలను, 800 మంది బ్యాంకు వినియోగదారులను కలిసి బ్యాంకింగ్, బీమా అనే అంశాలపై సంతోష్ రంగనాథ్ అధ్యయనం చేశారు. ఏ దేశంలోనైనా ఆర్థిక లావాదావీల నిర్వహణలో బ్యాంకులు కీలకభూమిక పోషిస్తాయి. 2000 సంవత్సరం నుంచి బ్యాంకింగ్ వ్యవస్థలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అప్పటి వరకు ఆర్థిక లావాదేవీలకే అత్యంత ప్రాధాన్యతనిచ్చిన బ్యాంకులు ఒక్కసారిగా తన పంథా మార్చుకున్నాయి. బీమా రంగంలో అడుగుపెట్టాయి. దీని వల్ల ఇటు బ్యాంకింగ్ వ్యవస్థకు, అటు వినియోగదారునికి ప్రయోజనం చేకూరుతుంది. కేవలం టార్గెట్‌ను చేరుకొనేందుకే బీమాపై దృష్టి సారించకుండా రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా బ్యాంకర్లు బీమాను అభివృద్ధి చేయాల్సి ఉంది. రుణాలు ఇచ్చేటప్పుడు వినియోగదారులకు బీమాపై అవగాహన కల్పించడమే కాకుండా, దీనిపై మరింత శ్రద్ధ తీసుకొని ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

ప్రచారం అవసరం..

బీమాను బ్యాంకింగ్ రంగంగానే భావించాలి. దీనిపై మరింత ప్రచారం చేపట్టాలి. ప్రతి బ్యాంకులో బీమాకు సంబంధించి సలహాలు, సూచనలు, సందేహాలపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ఓ ఉద్యోగిని నియమించాలి. జిల్లాలో బీమా చేయించే స్థోమత ఉన్న వినియోగదారులు ఉన్నప్పటికీ సరైన అవగాహన లేకపోవడం వల్ల బీమా వైపు చూడడం లేదన్న విషయం పరిశోధనలో వెల్లడైంది. బ్యాంకర్లు పని ఒత్తిడి కారణంగా బీమాపై సరైన రీతిలో ప్రచారం చేయలేకపోతున్నారు. దీని కోసం ఒక ఉద్యోగిని నియమించినట్టయితే అదనపు ఆదాయం సమకూరుతుందనడంలో సందేహం లేదు. దేశంలోని బ్యాంకులు బీమా అభివృద్ధిలో ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. అధిక శాతం మంది వినియోగదారులు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులకే ప్రాధాన్యమిస్తున్నారు.

బీమా సంస్థలతో ఒప్పందం...

దేశంలోని వివిధ బ్యాంకులు బీమా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ఎస్‌బీఐ, ఎస్‌బీఐ లైఫ్‌తో బీమా రంగంలో అడుగుపెట్టింది. ఎల్ఐసీతో కార్పొరేట్ బ్యాంకు, ఇండియన్ ఓవర్‌సీస్, సెంచూరియన్, సత్రా డిస్ట్రిక్ట్, కో-ఆపరేటివ్, జనత అర్బన్ కో-ఆపరేటివ్, యోత్‌మాల్ మహిళా సాకరి, ఓరియంటేషన్ బ్యాంకు ఆఫ్ కామర్స్ ఒప్పందం కదుర్చుకున్నాయి. ఇ లా బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎవైవా ఇండియా లిమిటెడ్, దాబర్ సీజీయూ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేటు లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఐసీఐసీఐ ప్రొడన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, మెట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, టాటా ఏఐజీ, బజాజ్ ఎలియనైజ్ జనరల్ ఇన్సూరెన్స్, రోయల్ సుందరం జనరల్ ఇన్సూరెన్స్, యూనైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలతో వివిధ బ్యాంకులు ఒప్పందం కుదుర్చుకొని బీమా రంగంలోకి అడుగుపెట్టాయి.



కృత్రిమ గర్భోత్పత్తికి మరో యత్నం

ఆడదూడల ఉత్పత్తి పెంచే దిశగా పశుసంవర్ధకశాఖ

హోలిస్ట్రియన్ ఫ్రీజియన్, జెర్సీ రకాల ఆవు జాతుల పెంపుదలే లక్ష్యం

జిల్లాకు 240 డోసుల వీర్యం

టెక్కలి : కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా పాడిరైతుకు మంచిరోజులు అందించాలన్నదే పశుసంవర్ధకశాఖ లక్ష్యంగా నిర్ణయించింది. దీంతో ఆడదూడలు ఉత్పత్తి పెంచడం ముఖ్య ఉద్దేశం. తద్వారా పాల దిగుబడులు పెంచే దిశగా ఆ శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. గతంలో కృత్రిమ గర్భోత్పత్తి విధానంతోనే 50:50 శాతం నిష్పత్తిలో ఆడ, మగదూడలను అభివృద్ధి చేసేవారు. ప్రస్తుతం మేలు రకమైన పశు వీర్యాలతో ఆడదూడల ఉత్పత్తి శతశాతం పెంచే దిశగా ఆశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. విదేశాల్లో ఏకంగా ఆడదూడలనే ఉత్పత్తి చేసే దిశగా సెక్స్‌డ్ సెమెన్‌ను సీడెల్ అనే శాస్త్రవేత్త మొదటగా తయారు చేశారు. దీన్ని అమెరికా, కెనడా, యూరప్, బ్రెజిల్, చైనా వంటి దేశాల్లో వినియోగిస్తూ కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా ఏకంగా ఆడదూడలే పుట్టేలా చేశారు. ఈ వీర్యాన్ని మన దేశంలో కూడా ఉపయోగించేందుకు ముందుకొచ్చింది. ఈ వీర్యాన్ని దిగుమతి చేసుకోవడానికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్‌ట్రేడ్ అనుమతి కూడా తీసుకువచ్చారు. సెక్స్‌డ్ సెమెన్ డోసు రూ.1,500 నుంచి రూ.4,500 వరకు ఉన్నప్పటికీ ఆడదూడలు ద్వారా పాల ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకొని దీని ధరలు తగ్గించేందుకు ప్రభుత్వమే ముందుకు వచ్చింది. అయితే హోలిస్ట్రియన్ ఫ్రీజియన్, జెర్సీ రకాలకు చెందిన వీర్యం మాత్రమే సెక్స్‌డ్ సెమెన్‌లో లభ్యమవుతోంది. ఈ రకమైన వీర్యాన్ని కేవలం ఆవుజాతి పడ్డల్లో మాత్రమే వినియోగించాలి. అలాగే మూడు ఈతల వరకు మాత్రమే ఆవుజాతి పశువుల్లో ఈ వీర్యాన్ని ఉపయోగించవచ్చు. ఈ వీర్యం వల్ల 90 శాతం ఆడదూడ పుట్టేందుకు అవకాశముంది. మంచి రకాలైన ఆడ దూడలను, పడ్డలను తయారు చేయవచ్చు. గర్భకోశ వ్యాధులను నివారించడంతో పాటు పశువు ఈనేటప్పుడు సమస్యలు తగ్గే అవకాశాలున్నాయి. సెక్స్‌డ్ సెమెన్ వాడటం వల్ల ఖర్చు తక్కువ కావడం, మామూళ్ల వీర్యం కంటే దీని మోతాదు ఎక్కుగా ఉంటుంది. నైపుణ్యత కలిగిన వారు మాత్రమే సెక్స్‌డ్ సెమెన్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. ఆవుల్లో సంతానోత్పత్తి మామూళ్ల వీర్యం కంటే పది నుంచి 15శాతం ఎక్కువగా ఉంటుంది. అయితే వీర్యం పశువులకు ఎక్కించేటప్పుడు కొంతమేరకు వృధా అయ్యే అవకాశాలున్నాయి. దీని వల్ల పశు వైద్యులకు ఇది అగ్నిపరీక్ష అని చెప్పవచ్చు.



కృత్రిమ గర్భోత్పత్తి చేస్తున్న దృశ్యం

జిల్లాకు 240 డోసులు వచ్చాయి



జిల్లాకు 240 సెక్స్‌డ్ సెమెన్ డోసులు వచ్చాయి. ఇందులో 200 జర్సీ జాతివి, 40 హోలిస్ట్రియన్ ఫ్రీజియన్ రకానివి. పాడి రైతులకు ఈ రకమైన పద్ధతులు కృత్రిమ గర్భోత్పత్తి సాధించడం మొదటిసారి కనుక తొలివిడతగా ఈ డోసులను వినియోగిస్తున్నాం. భవిష్యత్‌లో మరిన్ని డోసులను తీసుకువచ్చి అమలు చేస్తాం.

డాక్టర్ మెట్ట వెంకటేశ్వరరావు
జిల్లా సంయుక్త సంచాలకులు, పశుసంవర్ధకశాఖ

ఎంపిక చేసిన పశు వైద్య కేంద్రాల్లో లభ్యం



ఎంపిక చేసిన పశువైద్య కేంద్రాల్లో మాత్రమే సెక్స్‌డ్ సెమెన్ డోసులు వినియోగించాల్సి ఉంది. వీటి ద్వారా వచ్చే ఫలితాలను చూసుకొని మరిన్ని డోసులు వినియోగిస్తాం. కృత్రిమ గర్భోత్తి ఇంజక్షన్ ఖరీదు వెయ్యి రూపాయలు కాగా, ప్రభుత్వం రాయితీతో రూ.250 లకే అందజేస్తున్నాం. భవిష్యత్‌లో ప్రతి పశువైద్య కేంద్రానికి సెక్స్‌డ్ సెమెన్ సరఫరా చేస్తాం.

డాక్టర్ మంచు కరుణాకర్, ఉప సంచాలకులు,
పశుసంవర్ధకశాఖ, టెక్కలి

రైతుకు వరం 1075 వరి

(సంతకవిటి)

ఖరీఫ్ వరి సాగుకు సమాయత్తమవుతున్న రైతులను చైతన్యవంతులను చేసే దిశగా వ్యవసాయ సిబ్బంది సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో విత్తనాల పంపిణీ ప్రక్రియకు వెళ్లే సిబ్బంది ఆ పనిచేస్తూ వరి 1075 రకాన్ని రైతులకు పరిచయం చేస్తున్నారు. జిల్లా రైతాంగం 1001 రకానికి అలవాటు పడినప్పటికీ దీని వల్ల దిగుబడి తక్కువ రావడంతోపాటు తెగుళ్లు, ఇతర నష్టాల కారణంగా ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. 1075 రకాన్ని రైతులు ఈ ఏడాది సాగుచేస్తే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. 1075 రకం పంట కూడా 1001 రకానికి పట్టినకాలం 130 రోజులు, 1075 రకానికి 145 రోజులు పడుతుంది. అయితే 1075 రకం సాగుచేసుకుంటే దిగుబడి అధికంగా వస్తుందని వ్యవసాయాధికారుల అభిప్రాయం. ఎకరానికి 1001 రకం 25 నుంచి 30 బస్తాలు వస్తే.. 1075 రకంతో 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. అలాగే ఎరువులు, గెత్తం, పురుగు మందులు వంటివి 1075 రకానికి అంతగా అవసరం ఉండదు. మండలంలో గత ఏడాది ఆరు గ్రామాల్లో కొంత మంది ఆదర్శ రైతులకు 25 బస్తాలను అందించామని వీరికి 35 నుంచి 45 బస్తాల దిగుబడి రావడమే కాకుండా తెగుళ్ల బెడద తప్పింది. ఎరువులు, పురుగు మందులు కూడా అధికంగా వాడలేదు. అయితే 1075 రకం పండించిన రైతులకు పంట సమయంలో ముంపు భయం, ప్రకృతి పరంగా సంభవించే తుఫాన్‌లు, గాలుల వల్ల పది శాతం కూడా నష్టం ఉండదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు మారుతున్న పరిస్థితులను అనుసరించి పంటలు పెట్టే విధానంలోను మార్పులు చేసుకోవాలని అధికారుల సూచన.

1075 రకం అవసరమయ్యే రైతులు తమను సంప్రదిస్తే వారికి నేరుగా రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి తెప్పించి అందజేయడమే కాకుండా పంట సమయంలో యాజమాన్య పద్ధతులు, సలహాలు, సూచనలు సిబ్బంది అందిస్తారని వ్యవసాయాధికారి జి.రంగారావు తెలిపారు.



నకిలీ పోలీస్ అరెస్టు


జనార్ధనరావును పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

టెక్కలిటౌన్ : తాను ప్రత్యేక పోలీస్ అధికారినని, ప్రభుత్వం అందిస్తున్న పథకాల నిర్వహణ తీరుపై అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు చేపడుతున్నామని చెబుతూ వసూళ్ల పర్వానికి పాల్పడుతున్న నకిలీ పోలీస్‌ను అంగన్‌వాడీ కార్యకర్త చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మంగళవారం టెక్కలిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జి.రాజేష్ తెలిపిన వివరాల మేరకు లావేరు మండలం అదపాక గ్రామానికి చెందిన పి.జనార్దనరావు గతంలో టెక్కలి పోలీస్‌స్టేషన్ పరిధిలో పారా పోలీస్‌గా పనిచేశాడు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తుండడంతో అతన్ని విధుల నుంచి తొలగించారు. అయితే మంగళవారం మండలం తేలినీలాపురం, దామోదరపురం అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి తాను స్పెషల్ పోలీస్ అధికారినని, రికార్డుల చూపించాలని కార్యకర్తలపై ఒత్తిడి చేశాడు. అనంతరం ఖర్చుల నిమిత్తం కొంతమొత్తం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆయనపై అనుమానం రావడంతో గ్రామస్థులతో పాటు టెక్కలి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఎస్‌ఐ జి.రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని నకిలీ పోలీసును అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన

భామిని: తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్ వద్ద యువత ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా షిఫ్ట్ ఆపరేటర్‌ను బయటకు పంపి కార్యాలయానికి తాళాలు వేశారు. ఏఈకి, ఏడీకి ఎంత సంప్రదించినప్పటికీ ఎవరూ స్పందించకపోవడంతో 1100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలో లైన్‌మెన్ లేకపోవడంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

యువతి ఆత్మహత్యాయత్నం

టెక్కలిటౌన్ : మండలం పోలవరం గ్రామానికి చెందిన పామోటి చరిత యూరియా గుండ మింగి ఆత్మహత్యాయత్నానికి మంగళవారం పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న చరితను చూసి బంధువులు 108 వాహనం ద్వారా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి, ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. చరిత ఆత్మహత్యాయత్నంకు పాల్పడడానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● నిందితుల నుంచి రూ.5 లక్షల నగదు, లారీ విడిభాగాలు స్వాధీనం
● వన్‌టౌన్ సీఐ చంద్రశేఖర్

విజయనగరం క్రైం : అంతరాష్ట్ర దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం వన్‌టౌన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. లారీ దొంగతనానికి పాల్పడిన అంతర్‌రాష్ట్రీయ దొంగలను సీసీఎస్ పోలీసుల సహకారంతో అరెస్టు చేశామన్నారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన గడిగొయ్య రామకోటి రెడ్డి, విజయవాడకు చెందిన శ్రీనివాసరావు, కాకినాడకు చెందిన కాటూరి కిషోర్‌బాబు, తణుకుకు చెందిన బొక్కా రాఘవులు, శ్రీకాకుళంకు చెందిన గుంటి జగన్నాధరావు, కడప జిల్లాకు చెందిన పురియా వీరవసంత్‌కుమార్‌లు ముఠాగా ఏర్పడి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీలను దొంగతనం చేసి విడి భాగాలుగా విడగొట్టి వాటిని విజయవాడ పరిసర ప్రాంతాల్లో అమ్ముతున్నారని తెలిపారు. సీసీఎస్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు శ్రీకాకుళంకు చెందిన గుంటి జగన్నాధరావు, సీసీఎస్ డీఎస్పీ చక్రవర్తి సమాచారం మేరకు వన్‌టౌన్ కేసులో చోరీ సొత్తును, కొత్తవలస లారీ కేసులో రూ.5లక్షలు విలువ గల నగదును, టూటౌన్ కేసులో లారీ విడిభాగాలను కాటూరి కిశోర్‌వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. జగన్నాధరావు గత కొంతకాలంగా విజయనగరం రింగ్‌రోడ్డులో నివాసం ఉంటున్నాడని, సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మిగిలిన నిందితులను త్వరలోనే పట్టుకుని కేసును ఛేదిస్తామన్నారు. ఈ కేసులో సహకరించిన వారిలో సీసీఎస్ డీఎస్పీ చక్రవర్తి, కొత్తవలస ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్, టూటౌన్ ఎస్‌ఐ అశోక్‌కుమార్, సీసీఎస్ ఎస్‌ఐ జియాఉద్దీన్, పీసీలు శంకరరావు, శ్రీనివాసరావు, భానోజీరావు, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.


మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

విద్యుత్ షాక్‌తో
బాలుడు మృతి

కడుము (కొత్తూరు): మండలం కడుము గ్రామానికి చెందిన పారిచర్ల రఘు (08) విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందాడు. స్థానిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న రఘు పాఠశాల ఆవరణలో ఆడుకుంటుండగా మంతిని రామారావు పెరటిలో బంతి పడడంతో అది తీసేందుకు వెళ్లి అక్కడ మోటారు వైర్లను ప్రమాదవశాత్తు తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఒడిశాలోని సెరంగో గ్రామానికి చెందిన దండాసి, పావనీల ఏకైక సంతానం రఘు. వీరు ఇటువల విడాకులు తీసుకోవడంతో తాత బొడ్డేపల్లి రాము వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. అప్పటి వరకు ఆడుకుంటున్న రఘు మృతి చెందడంతో అంతా కన్నీరుమున్నీరవుతున్నారు. స్థానిక హెచ్‌సీ కాంతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పిడుగుపడి రైతు దుర్మరణం


మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు

ఇచ్ఛాపురం : మున్సిపాల్టీ పరిధి బెల్లుపడ గ్రామానికి చెందిన రైతు ఉప్పాడ పురుషోత్తం (35) పిడుగుపాటుతో మంగళవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. బెల్లుపడ జాతీయ రహదారి సమీపంలో మధ్యాహ్నం 2గంటల సమయంలో పొలం పనులు చేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగు పడడంతో పురుషోత్తం అక్కడక్కడే మృతి చెందాడు. తోటి రైతులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మృతిడిది నిరుపేద కుటుంబం. తండ్రి గణపతి, తల్లి శాంతమ్మ కొన్నేళ్ల కిందటే మృతి చెందారు. అన్నదమ్ములు శేషు, జోగారావు దగ్గర ఉంటూ పొలం పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

రైలు కిందపడి వ్యక్తి మృతి

సంతబొమ్మాళి/పలాస : మండలం కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం వేకువ జామున గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి మృతిచెందాడు. సుమారు 40 ఏళ్ల ఉంటాయని, ప్రమాదవశాత్తు రైలు కింద పడినట్టు అనుమానిస్తున్నారు. మృతుని జేబులో బరంపురం వరకు టిక్కెట్ ఉన్నట్టు రైల్వే పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని టెక్కలి ఏరి యా ఆసుపత్రికి తరలించారు. రైల్వేపోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు అధ్యాపకులకు మెమోలు


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ

ఎచ్చెర్ల : అంబేద్కర్ వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ గొల్లపల్లి నాగేశ్వరరావు ముగ్గురు అధ్యాపకులకు మెమోలు జారీ చేశారు. మంగళవారం ఉద యం 8.30 గంటలకు స్థానిక అంబేద్కర్ వర్సి టీకి చేరుకున్న ఆయన తరగతులు ఏ విధంగా నిర్వహిస్తున్నారో వీసీ ఆరా తీశారు. అనంతరం హాజరు పట్టీలను పరిశీలించారు. ఎకనామిక్స్, తెలుగు, స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన అధ్యాపకులు ఆలస్యంగా రావడంతో వారికి మెమోలు జారీ చేయాలని ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ పి. చిరంజీవులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థు లకు రోల్ మోడల్‌గా వ్యవహరించాలని, విద్యా ర్థులకంటే అధ్యాపకులు క్యాంపస్‌కు ఆలస్యంగా రావడం క్షమించరాని నేరమని హెచ్చరించారు.



బాతుపురం రోడ్డు గోతులమయం


అధ్వానంగా ఉన్న బాతుపురం రోడ్డు

బాతుపురం (వజ్రపుకొత్తూరు): మండలంలోని బాతుపురం నుంచి రాజాం వెళ్లే రోడ్డు గోతులమయమైంది. రాజాంకాలనీ నుంచి రాజాం వరకూ మాత్రమే తారురోడ్డు నిర్మించి, మిగిలిన ప్రాంతంలో విడిచిపెట్టారు. ఈ రెండు గ్రామాలను కలిపే తారురోడ్డు నిర్మాణం పూర్తయితే కాశీబుగ్గ వైపు రాకపో కలకు అవస్థలు తీరుతాయని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా తారురోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎరువులు విక్రయానికి సిద్ధం

మందస: స్థానిక వ్యవసాయ పరపతి కేంద్రంలో ఎరువులు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని సీఈవో ఉద్దండరావు తెలిపారు. 400 బస్తాలు డీఏపీ సిద్ధంగా ఉన్నాయని, బస్తా రూ.1076 చెల్లించి కొనుగోలుచేసుకోవచ్చని పేర్కొన్నారు.

4న కిల్లోయిలో వైద్యశిబిరం

మందస: కిల్లోయిలో ఎన్‌టీఆర్ వైద్యసేవ మెగా వైద్యశిబిరం ఈనెల నాలుగో తేదీన నిర్వహించనున్నట్లు బుడంబో పీహెచ్‌సీ వైద్యాధికారి శరత్‌చంద్ర తెలిపారు. రాజాం, జీఎంఆర్ వరలక్ష్మి కేర్‌ఆసుపత్రి, శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రి వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

పింఛన్ విధానంపై అవగాహన


మాట్లాడుతున్న సత్యకేశవరావు

కుంటికోట(హరిపురం): పింఛన్ విధానం, చట్టాలపై ప్రతి గెజిటెడ్ అధికారికి అవగాహన అవసరమని విశ్రాంత ఎస్టీవో సత్యకేశవరావు తెలిపారు. మందస మండలంలోని కుంటికోట యువజన శిక్షణ కేంద్రంలో (వైటీసీ) రెండురోజుల పాటు గెజిటెడ్ అధికారులకు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు, డీటీలు, ఎంఈవోలు, ఎంపీడీవోలు, ట్రెజరీ అధికారులు, ప్రభుత్వ వైద్యులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులకు పింఛన్ విధానంపై వివరించారు. హెచ్‌ఆర్‌డీ మేనేజర్ ఎస్ మోహనరావు అధ్యక్షతన కార్యక్రమంలో వైటీసీ మేనేజర్ రామునాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పలాస: చిన్నబడాం-గరుడఖండి గ్రామాల మధ్య పాతజాతీయరహదారిపై ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు జారిపడడంతో పి.ఢిల్లేశ్వరరావుకు గాయాలయ్యాయి. ఆయన్ను 108 సిబ్బంది సత్యం, ఢిల్లేశ్వరరావు పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీఐ అశోక్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

శ్రీకాకుళం లీగల్ : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకులు కరణంలీలావతి చెప్పారు. నగరంలోని శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం తల్లిపాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన లీలావతి మాట్లాడుతూ తల్లిపాలలో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో సీడీపీవో ఎంఎన్ రాణి, సూపర్‌వైజర్లు యశోధ, మంగమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గూనపాలెం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, కల్యాణి, ఆదిలక్ష్మి, రత్నలక్ష్మి, బేబి, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి జీవన నైపుణ్య తరగతులు

శ్రీకాకుళం సిటీ: లైఫ్ స్కిల్స్ (జీవన నైపుణ్యాలు)పై వారం రోజులపాటు తరగతులు నిర్వహిస్తున్నట్టు ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కోర్సు సమన్వయకర్త బీకే జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ సౌజన్యంతో ప్రజాపతి బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలం వారం రోజుల పాటు ఈ కోర్సును నిర్వహిస్తుందని చెప్పారు. ఆగస్ట్ 11 నుంచి 17 తేదీవరకు చినమండలవీధిలోగల తమ సంస్థ భవనంలో తరగతులు జరుగుతాయని చెప్పారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

శ్రీకాకుళం సిటీ:సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం కొనసాగించాలని రిమ్స్ కార్మికులకు ఏపీ ప్రభుత్వ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సాయిప్రసాద్ పిలుపునిచ్చారు. దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మహిళలను, ఉద్యోగులను రోడ్డున పడేయడం తగదన్నారు. ప్రభుత్వవిధానాలను గుర్తించి వచ్చే ఎన్నికల్లో ఉద్యోగులు తమ సత్తా చూపాలన్నారు.

వసతి లేదు..వైద్యం అందదు

- **శిథిలావస్థలో భవనాలు**
- **ఇదీ మందస పశువైద్య కేంద్రం దుస్థితి**

మందస: మందస పశువైద్య కేంద్రం అరకొర వసతులతో నడుస్తోంది. పూర్తిస్థాయిలో వసతిలేక వైద్యం అందని దుస్థితి నెలకొంది. 20 సంవత్సరాల కిందటే ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. అప్పటి ప్రణాళిక ప్రకారం నిర్మించిన ఈ కేంద్రంలో సిబ్బంది పని చేయడానికి, మందుల నిల్వకు తగినంత వసతి సౌకర్యం లేక ఉద్యోగులకు ఇబ్బందులకు గురవుతున్నారు. సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు, మరుగుదొడ్ల సౌకర్యం కొరవడింది.వైద్యులు పశువులకు చికిత్స చేసిన తరువాత చేతులు పరిశుభ్రం చేసేందుకు సరైన సౌకర్యం కరువైంది. కేంద్రానికి రక్షణగా ప్రహరీ లేక పందులు, ఆవులు, గేదెలు చొరబడుతున్నాయి. భవనానికి ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరగడంతో కేంద్రం వచ్చే వారంతా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పశువైద్య కేంద్రానికి మౌలిక వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.


పశువైద్య కేంద్రం కనిపించకుండా అల్లుకుపోయిన పిచ్చిమొక్కలు

పురాతన భవనంకావడంతో..



మందస పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరింది. పురాతన భవనం కావడంతో సిబ్బందికికావాల్సినవసతి సౌకర్యం లేదు.ఎల్లప్పుడు రైతులకు అందుబాటులో వైద్యులు లేక కేంద్రానికి వెళ్లే రైతులు ఇబ్బందిపడుతున్నారు.

-బెస్త కామేశ్వరరావు, మహేంద్రసంఘం నాయకులు

తాగునీటి సౌకర్యం కల్పించాలి



పశువైద్య కేంద్రంలో సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కరువయ్యాయి. అధికారులు ప్రహరీ గోడతో పాటు తాగునీటి, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రం చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి.

-సాహుకారు మోహనరావు, రైతు, మందస

సిబ్బంది అందుబాటులో ఉండాలి



ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది అందుబాటులో ఉండాలి. రైతులు పశువులతో వైద్యానికి వస్తే సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తిరిగి వెళ్లాల్సివస్తోంది. గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు ఇబ్బందిపడాల్సి వస్తోంది.

-ఎం.ఆనందరావు, రైతు, మందస

ఎంఆర్ టీకాలు వినియోగించుకోండి

ఎంపీపీ వసంతరావు



సిరిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, విద్యార్థులు, వజ్రపుకొత్తూరులో రూబెల్లా టీకా వేస్తున్న వసంతరావు

వజ్రపుకొత్తూరు:ఎంఆర్ టీకాలు వినియోగించుకోవాలని ఎంపీపీ గొరకల వసంతరావు పిలుపునిచ్చారు. మంగళవారం వజ్రపుకొత్తూరు హైస్కూల్ ఆవరణలో రూబెల్లా టీకాలు వేసే కార్యక్రమాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 38రోజులపాటు ఈ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఒక్కో టీకా రూ.1500 కాగా, ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇరోతు హేమంతరాజు, ఎంపీడీవో తిరుమలరావు,హెచ్ఎం సారథినాయుడు, వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యుడు సంపతిరావు,నర్సు లక్ష్మీనారాయణ, సీహెచ్‌వో శ్యామలరావు పాల్గొన్నారు. ● అక్కుపల్లి హైస్కూల్ ఆవరణలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సూరాడ మోహనరావు రూబెల్లా టీకాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు సుధీర్, సర్పంచ్ కాస హైమావతి, గ్రామాభివృద్ధి సంఘ అధ్యక్షుడు పురుషోత్తం పాల్గొన్నారు.

మందసలో...

మందస: మందస ఎస్‌ఆర్‌ఎస్ఎం జిల్లా పరిషత్ హైస్కూల్‌లోఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని సర్పంచ్ డొంకూరు త్రివేణి, వైద్యాధికారి తమ్మినేని పాపినాయుడు ప్రారంభించారు.పీహెచ్‌సీ పరిధిలోని ప్రాథమిక,ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండు వేలమంది పిల్లలకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డొంకూరు తిరుపతి, సభ్యులు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

సిరిపురంలో...

సిరిపురం(హరిపురం):మందస మండలంలోని సిరిపురం హైస్కూల్ విద్యార్థులతో రుబెల్లా టీకాపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీకా వినియోగంపై అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సిరిపురం పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఆర్.సూర్యకళ, హెచ్ఎం పాలవలస విజయ్‌కుమార్, ఏఎన్ఎంలు రూప, లక్ష్మి పాల్గొన్నారు.

కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్‌లో...

పలాస: ఎంఆర్‌వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ కోత పూర్ణచంద్రరావు కోరారు. కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్‌లో మీజిల్స్, రూబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లా కృష్ణారావు, వైద్యులు మనోహర్, హెచ్ఎం అనంతరావు, మోహనదాస్, బల్లశ్రీను, లక్ష్మణ్, వైద్యసిబ్బంది గోపాల్ పాల్గొన్నారు.

తోటూరు రెవెన్యూలో భూరికార్డుల మాయంపై విచారణ ముమ్మరం

పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: తహసీల్దార్

శాసనం(పలాస):పలాస మండలంలోని తోటూరు రెవెన్యూ పరిధిలో భూ రికార్డులు మార్చేసిన వైనంపై విచారణ వేగవంతం చేశామని తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సోమవారం గ్రీవెన్స్‌లో ఆ గ్రామానికి చెందిన రైతులు రికార్డులు మాయంచేయడంపై ఫిర్యాదు ఇవ్వడంతో మంగళవారం నుంచి ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. సంబంధించిన రికార్డులు గత ఏడాది మార్చి, మే నెలల్లోనే మార్చినట్లు తమ పరిశీలనలో తేలిందని తెలిపారు. సనపల నిర్మల, బాబూరావు, రోణంకి చంద్రయ్య, గుండమ్మ, ఎం.కమలమ్మ, కంచరాన కృష్ణారావుతో పాటు మరికొంతమంది రైతులు సర్వే నెంబరు 222/5, 220/2లో తమ భూములు ఉండగా దానిని నెంబరుకాస్త మార్చి నలుగురు వ్యక్తులు ఆ భూములు అమ్మారని చెప్పారు.ఈ వ్యవహారం ఇటీవల నిర్వహించిన రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమంలో బయటపడడంతో రైతులు ఖంగుతిన్నారు. తమకు చెందిన అడంగల్ కాపీలు, కంప్యూటర్ అడంగళ్లలో మిగిలిన వారి పేర్లు ఏ విధంగా ఎక్కాయో అధికారులే తెలియజేయాలని వారు తహసీల్దార్‌ను ప్రశ్నించారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వారికి హామీఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక బృందం గ్రామంలో అదే సర్వే నెంబర్‌లో ఉన్న భూములను పరిశీలించింది. వాస్తవాలు పరిశీలించి నిజమైన రైతులకు వారి భూములను అందజేస్తామని, కంప్యూటర్‌లో తప్పుడు సర్వే నెంబర్లు వేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటండి

నెహ్రూనగర్(పలాస):ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు కోరారు. మంగళవారం నెహ్రూనగర్ జామియా మసీదులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల వద్ద మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బల్ల శ్రీను, పృథ్వి, లక్ష్మణ్, ఎస్‌కే.బాషా పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న చైర్మన్ పూర్ణచంద్రరావు



టీకాలు వేస్తున్న కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్

విద్యార్థులకు రూబెల్లా టీకాలు

తిలక్‌నగర్(పలాస):తిలక్‌నగర్ బీఈటీ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు 15వవార్డు కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మంగళవారం మిజిల్స్, రూబెల్లా టీకాలు వేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాదరావు, శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.అదే విధంగా పలాస ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీకాలను సీహెచ్‌సీ చైర్మన్ గాలి కృష్ణారావు, కమిషనర్ పి.జగన్మోహనరావు వేశారు.

పలాస ఎంఈవోగా కృష్ణంరాజు

పలాస:పలాస ఎంఈవోగా జె.కృష్ణంరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సోంపేట మండలంలోని మామిడిపల్లి హెచ్‌ఎంగా పని చేస్తూ పదోన్నతిపై ఎంఈవోగా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

ఒడియా బ్రాహ్మణులకు రేషన్ పంపిణీ



సరకులు అందజేస్తున్న ఒడియా బ్రాహ్మణ సంఘ సభ్యులు

పలాస:పేద ఒడియా బ్రాహ్మణులకు రేషన్ సరుకులు అందించి వారిని ఆదుకోనున్నట్లు ఒడియా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌త్యాడి, కార్యదర్శి బాబూరావు పండా తెలిపారు. మంగళవారం చిన్నబ్రాహ్మణవీధిలో పదిమంది పేద ఒడియా బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులను అందజేశారు.కార్యక్రమంలో ఒడియా బ్రాహ్మణ సంఘ సభ్యులు రాఘవపండా, ప్రసాద్‌పాత్రో, ఈశ్వర్ పాత్రో, రాముపండా, శంకర్‌పాణిగ్రాహి పాల్గొన్నారు.

చంద్రన్న బీమా పంపిణీ




బీమా నగదు అందజేస్తున్న ఫల్గుణరావు

గంగువాడ(పలాస): మండలంలోని కేదారిపురం పంచాయతీ పరిధిలో గల గంగువాడ గ్రామానికి చెందిన ఎ.గోపాల్ సోమవారం మృతిచెందడంతో ఆయన భార్య భూదేవికి చంద్రన్న బీమా నగదు రూ.ఐదువేలు సర్పంచ్ కనగల ఫల్గుణరావు, తెలుగుయువత అధ్యక్షుడు పోలాకి పాపారావు అందజేశారు. కార్యక్రమంలో వి.ఫల్గుణరావు, వి.రాంబాబు పాల్గొన్నారు.

అప్పయ్యదొర జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ

వజ్రపుకొత్తూరు:మండలంలోని మహదేవపురం గ్రామానికి చెందిన డాక్టర్ దుర్గాప్రసాద్ మాజీ ఎంపీ, దివంగత హనుమంతు అప్పయ్యదొర జీవిత చరిత్ర, ఆయన పార్లమెంటులో ముస్లిం లా బిల్లుపై చేసిన సుదీర్ఘ ప్రసంగంపై రచించిన పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీఎం అప్పయ్యదొరతో ఉన్న తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారని దుర్గారావు తెలిపారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్

యథేచ్ఛగా అనధికార లేఅవుట్లు !

చోద్యంచూస్తున్న మున్సిపల్‌టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులు

పలాస:పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల పరిధిలో అనధికార లేఅవుట్లు యథేచ్ఛగా ఏర్పాటవుతున్నా, మున్సిపల్, రెవెన్యూ అధికారులు చోద్యంచూస్తున్నారు.అనుమతిలేని లేఅవుట్లల్లో ప్లాన్ అప్రూవల్ ఇచ్చే ప్రసక్తేలేదని అధికారులు ప్రచారం చేస్తున్నా స్థలాలు అమ్మకాలుఆగడంలేదు. తెలియక కొనుగోలు చేసిన వినియోగదారులు ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మించేందుకు ప్రతిబంధకాలు ఎదురవుతుండడంతో వారు లబోదిబోమంటున్నారు. అనధికార లేఅవుట్ల ఏర్పాటుపై మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలిసినా నివారణకు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

●పెసరపాడు రోడ్డులో పంటపొలాల్లో అనధికార లేఅవుట్లు ఎక్కువగా ఏర్పాటుచేస్తున్నారు. ●చిన్నబాడాం పాతజాతీయరహదారికి ఆనుకొని 20 ఎకరాల్లో అనధికారికంగా లేఅవుట్ వేసి రాళ్లు పాతారు. ఇక్కడ అధికారులు వాటిని తొలగించి చర్యలు తీసుకున్నా, మళ్లీ మొదటి పరిస్థితికి చేరుకుంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో స్థలాల అమ్మకాలు జోరందుకుంటున్నాయి. ●గరుడఖండి వద్ద రెండున్నర ఎకరాల్లో అనధికార లేఅవుట్ వేశారు. ●పలాస-కేదారిపురం రూటులో 10 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. భూమి బదలాయింపు జరగకపోవడంతో విజిలెన్స్ అధికారులు సైతం లేఅవుట్‌పై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు నోటీసులు జారీ చేశారు.●కోసంగిపురం, గొప్పిలిరూటు, శాసనం, తాళభద్ర, రాజాం కాలనీ ప్రాంతాల్లో కూడా అనధికార లేఅవుట్లు వెలిశాయి. వీటిద్వారా రూ.16 కోట్లు వరకు అపరాధరుసుం వసూళ్లు చేయాలని విజిలెన్స్ అధికారులు నివేదిక ఇవ్వడంతో అనధికార లేఅవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవలసి ఉంది.

గుర్తించాం..

అనధికార లేఅవుట్లను ఇప్పటికే గుర్తించామని పలాస-కాశీబుగ్గ పురపాలకసంఘం టీపీఎస్ హెచ్.సత్యనారాయణ తెలిపారు. అటువంటి స్థలాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టామని చెప్పారు. కొంతమందికి నోటీసులు ఇచ్చామని, ప్రకటన బోర్డులు, ఆయా ప్రాంతంలో వేసిన పలకలు తొలగించి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు.



చిన్నబడాం వద్ద ఓ అనధికార లేఅవుట్

ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

- ●సెంటర్ డివైడర్లు.. జిగిజాగ్ సిస్టం ఏర్పాటు
- ●డ్రైవర్లు రాత్రి నిద్రపోకుండా టీ పంపిణీ
- ●జాతీయ రహదారిపై అడుగడుగునా నిఘా

పలాస: జాతీయరహదారిపై ప్రమాదాల నివారణకు కాశీబుగ్గ పోలీసులు పకడ్బందీ చర్యలు ప్రారంభించారు. అడుగడుగునా నిఘా ఏర్పాటుచేశారు.ప్రధాన కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు, లైట్లు, బారికేడ్లు ఏర్పాటుచేస్తూ వాహనచోదకులను అప్రమత్తం చేస్తున్నారు. కాశీబుగ్గ సబ్‌డివిజన్‌లోగల టెక్కలిలో జగతిమెట్ట జంక్షన్, టెక్కలి బైపాస్ రోడ్డు, తామరాపల్లి, నందిగాం జంక్షన్, సుబద్రాపురం, బెండిగేటుజంక్షన్, కేదారిపురం జంక్షన్, కోసంగిపురం జంక్షన్, రామకృష్ణాపురం, రంగోయి, మందస బైపాస్‌రోడ్డు, పాలవలస గేటు, ఇచ్ఛాపురం, కొర్లాం జంక్షన్ ప్రాంతాలు ప్రమాదకరమైనవిగా గుర్తించారు. ఇందులో ప్రముఖంగా ఉన్న జంక్షన్ వద్ద హెచ్చరిక సోలార్‌లైట్లను ఏర్పాటు చేసి వాహనచోదకులను అప్రమత్తం చేశారు. సెంటర్ డివైడర్లను ఏర్పాటుచేసి రోడ్డుపై ఒకే వాహనం వెళ్లే విధంగా జిగ్‌జాగ్ సిస్టంలో వాహనాలకు దారి కల్పించారు.

40 కిలోమీటర్లకు ...పెట్రోలింగ్ వాహనం

దీనికితోడు సబ్‌డివిజన్‌లో 40 కిలోమీటర్లకు ఒక పెట్రోలింగ్ వాహనాన్ని ఆధునిక హంగులతో సమకూర్చారు. ప్రమాదాలు జరగ్గానే ఆ వాహనం ముందుగా వైద్యసిబ్బందికి అప్రమత్తం చేయడంతో పాటు క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రికి తరలించేందుకు దోహదపడుతుంది. దీనికితోడు రాత్రి గస్తీని సైతం ఏర్పాటు చేశారు. వాహన డ్రైవర్లకు తాగునీరు, టీ ఇచ్చి వారు నిద్రపోకుండా వాహనాలను నడిపే విధంగా అప్రమత్తం చేస్తున్నారు. దీంతో నెలరోజులుగా ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని కాశీబుగ్గ డీఎస్పీ సీహెచ్.వివేకానంద 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ప్రమాదాలు జరగకుండా తమ వంతు ప్రయత్నంగా వాహనచోదకులు కూడా జాగ్రత్త వహించాలని, నిబంధనల ప్రకారం వాహనాలు నడిపితే ఎటువంటి ప్రమాదాలు జరగవని అభిప్రాయపడ్డారు.



కోసంగిపురం జంక్షన్ వద్ద స్టాపర్లు ఏర్పాటుచేసిన పోలీసులు

సినిమాలు

పలాస- కాశీబుగ్గ

హరిశంకర్--ఫిదా
రవిశంకర్-ఏజెంట్ భైరవ
భాస్కరరామ-వాసుకి
శ్రీవెంకటేశ్వర-నిన్నుకోరి
అన్నపూర్ణ-గౌతమ్‌నంద

మందస

మహేంద్ర....గౌతమ్‌నంద

వంశధార కాలువల్లో పిచ్చిమొక్కలు

●బలహీనంగా ఉన్న గట్లు ● శివారు ప్రాంతాలకు సాగునీరు ప్రశ్నార్థకం ● ఉభాలు ప్రారంభం

పలాస:వంశధార కాలువలు ఆధునికీకరణకు నోచుకోకపోవడంతోపాటు కాలువంతా పిచ్చిమొక్కలు పెరగడంతో శివారు ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ప్రవాహం తగ్గడంతో సాగునీరు అందే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. పదిరోజుల కిందట నీరు విడుదల చేసినా ప్రవాహం తక్కువగా ఉండడంతో పిల్లకాలువల మాదిరిగా మారింది.దీనికి తోడు నిర్వహణలోపం వల్ల గట్లన్నీ బలహీనంగా మారడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు సంబంధించి మోదుగులపుట్టి వద్ద వంశధార కాలువ ప్రారంభమవుతుంది. పలాస మీదుగా దేశబట్టిలోకి ప్రవేశించి అక్కడ నుంచి వజ్రపుకొత్తూరు మండలంలోని ఆయకట్టుకు నీరుచేరుతుంది. మొత్తం వంశధార ఆధారంగా 5,500 ఎకరాల సాగు నీరందాల్సిఉంది. ఉభాలు ప్రారంభం అవుతున్న తరుణంలో నీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి నీటి ఫ్లో పెంచి శివారు ఆయకట్టుకు అందించాలని రైతులు కోరుతున్నారు.



మోదుగులపుట్టి వద్ద
వంశధార కాలువలో పెరిగిన మొక్కలు

వానరం హల్‌చల్

● పాలకొండలో ఇళ్లలో చొరబడి బీభత్సం
● సామగ్రి చిందర వందర చేసిన వైనం


ఓ ఇంటిపై ఉన్న వానరం

పాలకొండ టౌన్: పాలకొండ నగరపంచాయతీలో మంగళవారం వానరం హల్‌చల్ చేసింది. నాయుడు నగర్, మురళీమోహన్‌నగర్ తదితర కాలనీల్లో ఇళ్లలోకి చొరబడి బీభత్సం సృష్టించి సామగ్రి చిందర వందర చేసింది. దీంతో మహిళలు, వృద్ధులు భయాందోళన చెందారు. ఏ వక్క నుంచి ఇంట్లోకి చొరబడి వస్తువులను పాడుచేయడంతోపాటు తమపై దాడి చేస్తుందనే భయంతో బిక్కుబిక్కుమని గడిపారు. కొద్దిరోజులుగావానరం పాలకొండలో అన్ని కాలనీల్లోను తిరుగుతోందని పలువురు చెబుతున్నారు.

6న జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

శ్రీకాకుళం సిటీ: కడప జిల్లా ప్రొద్దుటూ రులో జరగనున్న రాష్ట్ర స్థాయి సౌత్‌జోన్ పోటీలో పాల్గొనే జిల్లా అథ్లెటిక్స్ జట్లను ఈనెల ఆరోతేదీన ఉదయం తొమ్మిది గంటలకు శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో ఎంపికచేస్తామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, ఎన్.విజయ్‌కుమార్ తెలిపారు.అండర్-14, 16, 18, 20 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల వారు వయస్సు ధ్రువీకరణపత్రం, మూడు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో కేఆర్ స్టేడియానికి హాజరు కావాలని కోరారు.

గాయపడిన వ్యక్తి మృతి

పొందూరు:మండలంలోని బురిడి కంచ రాంవద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన పట్ట శ్రీరాములు(59)శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్టు ఎస్సై ఎస్.బాలరాజు తెలిపారు. శ్రీరాములు కుమారుడు పట్టా అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

హడ్డుబంగి రోడ్డు బురదమయం


బురదమయమైన హడ్డుబంగి-గైర రోడ్డు

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి హడ్డుబంగి నుంచి గైర వెళ్లే రోడ్డు బురదమయమైంది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పైకి నీరు చేరింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

సత్యసాయినగర్‌లో...

పర్లాకిమిడి మున్సిపాల్టీలో పరిధిలోగల 15వ వార్డు సత్యసాయినగర్‌లో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమమైంది. బయటకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడం, రోడ్డంతా నీటిమయం కావడంతో అవస్థలుపడుతున్నారు.

చురుగ్గా హాస్టల్ నిర్మాణం

పర్లాకిమిడి: సెంచ్యూరియన్ పబ్లిక్ పాఠశాల వెనుకభాగంలో రూ.80లక్షల వ్యయంతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ భవన పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులు పురపాలక సంఘం సాంకేతిక సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. మూడు నెలల్లో నిర్మాణం పూర్తవుతుందని మున్సిపాల్టీ అధ్యక్షురాలు లలిత తెలిపారు. హాస్టల్ నిర్మాణం పూర్తయితే జిల్లాలో ఉద్యోగినుల అవస్థలు తీరుతాయి.


నిర్మాణంలో ఉన్న హాస్టల్

ఒడిశా

ముగిసిన మావోయిస్టు వారోత్సవాలు

పర్లాకిమిడి: వారంరోజులుగా జరుగుతున్న మావోయిస్టు వారోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. గతనెల 28న ఈ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పోలీసులు ఏజెన్సీ గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కూడళ్ల వద్ద భద్రత పెంచారు.

సబ్‌కలెక్టర్‌గా రంజన్‌కుమార్‌బిస్వాల్

పర్లాకిమిడి: పర్లాకిమిడి సబ్‌కలెక్టర్‌గా రంజన్‌కుమార్‌బిస్వాల్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన గజపతి జిల్లా ఉపతహసీల్దార్‌గా పని చేశారు. గంజాం జిల్లా సెరగడ బీడీవోగా పని చేసి ఇక్కడకు పదోన్నతిపై వచ్చారు. ఇప్పటి వరకు సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన అనంత రణ్‌పాత్రో సర్వశిక్షఅభియాన్ డిస్ట్రిక్ట్‌ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టారు. సబ్‌కలెక్టర్‌గా పూర్తి అవగాహన ఉండడంతో జిల్లా విద్యావ్యవస్థను గాడిలో పెడతారని పలువురు భావిస్తున్నారు.

ఎఫ్‌ఆర్‌ఏతో గిరిజనులకు లబ్ధి

● హక్కు పత్రాలు అందజేస్తాం
● కలెక్టర్ ధనుంజయరెడ్డి

(శ్రీకాకుళం-కలెక్టరేట్): అటవీహక్కుల చట్టంతో (ఎఫ్ఆర్ఏ) గిరిజనులకు లబ్ధి చేకూర్చుతామని కలెక్టర్ కె.ధనుంజయరెడ్డి తెలిపారు.మంగళవారం కలెక్టరేట్‌లో అటవీ హక్కుల చట్టం, గిరిజన ప్రాంతాల్లో సాగు చేస్తున్న భూములకోసం హక్కు పత్రాలకు దరఖాస్తు చేసుకున్న వ్యక్తిగత, సామాజిక అభ్యర్థనలపై గిరిజనాభివృద్ధి సంస్థ, అటవీ శాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సాగుచేస్తున్న భూములకు సంబంధించి లబ్ధిదారులకు అటవీ హక్కుల దినోత్సవం రోజున హక్కుపత్రాలు అందజేస్తామని చెప్పారు. గిరిజన ప్రాంతంలో 2005 అటవీ హక్కు చట్టం పూర్తిగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. హక్కు పత్రాలు పొందితే గిరిజనుల్లో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు వారి కుటుంబాలకు జీవనాధారం లభిస్తుందన్నారు. 8,896. 23 ఎకరాలకు సంబంధించి 3,439 వ్యక్తిగత అభ్యర్థనలు వచ్చాయని గిరిజనాభివృద్ధి సంస్థ, అటవీశాఖాధికారులు తెలిపారు. టెక్కలి డివిజన్‌కు సంబంధించి 176 దరఖాస్తులు వచ్చాయని వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తొమ్మిది ఆమోదించినట్లు చెప్పారు.

జాబితాను సిద్ధంచేయాలని ఆదేశం

గ్రామ, మండల, డివిజన్ స్థాయి రెవెన్యూ, అటవీశాఖ అధికారులు జాగ్రత్తగా పరిశీలించి అర్హుల జాబితాను తయారు చేయాలని, అవకతవకలు జరిగితే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. గ్రామ అవసరాలు పరిగణలోకి తీసుకొని జాబితా రూపొందించాలని చెప్పారు. కేదారిసంగిపైన కొండ ఎగువ ప్రాంతంలో 15 గిరిజన కుటుంబాలకు వైద్యం అందక ప్రసవ సమయాల్లో ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్‌కు ఐటీడీఏ పీవో ఎల్.శివశంకర్ వివరించా రు. కొండ దిగువ ప్రాంతంలో వారికి నివాస గృహాలు నిర్మించి ఇవ్వాలని, కొండ ప్రాంతం సాగుచేసు కునే విధంగా అవకాశం కల్పించాలని సూచించారు. ఎనుగుల సంచారం చేసే ప్రదేశాల్లో ప్రత్యేక కచర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి పి.శాం తిస్వరూప్, టెక్కలి, పాతపట్నం, కాశీబుగ్గ ఫారెస్టు రేంజర్లు జగదీశ్వరరావు, సంజయ్ కెల్ల, సోమశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.


గిరిజనాభివృద్ధి, అటవీశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ధనుంజయరెడ్డి

17న ఆదిత్యుని నిజరూప దర్శనం

అరసవల్లి: అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారు ఈనెల 17నభక్తులకు నిజ రూపంలో దర్శనమివ్వనున్నారు. ఆరోజు ఉదయం నాలుగు గంటలకు క్షీరాభిషేకం జరగనుంది. సింహ సంక్రమణం (హరిపద పుణ్య కాలం) పడడంతో స్వామి వారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార పంచా మృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించనున్నట్లు ఆలయ వంశపార్యం పర్య అర్చకులు ఇప్పిలి రాజేశ్వర కాష్యప (నగేష్‌శర్మ) తెలిపారు. అభిషేకసేవ అనంతరం స్వామివారు 30 నిమిషాల పాటు నిజ రూపంలో దర్శమివ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ సేవలో పాల్గొనే భక్తులు తెల్లవారుజామున 3:30 నిమిషాలకే చేరుకోవాలని, ముందు రోజు సేవా టికెట్లు కొనుగోలు చేసుకోవాలని ఆయన తెలిపారు.

వాల్తేరులో ఐదిళ్లు భస్మీపటలం

కట్టుబట్టలతో వీధిన పడిన బాధితులు


వాల్తేరులో అగ్నికి ఆహుతవుతున్న ఇల్లు

వాల్తేరు(సంతకవిటి):మండలంలోని వాల్తేరులో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన గురుగుబెల్లి లక్ష్మి, నర్సింగరావు, కొండలరావు, కె.శ్యామలరావు, పైడి వరహాల నాయుడుకు చెందిన ఇళ్లు భస్మీపటలమయ్యాయి.దీంతో కట్టుబట్టలతో వీధిన పడ్డారు. లక్ష్మి ఇంట్లో దీపం ఒత్తులు ఎలుకలు తీసుకుపోవడం వల్ల అగ్ని ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే నర్సింగరావు, కొండలరావు, శ్యామలరావుకు టుంబాలు వలస వెళ్లడంతో లక్ష్మి, వరహాల నాయుడు ఆ వీదిలో నివాసముంటున్నారు. ఒక్కసారిగి మంటలు ఎగిసిపడడంతో అదుపు చేయడానికి స్థానికులు సిద్ధం కాగా ఇళ్లలో గ్యాస్ దిమ్మలు ఉంటాయని భయంతో స్థానికులు సాహసించలేకపోయారు. ఐదిళ్లు పూర్తిగా ఆహుతికావడంతో సర్వం కాలి బూడిదైై బాధితులు వీధిన పడ్డారు. పొందూరు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినా సకాలంలో సంఘటన స్థలానికి చేరుకోక పోవడంతో ఇళ్లు కాలి బూడిదయ్యాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైలు నుంచి జారిపడి వలస కూలీ మృతి


రమేష్ మృతదేహం

ఏలూరుక్రైం/సీతంపేట : వేగంగా వెళ్తున్న రైలు నుంచి శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండలంలోని పెద్దూరుకు చెందిన వలస కూలీ ఊయక రమేష్ జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని దెందులూరు మండలం అలుగులగూడెం రైల్వే గేటు వద్ద మృతదేహాన్ని మంగళవారం ఉదయం ఏలూరు రైల్వే పోలీసులు గుర్తించారు. దీన్ని గమనించిన రైల్వే పోలీసులు రమేష్ ఆధార్‌కార్డు ఆధారంగా పెద్దూరులో ఉన్న కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మృతదేహం కోసం ఏలూరుకు వెళ్లారు. రమేష్‌కు భార్య రామలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమేష్ బతుకుతెరువు కోసం కుటుంబంతో గత నెలలో గుంటూరు వలసవెళ్లాడు. అక్కడ కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నాడు. అయితే గ్రామంలో వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనుల నిమిత్తం వరినాట్లు వేసుకునేందుకు పెద్దూరుకు వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు రైల్వే ట్రాక్‌పై పడిపోయాడు. కాగా వివరాలు ఏలూరు రైల్వే కానిస్టేబుల్ ఎం.విజయ్‌చంద్ర, సెల్ నెంబర్ 94917 23918కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. రైల్వే ఎస్‌ఐ పి.సైమన్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

'వంశధార' జాప్యానికి కారణమేంటి?

● నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాం ● అయినా పనులు ఎందుకు పూర్తికావడం లేదు ● జిల్లా ప్రగతికి ప్రతిఒక్కరూ సహకరించాలి ● మంత్రి అచ్చెన్నాయుడు



కలెక్టర్, ఎస్పీ, జేసీతో సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

నిమ్మాడ(కోటబొమ్మాళి) : నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేశాం.. అయినా వంశధార ప్రాజెక్ట్ పనులు ఆలస్యమవుతు న్నాయి.. దీనికి కారణమేంటని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖా మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడు అధికారులను ప్రశ్నించారు. మంగళవారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ధనుంజయరెడ్డి, ఎస్పీ త్రివిక్ర మవర్మ, జేసీ చక్రధర్‌బాబుతో మంత్రి అచ్చెన్న పలు అంశాలపై సమీక్షించారు. గడువు సమీపిస్తున్నా వంశధార ప్రాజెక్టు పనులు పూర్తి కాకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. నిర్వాసితుల కోసం కలెక్టర్ కార్యాలయంలోనే ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని, వచ్చిన ఫిర్యాదుల మేరకు 70మందికి పరిహారం కూడా చెల్లించామన్నారు. మిగతా వారికి కూడా పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని చెప్పారు. త్వరితంగా వంశధారను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భావనపాడు పోర్టు నిర్మాణంలో మరింత చొరవ చూపాల న్నారు. సర్వే పూర్తిచేసి అదానీ గ్రూప్‌కు నివేదికలు అందజేయాల న్నారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపించే దుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి కోరారు.

రోడ్డు భద్రతను పెంచండి

జిల్లాలో రోడ్డు భద్రతను మరింతగా పెంచి ప్రమాదాలను నివారించాలని ఎస్పీ త్రివిక్రమవర్మకు సూచించారు. ఈ సందర్భంగా డీజీపీ సాంబశివరావుతో ఫోన్‌లో మాట్లాడి.. జిల్లాకు మరో పది పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు అవసరమని కోరారు. దీనిపై డీజీపీ సాను కూలంగా స్పందించి పది రోజుల్లో పెట్రోలింగ్ వాహనాలను ఇస్తున్నట్టు తెలిపారు. ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి మరింత నిఘా పెంచాలని మంత్రి పేర్కొన్నారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు, కారు డ్రైవర్లు సీటుబెల్టులు ధరించేలా చర్యలు చేపట్టాల న్నారు. ఈనిబంధనలను కఠినతరం చేయాలన్నారు. ఒడిశా నుంచి సారా దిగుమతిని నిర్మూలించేందుకు సరిహ ద్దులతో పాటు పలుచోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. గ్రామాల్లో, రహదారుల పక్కన బెల్టుషాపులు లేకుండా చూడాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో టెక్కలి, పాలకొండ ఆర్డీవోలు వెంకటేశ్వరరావు, గున్నయ్య, పోలీస్‌ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న రైతులు

హైవే కెనాల్ సర్వేకు బ్రేక్

● అధిక పరిహారం చెల్లించాలని కొమ్మువలస గ్రామస్థుల డిమాండ్

కొమ్మువలస(ఎల్ఎన్‌పేట) : హిరమండలం వద్ద ఫేజ్-2 ప్రాజెక్టు నుంచి నాగావళి నదికి అనుసంధానం చేసే హైలెవల్ కెనాల్‌కు సంబంధించిన సర్వేను కొమ్మువలస గ్రామస్థులు మంగళవారం అడ్డుకున్నారు. భూములను సర్వే చేసేందుకు వచ్చిన వంశధార ఇంజినీరింగ్ అధికారులు, సర్వేయర్లను రైతులు పి.తమ్మినాయుడు, పి.ధర్మారావు, ఎస్.అప్పలనాయుడు, కె.అప్పలనాయుడు, తదితరులు అడ్డగించారు. హైలెవల్ కెనాల్‌లో విలువైన భూములు కోల్పోతున్నామని, కానీ నష్టపరిహారం మాత్రం తక్కువ చెల్లిసున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన నష్టపరిహారం కంటే అధికంగా చెల్లిస్తే సర్వేకు సహకరిస్తామని తెలిపారు. దీనిపై వంశధార ఈఈ సీతారాంనాయుడు స్పందిస్తూ... భూములకు నష్టపరిహారం పెంచే అధికారం ఇంజినీరింగ్ అధికారులకు లేదన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తామన్నారు. అయినప్పటికీ రైతులు శాంతించకపోవడంతో అక్కడ నుంచి అధికారులు వెనుతిరిగారు. కార్యక్రమంలో డీఈలు ఏ.మురళీమోహన్, డి.శ్రీనివాస్‌రావు, జేఈలు దిలీప్, కిషోర్, రంజిత్, జగదీష్, సర్వేయర్లు శాంతారావు, ప్రేమకుమార్, తదితరులు పాల్గొన్నారు.

శతశాతం భూ రికార్డుల క్రమబద్ధీకరణ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

నరసన్నపేట: జిల్లాలోని మూడు డివిజన్‌ల పరిధిలో 73 రెవెన్యూ గ్రామాల్లో శతశాతం భూ రికార్డులను క్రమబద్ధీకరించినట్టు శ్రీకాకుళం ఆర్డీవో బలివాడ దయానిధి తెలిపారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జమ్ము జంక్షన్ వద్ద భూములను ఆయన మంగళవారం పరిశీలించారు. 73 గ్రామాల్లో ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామసభల ఆమోదం మేరకు వెబ్‌ల్యాండ్‌లో అప్‌గ్రేడ్ చేశామన్నారు. తొలివిడతలో టెక్కలి డివిజన్‌లో 24, శ్రీకాకుళంలో 24, పాలకొండ డివిజన్‌లో 25 రెవెన్యూ గ్రామాల్లో భూ రికార్డులను క్రమబద్ధీకరించినట్టు ఆయన చెప్పారు. రైతులకు డిజిటల్ పాస్‌పుస్తకాలను అందజేయనున్నట్టు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. నరసన్నపేట తహసీల్దార్ జల్లేపల్లి రామారావు, జలుమూరు తహసీల్దార్ ప్రవల్లిక, సర్వేయర్ పంగ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలోనే ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణమూర్తి

● గిరిజన సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను తెలియజెప్పాలి ● గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోలక

సీతంపేట: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఏజెన్సీ కేంద్రం సీతంపేటలోనే నిర్వహించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోలక లక్ష్మణమూర్తి తెలిపారు. ఆదివాసీ గిరిజనుల సమస్యలపై మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. గిరిజనులు అధికంగా ఉన్న సీతంపేటను కాదని పాతపట్నంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించడం సమంజసం కాదన్నారు. జిల్లా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే పులి పండగ, టెంక, ఆగమపండగ విశిష్టతను ఆదివాసీ దినోత్సవంలో తెలియజేయాలని ఆయన కోరారు. గిరిజన బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యాప్రమాణాలు కుంటుపడకుండా ఐటీడీఏ చర్యలు చేపట్టాలన్నారు. రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో జిల్లా గిరిజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాలక సాంబయ్య, పత్తిక కుమార్, ఎం.తిరుపతిరావు, సీఐటీయూ నాయకులు ఆరిక బాస్కరరావు, ఎం.లక్ష్మణరావు, తులసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మైదానాలను ఆహ్లాదకరంగా తయారు చేయండి

● రాష్ట్రక్రీడల మానిటరింగ్ అధికారి దేవానంద్

రేగిడి: విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు అనువుగా ఉండేలా మైదానాలను తయారుచేయాలని రాష్ట్ర క్రీడల మానిటరింగ్ అధికారి ఎల్.దేవానంద్ అన్నారు. మంగళవారం పనసలవలస ఉన్నత పాఠశాలలో ఉపాధి హామీ నిధులు రూ.4.09 లక్షలతో చేపడుతున్న ఆటస్థలం పనులను ఆయన పరిశీలించారు. మైదానాలను ఆహ్లాదకరంగా తయారు చేయాలని ఉపాధి ఏపీవో జి.అరుణకుమారికి సూచించారు. ఎత్తు పల్లాలు లేకుండా చదునుగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ఆటస్థలాలను వినియోగించుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలల మైదానాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడామైదాన అభి వృద్ధి అధికారి జి.శ్రీనివాసరావు, సర్పంచ్ గేదెల రామకృష్ణ, ఎంపీడీవో బాసూరి శంకరరావు, ఈసీ కె.కార్తీక్, హెచ్ఎం షణ్ముఖరావు, పీఈటీ కోటి చక్రధర్, కడగల నాగరాజు పాల్గొన్నారు.



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న దేవానంద్

కర్నూలుకు శ్రీకాకుళం బ్లూక్రాస్ సిబ్బంది

● కుక్కలకు సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు



శ్రీకాకుళం నుంచి కర్నూలుకు బయలుదేరుతున్న బ్లూక్రాస్ టీం

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలోని అన్ని మున్సిపాలిటీల్లో వీధి కుక్కల సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలలక్ష్యాలు పూర్తిచేసిన శ్రీకాకుళం బ్లూక్రాస్ సంస్థకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది. కర్నూలు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో దాదాపు 20వేల వీధి కుక్కలకు సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసేందుకు ఒప్పందం కుదిరింది. అలాగే, మెదడువాపు వ్యాధికి కారణమైన పందుల నియంత్రణ బాధ్యతను కూడా జిల్లా బ్లూక్రాస్ సిబ్బందికి అప్పగించారు. దీంతో మంగళవారం శ్రీకాకుళం నుంచి వందమందితో కూడిన బ్లూక్రాస్ టీం కర్నూలుకు బయలుదేరింది.

వంద మంది బిచ్చగాళ్లకు శిక్షణ

బ్లూక్రాస్ చైర్మన్ డాక్టర్ పి.సూర్య మాట్లాడుతూ, గతంలో శ్రీకాకుళంలో వీధికుక్కలు, పందుల నిర్మూలనను విజయవంతంగా చేపట్టామన్నారు. అయితే, కార్పొరేషన్ అధికారుల సూచనలమేరకు ప్రస్తుతం ఈ కార్యక్రమాన్ని నిలిపేశామన్నారు. అయితే, కర్నూలులో వీధి కుక్కలకు సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసేందుకు అవకాశం రావడం గర్వంగా ఉందన్నారు. దీనికోసం నగరంలోని వంద మంది బిచ్చగాళ్లకు శిక్షణ ఇచ్చి కర్నూలుకు పంపిస్తున్నట్టు చెప్పారు. తద్వారా వారికి ఉపాధి దొరుకుతుందన్నారు.


అకడమిక్ బ్లాక్‌లో ఏర్పాటుచేసిన రిసీవర్

వైఫై... ఫైఫైనే!

● యూనివర్సిటీ అంతటా అందని సిగ్నల్స్

● రూ.లక్షలు ఖర్చు చేసినా ఫలితం శూన్యమంటున్న విద్యార్థులు

(ఎచ్చెర్ల)

అధునాతన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చారన్న మాటేగాని, లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరలేదు. ఎచ్చెర్లలోని బీఆర్ అంబేద్కర్ వర్సిటీ క్యాంపస్ మొత్తం వైఫై పరిధిలోకి తీసుకురావాలన్న ఆలోచన మంచిదే... కానీ, ఎక్కడ లోపమో లక్ష్యం చేరలేదు. యూనివర్సిటీ పరిధిలో ఏర్పాటుచేసిన వైఫై పూర్తిస్థాయిలో పనిచేయడంలేదని సిబ్బంది, విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు. ఎవరిని కదిపినా వైఫై సక్రమంగా పనిచేయడంలేదనే చెబుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసిన వైఫై ఆశించిన స్థాయిలో పనిచేయకపోవడంతో వర్సిటీలో ఆందోళన వ్యక్తమవుతోంది. సుమారు రూ.78 లక్షల అంచనా వ్యయంతో వైఫై ఏర్పాటుచేయగా, సప్లయర్‌కు రూ.54 లక్షల వరకు ఖర్చు చేశారు. 2015లో ఏర్పాటుచేసిన వైఫై వల్ల పెద్దగా ప్రయోజనం చేకూరలేదంటున్నారు.

లోపం ఎక్కడ జరిగిందో...

అంబేద్కర్ వర్సిటీ క్యాంపస్ మొత్తం వైఫై సౌకర్యం తీసుకురావాలన్న ఆలోచన చాలా మంచిది. 2015లో అప్పటి వీసీ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ హయాంలో ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. విశాఖపట్నానికి చెందిన ఓ సంస్థకు వైఫై ఏర్పాట్ల బాధ్యతలను అప్పగించారు. రూ.78 లక్షల అంచనా వ్యయంతో దీనిని ఏర్పాటు చేశారు. వైఫై సక్రమంగా పనిచేయడంలేదన్న కారణంతో ఆ తర్వాత పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించలేదు. వీసీ చాంబర్‌కు పైభాగంలో వైఫైకు చెందిన పరికరాలను ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి క్యాంపస్ పరిధిలో 60 పాయింట్ల వరకు రిసీవర్లను ఏర్పాటుచేశారు. ప్రతి రిసీవర్ నుంచి 50 నుంచి 100 మీటర్ల దూరం వరకు వైఫై కనెక్ట్ కావాల్సి ఉంది. అయితే విరుద్ధంగా పనిచేస్తున్నట్టు చెబుతున్నారు. ఇందులో సుమారు 30 పాయింట్లలో రిసీవర్‌లు సక్రమంగా పనిచేయడంలేదు. రిసీవర్‌కు సిగ్నల్స్ సక్రమంగా అందని కారణంగా వైఫై సరిగా పనిచేయడంలేదు. దీని వల్ల ఇబ్బంది ఏర్పడుతున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. వీసీ చాంబర్, రిజిస్ట్రార్ కార్యాలయం, లేడీస్, బోయ్స్ హాస్టల్, ప్రిన్సిపాల్ ఆఫీస్, డీసీఎంఎస్, లా కళాశాల, అకడమిక్ బ్లాక్ తదితర పాయింట్ల వద్ద 60 రిసీవర్‌లను ఏర్పాటుచేశారు. ఇందులో 50 శాతం మాత్రమే పనిచేస్తున్నాయి. ఇన్‌స్టాలేషన్, లైసెన్సింగ్ సరిగా లేకపోవడం వల్లనే వైఫై పని చేయడంలేదని చెబుతున్నారు. వైఫై ఇన్‌స్టాలేషన్ చేసినప్పటి నుంచి ఏడాది వరకు సప్లయర్ నిర్వహణ బాధ్యతలు చూస్తామని చెప్పినప్పటికీ కేవలం రెండు మూడు నెలలు మాత్రమే చూశారు. అంతేకాదు కంట్రోల్ లాగిన్ కూడా ఇవ్వలేదని చెబుతున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా వైఫై సక్రమంగా పనిచేయకపోవడం పట్ల సిబ్బంది పెదవి విరుస్తున్నారు.


వీసీ చాంబర్ పై భాగంలో ఏర్పాటుచేసిన వైఫై పరికరాలు


వినియోగపడని రిసీవర్

రూ.54 లక్షలు చెల్లించాం



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో వైఫై రెండేళ్ల క్రితం ఏర్పాటైంది. ఇందుకు సంబంధించి 54 లక్షల రూపాయలు మాత్రమే చెల్లించాం. కొన్ని లోపాలు సవరించాల్సి ఉంది. పూర్తిస్థాయిలో వైఫై సౌకర్యం అందుబాటులోకి తేవాల్సి ఉంది.

- ప్రొఫెసర్ జి.తులసీరావు, రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ



అమ్మ తోడూ.. నాన్న నీడా.. లేదు!

కిడ్నీ వ్యాధి మహమ్మారి..... ఉద్దానాన్ని కబళిస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నో కుటుంబాలను ఛిద్రం చేస్తుండగా.. అభం శుభం తెలియని చిన్నారులు మాత్రం అనాథలుగా మారుతున్నారు. కుటుంబ పెద్దని కోల్పోయి నిర్భాగ్యులవుతున్నారు. ఏ సాయం అందక దిక్కులేని వారవుతున్నారు. చేతికందొచ్చిన వారిని కోల్పోయి.. వృద్ధులైన తల్లిదండ్రులు విలవిల్లాడుతుండగా... కన్నవారికి దూరమై.. చిన్నారులు బోరుమంటున్నారు. బెజ్జిపుట్టుగ, మజ్జిపుట్టుగ, పెద్ద శ్రీరాంపురం తదితర ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

● తల్లిదండ్రులను కబళిస్తున్న కిడ్నీ భూతం

● అనాథలుగా మారుతున్న చిన్నారులు

బెజ్జిపుట్టుగ(కవిటి రూరల్): బెజ్జిపుట్టుగకు చెందిన మహంకాళి మదన్ సుమారుగా నాలుగేళ్ల కిందట కిడ్నీ వ్యాధితో మరణించాడు. అయితే అక్కడికి నెలరోజులు గడవకముందే మదన్ భార్య సుజాత కూడా కిడ్నీ వ్యాధితో మృతి చెందింది. దీంతో వీరి పిల్లలు కాంచన, బాలరాజు అనాథులయ్యారు. ప్రస్తుతం కాంచన జగతి పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. బాలరాజు బెజ్జిపుట్టుగ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. అన్నీ తానై.. పెద్దమ్మ ఈశ్వరి ఈ పిల్లలను చూసుకుంటుంది. అయితే ఆమె ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే. వ్యవసాయ కూలి పనులు చేస్తూ పిల్లల ఆలనా పాలనా చూసుకుంటోంది. ఆమె పెళ్లి కూడా చేసుకోకుండా తన జీవితాన్ని చిన్నారుల కోసం త్యాగం చేసింది. అయితే ఈ పిల్లల చదువుల కోసం బెజ్జిపుట్టుగ మాజీ సర్పంచ్ ఎస్.పి.నారాయణ స్వామి ఏటా రూ.5వేలును పోస్టల్లో డిపాజిట్ చేస్తూ .. కొంత ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు.


బెజ్జిపుట్టుగకు చెందిన కాంచన, బాలరాజు

బెజ్జిపుట్టుగకు చెందిన గుర్రాల చంద్రశేఖర్, కాంతమ్మ 2014లో కిడ్నీ వ్యాధితో వీరిద్దరూ నెల రోజుల వ్యవధిలో కన్ను మూశారు. వీరికి ఇద్దరు కుమార్లు, ఒక కుమార్తె ఉన్నారు. చంద్రశేఖర్, కాంతమ్మలు అప్పుచేసి కుమార్తె విజయలక్ష్మికి వివాహం చేశారు. అయితే పెళ్లయిన కొద్ది రోజులకే తల్లిదండ్రులు మరణించారు. దీంతో వీరి కుమారులు మురళి, సింహాచలంపై ఆ అప్పుల భారం పడింది. సింహాచలం (24) బయట ప్రాంతాల్లో హోటళ్లలో పనులు చేస్తున్నాడు. మురళీ స్థానికంగా ఉంటు కూలి పనులు చేస్తున్నాడు. వారిద్దరికీ ఎటువంటి ఆస్తిపాస్తులు లేవు. తల్లిదండ్రులు చేసిన అప్పులను తీర్చుకుంటూ కాలం గుడుపుతున్నారు.


బెజ్జిపుట్టుగ వాసి గుర్రాల మురళి

కుసుంపురంలో..

గ్రామానికి చెందిన దుమ్ము పుణ్యావతి, లక్ష్మిల గాథ కూడా అంతే.. కిడ్నీ వ్యాధితో తల్లి భూదేవి ఐదేళ్ల కిందట మరణించగా, మూడేళ్ల కిందట తండ్రి చిన్నారావు మరణించారు. దీంతో వారు కొంతకాలం నానమ్మ వీరమ్మ పోషణలో కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. అయితే ఈ వీరమ్మ కూడా ఏడాది కిందట కిడ్నీవ్యాధితోనే మరణించింది. దీంతో వారిద్దరూ అనాథలుగా మిగిలారు. వారికి ఎమోపీలియా వ్యాధి ఉంటంతో సోంపేట డాక్టర్స్ అసోసియోషన్ ప్రతి నెలా రూ.2 వేలు ఆర్థిక సాయం అందిస్తుంది. అంతేకాకుండా వారికి ఉచితంగా మందులను కూడా అందజేస్తున్నారు. గ్రామపెద్ద బత్తిన కృష్ణారావు, కొంతమంది గ్రామస్థులు కూడా వారికి తోచిన సాయం అంది స్తున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కావ డంతో ప్రస్తుతం పుణ్యావతి, లక్ష్మీలు చదువులను మధ్యలోనే ఆపేసి.. కూలి పనులు చేస్తున్నారు.

పెద్ద శ్రీరాంపురంలో...

గ్రామానికి చెందిన లండ గున్నమ్మ రెండేళ్ల కిందట కిందట కిడ్నీవ్యాధికి గురై మరణించింది. దీంతో ఆమె పిల్లలు మనోజ్, మణికంఠ దిక్కులేని వార్యయారు. అదే గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త బి.సుమన్ వారిని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వద్దకు తీసుకెళ్లి పరిస్థితిని వివరించారు. దీనిపై స్పందించిన ఆయన పిల్లలను సోంపేటలో ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించి చదువులకు అయ్యే ఖర్చును భరించడానికి అంగీకరించారు.



కంచిలి : మజ్జిపుట్టుగకి చెందిన జగన్నాథ మజ్జి కిడ్నీ వ్యాధికి గురయ్యాడు. తల్లి జమున ఒక కిడ్నీ దానం చేసినా ఫలితం లేకపోయింది. వైద్యప రీక్షల నిమిత్తం భార్య పుష్పాంజలి, అన్నయ్య హరి కృష్ణమజ్జి, వదిన లీలావతితో కలసి జగన్నాథ మజ్జి విశాఖకు బయల్దేరాడు. అయితే నందిగాం వద్ద రోడ్డు ప్రమాదంలో వారందరూ మరణించారు. గ్రామంలో కూలి పనులతో పాటు తాళ్లు అల్లుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న వారి అకాల మరణంతో తల్లి జమునతో పాటు పిల్లలు అనాథులయ్యారు. ప్రస్తుతం 70ఏళ్ల జమున మజ్జి కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తుంది.

జగన్నాథ మజ్జికి చెందిన పిల్లలు ఢిల్లేష్ (13), వాసు దేవ్(11) ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. హరికృష్ణ మజ్జి కూతురు సునీత నాన్నమ్మకు చేదోడు వాదోడుగా ఉంటూ కూలి పనులు చేస్తోంది. కుమారుడు తరుణ్ ఐటీఐ చేస్తున్నాడు. తరుణ్‌కు ఉద్దానం ఫౌండేషన్ నెలకు రూ.3000 అందజేస్తోంది.

అనాథలైన సునీత, తరుణ్(ఫైల్ ఫొటో)

మణికంఠ, మనోజ్‌లు ఇలా.. (ఫైల్ ఫొటో)



శ్రావణ సందడి

● ప్రారంభమైన శుభకార్యాలు

● నాలుగు వేల వివాహాలు జరగనున్నట్టు అంచనా

● మార్కెట్‌కు కొత్తకళ

● రూ.15 కోట్ల లావాదేవీలు జరిగే అవకాశం

(శ్రీకాకుళం సిటీ/ డేఅండ్‌నైట్ జంక్షన్)

సిక్కోలులో శుభకార్యాల సందడి ఆరంభమైంది. శ్రావణ మాసం సందర్భంగా తెలుగు లోగిళ్ల కొత్త శోభను సంత రించుకున్నాయి. ఈ మాసం శుభకరం కావడంతో వివాహాలు, గృహప్రవేశాలు, నామకరణం వంటి శుభకార్యాల్లో ప్రజలు బిజీబిజీగా ఉన్నారు. నోములు, వ్రతాల్లో మహిళలు నిమగ్నమై ఉన్నారు. ఈ నెల4న వరలక్ష్మి వ్రతం, 7న రాఖీ పౌర్ణమి, 14న కృష్ణాష్టమి, 25న వినాయక చవితి పండుగలు ఉండడంతో ప్రతి మదిలో భక్తిభావం తొణికిసలాడుతోంది. ఈ నెల 2,3,6,9,12,13,16,17 తేదీలు.. వివాహాలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలకు ముఖ్యమైన రోజులుగా పండితులు చెబుతున్నారు.

పుణ్యక్షేత్రాల్లో పూజలు....

శ్రావణమాసం పురస్కరించుకుని జిల్లాలోని ప్రముఖ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు దేవాదాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యంగా జిల్లాలోని పాలకొండ కోటదుర్గమ్మ, రాజాం నవదుర్గ, కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి, పాతపట్నం నీలమణి దుర్గ, ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారు, శ్రీకాకుళంలోని సంతోషిమాత దేవాలయాలు శ్రావణమాస వేడుకలకు సిద్ధమవుతున్నాయి.

తాళికట్టు శుభవేళ

శ్రావణమాసంలో సుమారు 9 రోజులు మంచి ముహూర్తాలున్నాయి. ఈ శుభదినాల్లో దాదాపు నాలుగు వేల వివాహాల వరకూ జరుగుతాయని పండితులు చెబుతు న్నారు. జిల్లాకేంద్రంలో 30 కల్యాణ మండపాలుండగా జిల్లా వ్యాప్తంగా 300 మండపాలు పెళ్లి శోభతో కళకళలాడనున్నాయి. ఆలయాల్లో సైతం శుభకార్యాలు జరగనున్నాయి.


పూలు విక్రయిస్తున్న దృశ్యం

మార్కెట్‌కు కొత్తకళ

మార్కెట్‌లో వస్త్రాలు, ఆభరణాలు, ఇంటికి కావాల్సిన వస్తువులు, సామగ్రి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. నోములు, వ్రతాలకు సంబంధించిన వస్తువులకు కూడా గిరాకీ ఏర్పడింది. దీంతో వాటి ధరలు అమాంతం పెరిగాయి.

పూల ధరలకు రెక్కలు

గతంలో కిలో బంతిపూల ధర రూ. 20 ఉండగా నేడు రూ. 60లకు చేరింది. రూ. 40లు ఉండే చామంతి ఏకంగా రూ. 120లకి పెరిగింది. ఇక గులాబి, విరజాజులు కిలో రూ. 350 నుంచి రూ.400 పలుకుతున్నాయి.

పసిడి కొనుగోలుపై దృష్టి

శ్రావణమాసంలో వరలక్ష్మి వ్రతం ఉండడంతో మగువలు పసిడి కొనుగోళ్లకు ఎక్కువ మక్కువ చూపుతారు. జిల్లాలో సుమారు 1500 బంగారు ఆభరణాల దుకాణాలు ఉండగా, ఈ మాసంలో సుమారు రూ.15 కోట్ల వ్యాపారం జరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.


గయ తీర్థంలో భక్తుల స్నానాలు

ఉప్పొంగిన భక్తిభావం

● రెండో రోజు శ్రీముఖలింగానికి భక్తుల తాకిడి

● గయ తీర్థంలో స్నానాలు

● విష్ణు పాదాల దర్శనం

● అరకొర ఏర్పాట్లతో తప్పని అవస్థలు

శ్రీముఖలింగం (జలుమూరు): అష్టతీర్థ రాజమహాయోగం సందర్భంగా మంగళవారం రెండో రోజు శ్రీముఖలింగానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం శుద్ధ నవమి నేపథ్యంలో గయ తీర్థంలో భక్తజనం స్నానాలాచరించారు. అనంతరం సమీపంలోని పద్మనాభస్వామి కొండ దిగువన గల విష్ణుపాదాలను దర్శించుకుని పునీతులయ్యారు. ఉదయం 6 గంటలకే అర్చకులు, పురోహితులు అన్నుపురం వద్ద గల గయ తీర్థం వద్దకు చేరుకున్నారు. అర్చకుల సంఘం అధ్యక్షుడు పెద్దలింగన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశారాధన, మండపారాధన, మంత్ర పుష్పం, నీరాజనంతో పాటు కుంకుమ పూజలు చేశారు. అనంతరం తీర్థంలో స్నానాలకు భక్తులకు అనుమతి ఇచ్చారు.

శ్రీముఖలింగం, కరకవలస, నగిరికటకం, అచ్యుతాపురం, పరిసర గ్రామాలతో పాటు ఒడిశా, జిల్లా నలుమూలల అతితక్కువ సంఖ్యలో మాత్రమే భక్తులు గయా తీర్థం స్నానాలకు హాజరయ్యారు. ఉదయం 8 గంటల నుంచి పెరిగిన భక్తుల తాకిడి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగింది. అయితే భక్తజనానికి సౌకర్యాలు కల్పించడంలో దేవాదాయశాఖతో పాటు ఇతరశాఖలు విఫలమయ్యాయి. దీంతో భక్తులు ఎండలోనే అనేక అవస్థలు పడ్డారు. గయ తీర్థం వద్ద అధికారులు చిన్న టెంటు ఏర్పాటుచేసి మమ అనిపించారు. దీంతో స్నానాలకు వచ్చే మహిళలు ఆరుబయటే దుస్తులు మార్చుకోవాల్సి వచ్చింది. పద్మనాభుని కొండ దిగువన విష్ణు పాదాలను దర్శించుకోడానికి వచ్చిన వారికీ అవస్థలు తప్పలేదు. విష్ణుపాదాలు ఉన్నచోట కనీసం ఒక టెంటు కూడా అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో భక్తులు ఎండలోనే విష్ణుపాదాలకు దర్శించుకుని పూజలు చేయాల్సి వచ్చింది. సాయంత్రం అర్చకులు గయాతీర్థం వద్ద కుంభ, నక్షత్ర, నాగహారతి ఇచ్చి పూజలు చేశారు.

● స్నానాలకు వచ్చే భక్తులకు అన్నుపురం గ్రామస్థులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాదాయశాఖ ప్రధానాలయం, రాధాగోవిందస్వామి మఠం వద్ద కూడా భక్తులకు భోజన సదుపాయం కల్పించారు.

● కొమనాపల్లి సత్యసాయి భజన మండలి సభ్యులు, నరసన్నపేట డిగ్రీకళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు భక్తులకు వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

●ప్రధాన ఆలయం సమీపంలో అచ్యుతాపురం వైద్యాధికారి వి.వి జయలక్ష్మి ఆరోగ్య వైద్యశిబిరం ఏర్పాటు చేసి భక్తులకు సేవలందించారు.

● ఆలయ ఈవో వి.వి.సూర్య నారాయణ ఆధ్వర్యంలో ట్రస్టు బోర్డు చైర్మన్ బైరి బలరాం, దేవాదాయ సిబ్బంది పరిస్థితులను సమీక్షించారు. డిప్యూటి తహసీల్దార్ నారాయణరావు, రెవె న్యూ పరిశీలకులు చిన్నారావు, ఈవోపీఆర్‌డీ అప్పలనాయుడు గయా తీర్థాన్ని పరిశీలించి పరిస్థితులను సమీక్షించారు.

● గయ తీర్థం, విష్ణుపాదాల దర్శనం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఎం.గోవింద ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నేడు హంసతీర్థంలో ...

శ్రీముఖలింగంలో నిర్వహించే అష్టతీర్థ రాజమహాయోగంలో భాగంగా 3వ రోజు దశమి బుధవారం హంసతీర్థం (వంశధారనది)లో భక్తులు స్నానాలు ఆచరించనున్నారు. అనంతరం ఆది విరాట్టు శ్రీముఖలింగేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుంటారు. ప్రధానాలయం పక్కనగల రహదారి గుండా వంశధారనదిలోకి వెళ్లి హంసతీర్థానికి వెళ్లాల్సి ఉంటుంది. మూడో రోజు భక్తులు పెరిగే అవకాశమున్నందున అందుకు తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపీటీసీ ప్రతినిధి తమ్మన్నగారి సతీష్ ఆధ్వర్యంలో ఆలయానికి ఎదురుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.



ఎండలోనే భక్తులు ఇలా... పద్మనాభుని కొండ దిగువన విష్ణుపాదాలకు పూజలు చేస్తున్న దృశ్యం

ఆలోచన విధానం, సునిశిత దృష్టి.. ప్రధానం

పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో పదం, దానికి ఒక సంబంధం ఇస్తారు. మరో పదం ఇచ్చి ఆ పదానికి కూడా అలాంటి సంబంధాన్నే తెలపమని అడుగుతారు. ఈ విభాగంలోని ప్రశ్నల్లో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు కూడా ఉంటాయి. అభ్యర్థి ఆలోచన విధానం, విజ్ఞానం, సునిశిత దృష్టి, పరిశీలనాత్మకతను అంచనా వేయడమే ఈ పరీక్ష ముఖ్యోద్దేశం. ఇందులో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి..

1. పదాల పోలిక పరీక్ష
2. వర్ణమాల అక్షరాల పోలిక పరీక్ష
3. సంఖ్యలతో పోలిక పరీక్ష



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 1

1. చాక్‌పీస్: నల్లబల్ల:: ---- : పలక
ఎ) కలం బి) పెన్సిల్ సి) బలపం డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: నల్లబల్లపై చాక్ పీస్‌తో రాస్తారు. అదేవిధంగా పలకపై బలపంతో రాస్తారు.

2. విటమిన్ ఎ : రేచీకటి :: ----- : రికెట్స్
ఎ) విటమిన్ బి బి) విటమిన్ సి
సి) విటమిన్ డి డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: విటమిన్ ఎ లోపంతో వచ్చే వ్యాధి రేచీకటి. అదేవిధంగా విటమిన్ డి లోపంతో వచ్చే వ్యాధి రికెట్స్

3. పత్రం: క్లోరోఫిల్ :: రక్తం : -----
ఎ) కెరొటిన్ బి) జాంథోఫిల్
సి) హిమోగ్లోబిన్ డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: పత్రాల ఆకులు పచ్చగా ఉండటానికి కారణం క్లోరోఫిల్. అదేవిధంగా రక్తం ఎర్రగా ఉండడానికి కారణం హిమోగ్లోబిన్

4. థర్మామీటర్: ఉష్ణోగ్రత :: అమ్మీటర్ : -------
ఎ) విద్యుత్ బి) ఉష్ణం సి) తేమ డి) వేగం
సమాధానం : ఎ
వివరణ: ఉష్ణోగ్రతను కొలిచే సాధనం థర్మామీటర్. అలాగే విద్యుత్‌ను కొలిచేది అమ్మీటర్

5. రైతు : పొలం :: శాస్త్రజ్ఞుడు: -------
ఎ) కర్మాగారం బి) పాఠశాల
సి) ప్రయోగశాల డి) రంగస్థలం
సమాధానం: సి
వివరణ: రైతు పనిచేసే ప్రదేశం పొలం. అదేవిధంగా శాస్త్రవేత్త పనిచేసే ప్రదేశం ప్రయోగశాల

6. పక్షులు : ఆర్నిథాలజీ::గుండె: ------
ఎ) హెమటాలజీ బి) కార్డియాలజీ
సి) సెమన్‌టిక్స్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: పక్షులను గురించి వివరించే శాస్త్రం ఆర్నిథాలజీ. అదేవిధంగా హృదయ స్పందన గురించి వివరించే శాస్త్రం కార్డియాలజీ

7. రైతు : నాగలి :: సైనికుడు: ---------
ఎ) తుపాకి బి) కత్తి సి) సూది డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: నాగలిని ఉపయోగించే వ్యక్తి రైతు. అదేవిధంగా తుపాకిని ఉపయోగించే వ్యక్తి సైనికుడు

8. పాల స్వచ్ఛత: లాక్టోమీటర్ :: భూకంపాలు: ---
ఎ) బారోమీటర్ బి) అనిమోమీటర్
సి) ఆడో మీటర్ డి) సిస్మోగ్రాఫ్
సమాధానం: డి
వివరణ: పాల స్వచ్ఛతను కొలిచే పరికరం లాక్టోమీటర్. అలాగే భూకంప తీవ్రతను కొలిచే సాధనం సిస్మోగ్రాఫ్

9. బలం: వాట్ :: విద్యుత్ : --------
ఎ) జౌల్ బి) డిగ్రీ సి) ఆంపియర్ డి) సెకండ్స్
సమాధానం: సి
వివరణ: బలానికి ప్రమాణం వాట్ అలాగే విద్యుత్‌కు ప్రమాణం ఆంపియర్

10. ముఖేష్: హాకీ :: చెస్ : -------
ఎ) గగన్ నారంగ్ బి) హరి కృష్ణ
సి) లక్ష్మణ్ డి) ఎవరూకాదు
సమాధానం: బి
వివరణ: ముఖేష్ హాకీ క్రీడాకారుడు. అలాగే హరికృష్ణ చెస్ క్రీడాకారుడు

11. కొలంబో : శ్రీలంక :: ------ : ఆఫ్ఘనిస్థాన్
ఎ) ఇస్లామాబాద్ బి) కాబూల్ సి) తింపు డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శ్రీలంక రాజధాని కొలంబో. అలాగే ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్

12. హస్తినాపురం : న్యూఢిల్లీ :: మద్రాస్ : -----
ఎ) చెన్నై బి) పనాజి సి) కోల్‌కతా డి) ముంబై
సమాధానం: ఎ
వివరణ: హస్తినాపురానికి కొత్త పేరు న్యూఢిల్లీ, అలాగే మద్రాస్‌కు కొత్త పేరు చెన్నై

13. భరతనాట్యం: తమిళనాడు :: యక్షగానం: -------
ఎ) కేరళ బి) మహారాష్ట్ర సి) కర్ణాటక డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: తమిళనాడు శాస్త్రీయ నృత్యం భరత నాట్యం. కర్ణాటక శాస్త్రీయ నృత్యం యక్షగానం

14. న్యూజిలాండ్ జాతీయ పక్షి : కివి :: మన జాతీయ పక్షి : --------
ఎ) నెమలి బి) పావురం సి) చిలుక డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: న్యూజిలాండ్ జాతీయ పక్షి కివి అదేవిధంగా మన జాతీయ పక్షి నెమలి.

15. చార్మినార్: హైదరాబాద్ :: తాజ్‌మహల్:-------
ఎ) న్యూఢిల్లీ బి) ఆగ్రా సి) మీరట్ డి) ఔరంగాబాద్
సమాధానం: బి
వివరణ: చార్మినార్ హైదరాబాద్‌లో ఉంది. తాజ్‌మహల్ ఆగ్రాలో ఉంది.

16. ఇండియా : రూపాయి :: జపాన్ : -------
ఎ) డాలర్ బి) ఫ్రాంక్ సి) యన్ డి) దీనార్
సమాధానం: సి
వివరణ: ఇండియా కరెన్సీ రూపాయి. జపాన్ కరెన్సీ యన్

17. గ్రహాలు : ఖగోళ శాస్త్రం :: నాణేలు : -----------
ఎ) సిస్మోగ్రాఫ్ బి) పేలియోగ్రఫీ
సి) పాథాలజీ డి) న్యూమిస్‌మాటిక్స్
సమాధానం: డి
వివరణ: గ్రహాల గురించి వివరించే శాస్త్రం ఖగోళశాస్త్రం. అలాగే నాణేల గురించి వివరించే శాస్త్రం న్యూమిస్‌మాటిక్స్

18. ఆర్య సమాజం: దయానంద సరస్వతి:: రామకృష్ణ మిషన్: --------
ఎ) అనిబిసెంట్ బి) స్వామి వివేకానంద
సి) నివేదిత డి) ఎవరూకాదు
సమాధానం: బి
వివరణ: ఆర్య సమాజ స్థాపకుడు దయానంద సరస్వతి. అదేవిధంగా రామకృష్ణ మిషన్ స్థాపకుడు స్వామి వివేకానంద

19. స్వామి వివేకానంద: నరేంద్రదత్:: దయానంద సరస్వతి: -------
ఎ) గదాధరుడు బి) మూల శంకర్
సి) రామచందర్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: స్వామి వివేకానంద అసలు పేరు నరేంద్ర దత్. దయానంద సరస్వతి అసలు పేరు మూల్ శంకర్

20. మెగస్తనీస్: ఇండికా:: పాణిని: -----------
ఎ) అష్టాధ్యాయి బి) హర్ష చరిత్ర
సి) చరక సంహిత డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మెగస్తనీస్ రచించిన గ్రంథం ఇండికా, అదేవిధంగా పాణిని రచించిన గ్రంథం అష్టాధ్యాయి.

21. పాస్కల్: ఒత్తిడి:: ఆంపియర్: -------
ఎ) విద్యుత్ బి) బలం సి) శక్తి డి) స్వచ్ఛత
సమాధానం: ఎ
వివరణ: పాస్కల్ అనేది ఒత్తిడికి ప్రమాణం. అలాగే ఆంపియర్ అనేది విద్యుత్‌కు ప్రమాణం

22. కన్నడం: కర్ణాటక:: మరాఠీ: -------
ఎ) మధ్యప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) గుజరాత్ డి) రాజస్థాన్

23. హాంకాంగ్: చైనా:: వాటికన్: --------
ఎ) నార్వే బి) డెన్మార్క్
సి) నెదర్లాండ్ డి) రోమ్
సమాధానం: డి
వివరణ: చైనాలోని ఒక నగరం హాంకాంగ్. అలాగే రోమ్‌లోని నగరం వాటికన్ సిటీ

24. ఇన్సులిన్: హార్మోన్::ట్రిప్సిన్: -------
ఎ) ఎంజైమ్ బి) విటమిన్ సి) హార్మోన్ డి) గ్రంధి
సమాధానం: ఎ
వివరణ: ఇన్సులిన్ అనేది హార్మోన్. అలాగే ట్రిప్సిన్ అనేది ఒక ఎంజైమ్

25. వినడం: చెముడు:: మాట్లాడడం: --------
ఎ) నిశ్శబ్దం బి) మూగ సి) శాంతి డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: వినలేకపోవడం చెముడు అలాగే మాట్లాడలేకపోవడం మూగ

26. భాక్రానంగల్: సట్లెజ్:: హీరాకుడ్ : -------
ఎ) గోదావరి బి) కృష్ణ సి) కావేరి డి) మహానది
సమాధానం: డి
వివరణ: భాక్రానంగల్ డ్యామ్ సట్లెజ్ నదిపై ఉంది అలాగే హీరాకుడ్ డ్యామ్ మహానదిపై ఉంది.

27. హరిత విప్లవం: మొక్కలు:: నీలి విప్లవం: ------
ఎ) చేపలు బి) పాలు సి) నూనె గింజలు డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మొక్కల అధికోత్పత్తికి చేపట్టిన కార్యక్రమం హరిత విప్లవం. అలాగే చేపల అధిక దిగుబడికి చేపట్టిన కార్యక్రమం నీలి విప్లవం

28. తూర్పు: వాయవ్యం:: నైరుతి: ----
ఎ) ఈశాన్యం బి) తూర్పు సి) ఆగ్నేయం డి) ఉత్తరం
సమాధానం: బి
వివరణ: తూర్పునకు 135 డిగ్రీల అపసవ్యదిశ వాయవ్యం. నైరుతికి 135 డిగ్రీల అపసవ్య దిశ తూర్పు

29. సత్యజిత్ రే: సినిమా:: పికాసో: ------
ఎ) రచయిత బి) నాటక కర్త
సి) చిత్రకారుడు డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: సినిమా రంగానికి చెందిన ప్రముఖుడు సత్యజిత్ రే. అలాగే సుప్రసిద్ధ చిత్రకారుడు పికాసో

30. రెస్టారెంట్: మెను:: లైబ్రరీ: -----
ఎ) చదువు బి) పుస్తకాలు సి) విద్య డి) క్యాటలాగ్
సమాధానం: డి
వివరణ: మెను అనేది ఐటెమ్స్ లిస్ట్. కేటలాగ్ అనేది బుక్స్ లిస్ట్

31. ఓనం: కేరళ:: బిహు: ------
ఎ) కర్ణాటక బి) మిజోరాం సి) అసోం డి) ఒడిశా
సమాధానం: సి
వివరణ: కేరళ ప్రజలు చేసుకొనే పండుగ ఓనం. అసోం ప్రజలు చేసుకొనే పండుగ బిహు

32. ప్రమాదం: అజాగ్రత:: వ్యాధులు: -------
ఎ) అపరిశుభ్రత బి) వైద్యుడు
సి) మందులు డి) వైద్యం సమాధానం: ఎ
వివరణ: అజాగ్రత్తతో ప్రమాదం లభిస్తుంది. అలాగే అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలుతాయి.

33. శిల్పం: రూపం:: పాట ------
ఎ) సంగీతం బి) గానం సి) చెప్పలేం డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శిల్పానికి మంచి రూపం ఉండాలి. అలాగే పాటకు మంచి గానం ఉండాలి.

అడ్మిషన్స్

ఐఎన్ఎటి 2017

పుణెలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐయుసిఏఏ), నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రో ఫిజిక్స్ (ఎన్‌సిఆర్ఏ) సంస్థల్లో పిహెచ్‌డి చేసే వారికి ఉద్దేశించిన రీసెర్చ్ స్కాలర్‌షిప్‌నకు ప్రకటన విడుదలైంది.
విభాగాలు: ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, ఫిజిక్స్
అర్హత: ఆగస్టు నాటికి 55 శాతం మార్కులతో (బిఎస్సీ/ ఎమ్మెస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ)(ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్/ ఆస్ట్రానమీ/ అప్లయిడ్ మేథమెటిక్స్) లేదా బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ పూర్తి.
ఎంపిక: ఐయుసిఏఏ - ఎన్‌సిఆర్ఏ అడ్మిషన్ టెస్ట్(ఐఎన్ఎటి 2017), ఇంటర్వ్యూ ద్వారా
పరీక్ష కేంద్రం: ఐయుసిఏఏ, పుణె
ఇంటర్వ్యూ: డిసెంబరు 7, 8
వేదిక: ఎన్‌సిఆర్ఏ - టిఐఎఫ్ఆర్, పుణె
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15, 2017
వెబ్‌సైట్: http://inat.ncra.tifr.res.in/inat

పుణె పాలిటెక్నిక్

పుణెలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ - **అడ్వాన్స్‌డ్ డిప్లొమా(ఆటోమోటివ్ మెకట్రానిక్స్)** ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ స్కిల్ బేస్డ్ జాబ్ ఓరియంటెడ్ కోర్సును **'మెర్సిడెజ్ - బెంజ్'** సహకారంతో నిర్వహిస్తున్నారు.
కోర్సు వ్యవధి: ఏడాది
అర్హత: డిప్లొమా/ డిగ్రీ (ఇంజనీరింగ్)
ఎంపిక: ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా
ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఆగస్టు 18
పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.
వెబ్‌సైట్: www.gppuneamc.org

ఎయిమ్స్

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన **'ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్'**కు దరఖాస్తులు కోరుతోంది.
ఎగ్జామినేషన్ తేదీ: సెప్టెంబరు 8
పరీక్ష కేంద్రం: ఢిల్లీ/ ఎన్‌సిఆర్
ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 3, 2017
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 17, 2017
వెబ్‌సైట్: www.aiimsexams.org

డిఎస్‌సి

ద ఢిల్లీ స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్(డిఎస్‌సి)- పీజీ(కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాట్/ క్యాట్ అర్హత పొంది ఉండాలి. లేదా డిఎస్‌సి ఇంటర్నల్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 7, 2017
వెబ్‌సైట్: www.dsc.edu.in/

డిఐఎంహెచ్

చెన్నైలోని డైరెక్టరేట్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ అండ్ హోమియోపతి (డిఐఎంహెచ్)- బిఎస్ఎంఎస్/ బిఏఎంఎస్/ బిఎన్‌వైఎస్/ బియుఎంఎస్/ బిహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: హయ్యర్ సెకండరీ
క్యాంపస్‌లు: తిరునల్వేలి. చెన్నై, మధురై, కన్యాకుమారి **దరఖాస్తు ఫీజు:** రూ.500
అప్లికేషన్ డౌన్‌లోడింగ్‌కు చివరి తేదీ: ఆగస్టు 30, 2017
హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31, 2017
చిరునామా: The Secretary, Selection Committee, Directorate of Indian Medicine and Homoeopathy, Arignar Anna Govt.Hospital of Indian Medicine Campus, Arumbakkam, Chennai-600106
వెబ్‌సైట్: www.tnhealth.org

'ద లైఫ్ డివైన్' గ్రంథ రచయిత ఎవరు?

హోంరూల్ ఉద్యమం

1. భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉంటూ స్వయంపాలన సాగించుకొనే స్థితిని సాధించే లక్ష్యంతో ప్రారంభమైన ఉద్యమం?
ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
బి) హోంరూల్ ఉద్యమం
సి) క్విట్ ఇండియా ఉద్యమం డి) ఉప్పుసత్యాగ్రహం

2. హోంరూల్ లీగ్‌ను 1916 ఏప్రిల్‌లో స్థాపించింది?
ఎ) బాలగంగాధర్ తిలక్ బి) సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) పి.కె.తెలాంగ్

3. హోంరూల్ అనే పదాన్ని ఏ ఉద్యమం నుంచి స్వీకరించారు?
ఎ) గ్రీక్ ఉద్యమం బి) లాటిన్ ఉద్యమం
సి) ఐరిష్ ఉద్యమం డి) గ్రీన్‌పీస్ ఉద్యమం

4. 1916 సెప్టెంబరులో హోంరూల్ లీగ్‌ను స్థాపించింది?
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) అనిబిసెంట్
సి) పి.కె.తెలాంగ్ డి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్

5. 1897లో హోంరూల్ లీగ్ అనే పదాన్ని మొట్టమొదట ఉపయోగించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) శ్రీకృష్ణ కార్పడే
సి) నరసింహచింతామన్ కేల్కర్
డి) మోతీలాల్ నెహ్రూ

6. 'న్యూ ఇండియా' పత్రికను స్థాపించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) బి.పి.వాడియా
సి) జె.ఎస్.అరుండేల్ డి) అనిబిసెంట్

7. 'ఇండియన్ ఉమెన్స్ అసోసియేషన్' అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహమ్మద్ అలీ జిన్నా
బి) అంబికా చరణ్ మజుందార్
సి) అనిబిసెంట్ డి) సురేంద్రనాథ్ బెనర్జీ

8. 1885లో Fabian societyలో చేరి Fabian Essays అనే పత్రికలో సోషలిజం మీద వ్యాసాలు రాసింది?
ఎ) అనిబిసెంట్ బి) భగవాన్‌దాస్
సి) బి.పి.వాడియా డి) జె.ఎస్.అరుండేల్

9. అనిబిసెంట్ దివ్యజ్ఞాన సమాజంలో ఎప్పుడు చేరారు?
ఎ) 1885 బి) 1889 సి) 1895 డి) 1899

10. బెనారస్‌లో కేంద్రీయ హిందూ కళాశాల'ను స్థాపించింది?
ఎ) గాంధీ బి) రాస్‌బిహారి ఘోష్
సి) అనిబిసెంట్ డి) బాలగంగాధర్ తిలక్

11. 'భగవద్గీత'ను అనిబిసెంట్ ఎవరి సహకారంతో ఆంగ్లంలోకి అనువదించారు?
ఎ) రాస్‌బిహారి ఘోష్ బి) బి.పి.వాడియా
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) డాక్టర్ భగవాన్ దాస్

12. భారతీయులు పాశ్చాత్య సంప్రదాయాల పట్ల ఆకర్షితులు కావడాన్ని వ్యతిరేకించింది?
ఎ) సాండర్స్ బి) అనిబిసెంట్
సి) చెమ్స్‌ఫర్డ్ డి) మాంటేగ్

13. 1907లో కల్నల్ ఆల్కాట్ మరణం తరవాత దివ్యజ్ఞాన సమాజ బాధ్యతలు చేపట్టింది?
ఎ) అనిబిసెంట్ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) జె.ఎస్.అరుండేల్


14. 'ద లైఫ్ డివైన్' అనే గ్రంథాన్ని రచించింది?
ఎ) అరవింద్‌ఘోష్ బి) తిలక్
సి) లాలాలజపతిరాయ్ డి) బిపిన్ చంద్రపాల్

15. 1895-1907 మధ్య బెనారస్ కేంద్రంగా హిందూ మతం గురించి ఉపన్యాసాలు చేసింది?
ఎ) పి.కె.తెలాంగ్ బి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) అనిబిసెంట్

16. 1916 లక్నో సమావేశంలో అతివాదులు తిరిగి కాంగ్రెస్ చేరడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) అనిబిసెంట్ బి) సురేంద్రనాథ్ బెనర్జీ
సి) రాస్‌బిహారి ఘోష్
డి) బాలకృష్ణ శివరాం మోహన్‌జీ

17. 'Englands difficulty is Indian opportunity' అనే నినాదాన్ని ఇచ్చింది?
ఎ) చాంబర్లీన్ బి) అనిబిసెంట్
సి) బి.పి.వాడియా డి) మహమ్మద్ అలీ జిన్నా

18. కాంగ్రెస్, ముస్లిం లీగ్ మధ్య 1916లో లక్నో ఒడంబడిక జరగడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) సి.పి.రామస్వామి అయ్యర్
బి) పి.కె.తెలాంగ్
సి) అనిబిసెంట్ డి) బి.పి.వాడియా



కె. చెంచుకుమార్
సీనియర్ ఫ్యాకల్టీ

19. 'న్యూ ఇండియా' డైలీ ఎప్పుడు ధరావతును కోల్పోయింది?
ఎ) 1914 బి) 1912 సి) 1915 డి) 1916

20. హోంరూల్ ఉద్యమానికి ప్రతిస్పందిస్తూ ఆగస్టు ప్రకటన చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మాంటేగ్
సి) హర్డింజ్ డి) పాల్ రిచర్డ్

21. ఏ సంవత్సరంలో అనిబిసెంట్ రాజకీయ రంగప్రవేశం చేస్తూ భారతదేశానికి హోంరూల్ ఇవ్వాలని కోరారు?
ఎ) 1911 బి) 1912 సి) 1913 డి) 1914

22. 1917లో ఏ ఐఎన్‌సి సమావేశానికి అనిబిసెంట్ నాయకత్వం వహించారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) మద్రాసు డి) గౌహతి

23. ఐఎన్‌సికి అధ్యక్షత వహించిన తొలి మహిళ?
ఎ) దుర్గాబాయి దేశ్‌ముఖ్ బి) విజయలక్ష్మి పండిట్
సి) నిర్మలాదేశ్ పాండే డి) అనిబిసెంట్

పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ



బాలగంగాధర్ తిలక్



అనిబిసెంట్

24. 'బాయ్ స్కౌట్ అసోసియేషన్' అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహాత్మాగాంధీ బి) అనిబిసెంట్
సి) మోతీలాల్ నెహ్రూ
డి) వినాయక దామోదర్ సావర్కర్

25. మద్రాసులోని అడయార్‌లో అనిబిసెంట్ స్థాపించిన జాతీయ విశ్వవిద్యాలయానికి చాన్సలర్‌గా వ్యవహరించింది?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) శ్యాంజీ కృష్ణవర్మ
సి) విజయలక్ష్మి పండిట్ డి) బి.పి.వాడియా

26. 1916 మేలో చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో 'థియోసాపికల్ కళాశాల'ను స్థాపించింది?
ఎ) జె.ఎం.చటర్జీ బి) చాంబర్లీన్
సి) అనిబిసెంట్ డి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య

27. అనిబిసెంట్ ముఖ్య శిష్యుడు?
ఎ) కొండా వెంకటప్పయ్య
బి) పర్వతనేని వీరయ్య చౌదరి
సి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య డి) జిడ్డు కృష్ణమూర్తి

28. 'At the feet of master' గ్రంథ రచయిత?
ఎ) జిడ్డు కృష్ణమూర్తి బి) నీలకంఠ బ్రహ్మచారి
సి) అనిబిసెంట్ డి) విజయలక్ష్మి పండిట్

29. బ్రిటిష్ సార్వభౌమత్వం కింద ఉంచుతూనే భారతీయులకు క్రమానుగతంగా స్వయం పరిపాలన ఇస్తామని ప్రకటన చేసిన భారత రాజ్య కార్యదర్శి?
ఎ) మింటో బి) మాంటేగ్ సి) మార్లే డి) హార్డింజ్

30. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌లో ముఖ్యపాత్ర పోషించింది?
ఎ) గణేష్ శ్రీకృష్ణ కార్పడే
బి) నరసింహ చింతామన్ కేల్కర్
సి) బాలకృష్ణ శివరాం మోహన్‌జీ డి) పైవారందరూ

31. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు అధ్యక్షుడిగా పని చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మార్లే
సి) జోసెఫ్ బాప్టిస్టా డి) పి.కె.తెలాంగ్

32. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు కార్యదర్శి?
ఎ) పాల్ రిచర్డ్ బి) కేల్కర్
సి) మీరా రిచర్డ్ డి) ఎస్.పి.సిన్హా

33. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు పరిమితం అయింది?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) కర్ణాటక డి) బి, సి

34. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించింది?
ఎ) సర్ ఎస్.సుబ్రమణ్య అయ్యర్
బి) కేల్కర్ సి) జోసెఫ్ బాప్టిస్టా
డి) బాలగంగాధర్ తిలక్

35. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించింది?
ఎ) జోసెఫ్ బాప్టిస్టా బి) సి.పి.రామస్వామి అయ్యర్
సి) పి.కె.తెలాంగ్ డి) బి, సి

36. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు విస్తరించింది?
ఎ) దక్షిణ భారతదేశం బి) బీహార్, బెంగాల్
సి) యునైటెడ్ ప్రావిన్స్, సింధు డి) పైవన్నీ

37. అనిబిసెంట్ కృషి ఫలితంగా ఏ ఐఎన్‌సి సమావేశంలో బాలగంగాధర్ తిలక్ కాంగ్రెస్‌లో చేరారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) లక్నో డి) పూనా

38. 1916లో జరిగిన లక్నో కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించింది?
ఎ) రాస్‌బిహారి ఘోష్
బి) అంబికా చరణ్ మజుందార్
సి) అరుండేల్ డి) వాడియా

39. భారతదేశానికి స్వపరిపాలన ఇవ్వాలని ఏ ఐఎన్‌సి సమావేశం తీర్మానించింది?
ఎ) లక్నో బి) భోపాల్ సి) అమృత్‌సర్ డి) లాహోర్

40. కాంగ్రెస్, ముస్లింలీగ్ మధ్య రాజ్యాంగ సంస్కరణల విషయమై కుదిరిన ఒడంబడిక ఎప్పుడు జరిగింది?
ఎ) 1915 బి) 1916 సి) 1917 డి) 1918

41. Common Schemeను రూపొందించడంలో ముఖ్యపాత్ర వహించింది?
ఎ) మహాత్మాగాంధీ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) మోతీలాల్ నెహ్రూ

42. 1916 డిసెంబర్‌లో ఏ ప్రాంతంలో సమావేశమై కాంగ్రెస్, ముస్లింలీగ్‌లు ఒక సామాన్య ప్రణాళిక కోసం చెరొక కమిటీని నియమించాయి?
ఎ) మద్రాస్ బి) తిరువనంతపురం
సి) లక్నో డి) బెంగళూరు

43. హోంరూల్ ఉద్యమ కాలం?
ఎ) 1916-18 బి) 1920-22 సి) 1930-32 డి) 1940-42

44. భారతదేశ వైశ్రాయిగా 1916లో నియమితులైనది?
ఎ) మార్లే బి) లార్డ్ చెమ్స్‌ఫర్డ్
సి) మింటో డి) లార్డ్ కర్జన్

45. శాడ్లర్ కమిషన్‌ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1914 బి) 1915 సి) 1916 డి) 1917

46. 'వందేమాతరం' అనే పత్రికను నడిపిన అతివాద నాయకుడు?
ఎ) మహాత్మాగాంధీ బి) అరవింద్ ఘోష్
సి) తిలక్ డి) లాలాలజపతి రాయ్

47. మితవాద రాజకీయాలను Policy of prayer, petition and protestగా అభివర్ణించింది?
ఎ) తిలక్ బి) లాలాలజపతిరాయ్
సి) అరవింద్ ఘోష్ డి) బిపిన్ చంద్రపాల్

48. 'సావిత్రి' అనే గ్రంథం రచించింది?
ఎ) మదన్ మోహన్ మాలవ్యా
బి) లాలాలజపతిరాయ్
సి) బాలగంగాధర్ తిలక్ డి) అరవింద్ ఘోష్

49. అరవింద్ ఘోష్ జన్మస్థలం?
ఎ) గౌహతి బి) కలకత్తా
సి) భువనేశ్వర్ డి) మద్రాసు

సమాధానాలు

1) బి	8) ఎ	15) డి	24) బి	33) డి	42) సి
2) ఎ	9) బి	16) ఎ	25) ఎ	34) ఎ	43) ఎ
3) సి	10) సి	17) బి	26) సి	35) డి	44) బి
4) బి	11) డి	18) సి	27) డి	36) డి	45) సి
5) ఎ	12) బి	19) డి	28) ఎ	37) సి	46) బి
6) డి	13) ఎ	20) బి	29) బి	38) బి	47) సి
7) సి	14) ఎ	21) సి	30) బి	39) ఎ	48) డి
		22) ఎ	31) సి	40) బి	49) బి
		23) డి	32) బి	41) డి	

JOBS ఉద్యోగాలు

నీతి ఆయోగ్

నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆయోగ్ (నీతి ఆయోగ్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టులు - ఖాళీలు: అడ్వైజర్/ సీనియర్ అడ్వైజర్ 7, జాయింట్ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, డిప్యూటీ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ 28, రీసెర్చ్ ఆఫీసర్(ఫ్లెక్సీ పూల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ (ఫ్లెక్సీ పూల్)28, ఎకనామిక్ ఆఫీసర్ 44
అర్హత: పోస్టును అనుసరించి పీజీ/ ఎంబీబీఎస్
వయసు: 26 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.niti.gov.in

సఫ్దర్‌జంగ్ హాస్పిటల్

ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్- జూనియర్ రెసిడెంట్ (నాన్ పీజీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 58
కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది
అర్హత: ఎంబీబీఎస్ డిగ్రీ ఉత్తీర్ణత + ఢిల్లీ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు పొంది ఉండాలి. అభ్యర్థులు 2015 జూలై 1 తరవాతనే ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, కౌన్సెలింగ్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.500 (ఒబిసిలకు రూ.250 కాగా ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు మినహాయింపు వర్తిస్తుంది).
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును నిర్దేశిత చిరునామాకు పంపాలి
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10, 2017
చిరునామా: The Medical Superintendent, Safdarjung Hospital & VMMC, New Delhi- 110029
వెబ్‌సైట్: www.vmmc.sjh.nic.in/

ఇండియన్ ఆర్మీ

ఇండియన్ ఆర్మీ కింది పోస్టుల భర్తీకోసం విడివిడిగా దరఖాస్తులు కోరుతోంది.
లా గ్రాడ్యుయేట్స్
ఖాళీలు: 14 (పురుషులకు 10, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: 55 శాతం మార్కులతో లా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు మూడేళ్ల అనుభవం ఉండాలి. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/ స్టేట్‌లో రిజిస్ట్రేషన్‌కు అర్హత పొంది ఉండాలి.
వయసు: 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
ఎన్‌సిసి స్పెషల్ ఎంట్రీ (43 కోర్స్)
ఖాళీలు: 54 (పురుషులకు 50, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: ఎన్‌సిసి సర్టిఫికెట్‌తోపాటు 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. బ్యాటిల్ క్యాజువాలిటీస్/ ఆర్మీ పర్సనల్ పిల్లలకైతే ఎన్‌సిసి సర్టిఫికెట్ అవసరం లేదు.
వయసు: 19 నుంచి 25 ఏళ్లు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ ఖాళీలు: 142
ట్రేడ్స్ వారీ ఖాళీలు: మెటీరియల్ అసిస్టెంట్ 6, ఎల్‌డిసి 1, ఫార్మసిస్ట్ 1, టెలీ ఆపరేటర్ 1, ఫైర్‌మన్ 36, ట్రేడ్స్‌మన్(మేట్) 94, ఎంటిఎస్ 1, దోబి 1, టైలర్ 1
అర్హత: పోస్టును అనుసరించి బిఇ/ బిటెక్/ డిఫార్మసీ/ డిప్లొమా / ఇంటర్/ 10వ తరగతి
వయసు: పోస్టును అనుసరించి 18 నుంచి 27 ఏళ్లు
ఎంపిక: ఫిజికల్ అండ్యూరెన్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, రాత పరీక్ష ఆధారంగా.
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును స్పీడ్ / రిజిస్టర్డ్/ ఆర్డినరీ పోస్టుద్వారా నిర్దేశిత చిరునామాకు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16, 2017
చిరునామా: Commandant 21 Field Ammunition Depot - 909721
వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in

వృద్ధులకు చీరల పంపిణీ



ఇచ్ఛాపురం : స్థానిక స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం బెల్లుపడలోని 40మందివృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. అలాగే, ఇంటింటికీ మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో తులసీదాస్‌రెడ్డి దంపతులు, మాజీ కౌన్సిలర్ నీలాపు ఢిల్లీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జీవులురెడ్డి, సూపర్‌బజార్ చైర్మన్ కొండా శంకర్‌రెడ్డి, నీలాపు శ్రీను, రమణయ్య, ప్రసాద్‌రెడ్డి, కూర్మారావు పాల్గొన్నారు.

ఎంఆర్ టీకా చిన్నారులకు రక్ష

● ఒకే వ్యాక్సిన్‌తో రెండు వ్యాధులు దూరం
● ఎమ్మెల్యే అశోక్



విద్యార్థినికి టీకా వేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం: మీజిల్స్, రుబెల్లా నుంచి చిన్నారులను రక్షించుకోవడానికి తప్పనిసరిగా ఎంఆర్ టీకాను వేయాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మంగళవారం పురుషోత్తపురం ఏపీ మోడల్‌స్కూల్‌లో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకే టీకాతో రెండు ప్రాణాంతమైన తట్టు, రుబెల్లా వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చని తెలిపారు. తొమ్మిది నెలల చిన్నారి నుంచి 15 ఏళ్ల పిల్లలకు వరకూ తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయాలని సూచించారు. ఎంఆర్ వ్యాక్సిన్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కొళిగాం పీహెచ్‌సీ అధికారి డాక్టర్ నందికి శ్రీనివాసరెడ్డికి సూచించారు. అభ్యుదయ పాఠశాల పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ మంగరాజు, ఎంపీపీ ఢిల్లీరావు, జడ్పీటీసీ సభ్యుడు లింగరాజురెడ్డి, ఏఎంసీ చైర్మన్ సహదేవ్‌రెడ్డి, టీడీపీ పట్టణ కార్యదర్శి నందికి జాని, నాయకులు కోటి, తవిటయ్య, సాలిన ఢిల్లీ, గాలి పాపారావు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

మాకన్నపురం(సోంపేట): మండలంలోని మాకన్నపురంలో చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు మద్దిల నాగేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లండ బాబూరావు, హెల్త్ సూపర్‌వైజర్ యాదగిరి, ఏఎన్ఎం సుజాత, సుశీల, చంద్రశేఖర్, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కవిటి రూరల్ : తొమ్మిది నెలల చిన్నారి నుంచి 15 ఏళ్ల పిల్లలకు ఎంఆర్ టీకాను తప్పనిసరిగా వేయించాలని ఎంపీపీ కిరణ్ కుమారి, జడ్పీటీసీ సభ్యుడు రమేష్ అన్నారు. మంగళవారం బొరివంక జడ్పీ హైస్కూల్, రాజపురం ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఎంఆర్ టీకా వేశారు. ఈ నెల 8 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రాజపురం సర్పంచ్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు హేమాచలం, విజయ్, వైద్యులు హరిత, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: సన్యాసిపుట్టుగ పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎంఆర్ టీకాను వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎల్.చంద్రయ్య మాట్లాడుతూ, మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా చిన్నారులకు వేయించాలన్నారు. ఏఎన్ఎం భారతి, ప్రధానోపాధ్యాయుడు కె.శ్యామ్ పాల్గొన్నారు.



మాకన్నపురం, బొరివంక, సన్యాసిపుట్టుగలో విద్యార్థులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

అధికారుల ఫోన్‌నెంబర్లు

తహసీల్దార్:
ఉమామహేశ్వరరావు 9440971644
ఈవోపీఆర్‌డీ
డి.సుదర్శనరావు 9490655182
ఎంఈవో
ధనుంజయ మజ్జి 9849860156
ఏఈ (హౌసింగ్)
కె.కృష్ణారావు 7093930229
ఏఈ (విద్యుత్‌శాఖ)
వీర్రాజు 9440812439
ఏవో (వ్యవసాయం)
పి.నవీన్ 8096696702
హెచ్‌వో (ఉద్యానవనశాఖ)
శంకర్‌దాస్ 7995086808
పశు వైద్యాధికారి
వి.రమణ 7680830777
ఏఈఈ (ఆర్అండ్‌బీ)
బి.రవికాంత్ 9440459129
ఏపీవో (ఎన్ఆర్‌జీఎస్)
కె.భాస్కరరావు 8790007186
ఏపీఎం (వెలుగు)
ఎం.చక్రపాణి 8008803898
జేఈ (పంచాయతీరాజ్)
కె.కృష్ణారావు 9400365869

- కవిటి

వైద్య సమాచారం

కంచిలి మండలం ఎంఎస్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని మఠంసరియాపల్లి, భైరిపురం, కేశుపురం, బిన్నలకొత్తూరు, ఎక్కల గ్రామాల్లో బుధవారం చందన్న సంచార వైద్య సేవలు అందించనున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు.

గ్యాస్ సమాచారం

● సోంపేట శ్రీ సాయి ఏజెన్సీలో ఈ నెల 2న గ్యాస్ బుకింగ్ చేసుకున్న పట్టణ వినియోగదారులకు 3న, రూరల్ ప్రాంత వినియోగదారులకు 4న గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామని ఏజెన్సీ ప్రతినిధులు తెలిపారు.

● ఇచ్ఛాపురం సిద్ధభైరవి గ్యాస్ ఏజెన్సీ ద్వారా మండలంలోని ఈదుపురం, కొఠారి, పూర్ణాటకం, తులసిగాం, ధర్మపురం, బలరాంపురం, ఇన్నేసుపేట గ్రామాల్లో బుధవారం గ్యాస్ సరఫరా చేస్తామని ఏజెన్సీ ప్రతినిధులు వెంకటేష్, రామకోటి తెలిపారు.

ఘనంగా రామలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆవిర్భావ దినోత్సవం

● *103 మంది రక్తదానం*



ఇచ్ఛాపురం: చాట్ల రామలక్ష్మి చార్టిబుల్ ట్రస్ట్ ఆవిర్భావ దినోత్సవాన్ని స్వర్ణభారతి విద్యాసంస్థలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రారంభించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువకులు, టీడీపీ కార్యకర్తలు 103 మంది రక్తదానం చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిబాబు, సీఐ అవతరాం, టౌన్ ఎస్ఐ మంగరాజు, ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, జడ్పీటీసీ సభ్యుడు లింగరాజురెడ్డి, ఏఎంసీ చైర్మన్ సహదేవ్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుజ్జు జగన్నాథరెడ్డి, సూపర్‌బజార్ చైర్మన్ కొండా శంకర్‌రెడ్డి, టీడీపీ పట్టణ కార్యదర్శి నందికి జాని, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కోటబొమ్మాళి:హరిశ్చంద్రపురం ఫ్లైఓవర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వరహాలమ్మపేటకు చెందిన లారీక్లీనర్ చదునపల్లి అప్పన్న తీవ్రంగా గాయపడ్డాడు. ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

'అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి'

టెక్కలిటౌన్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరమని టెక్కలి అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ బి.లక్ష్మణస్వామి చెప్పారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో స్థానిక చిన్నకండ్రవీధిలోని ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు, సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ముఖ్యంగా గ్యాస్‌పై వంట చేస్తున్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు.

'పిల్లలు బడుల్లోనే ఉండాలి'

నందిగాం: బడిఈడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పిం చే బాధ్యత తీసుకోవాలని సర్వశిక్ష అభియాన్ ఏఎంవో పూజారి గో విందరావు కోరారు. మంగళవారం ఆయన స్థానిక మండల వనరు ల కేంద్రంలో విద్యార్థి గణనపై ఆరాతీశారు. ఈ సందర్భంగా సీఆర్‌పీలు, ఇన్‌స్ట్రక్టర్లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రజాసాధికార సర్వే ప్రకారం మం డలంలో 938 మంది పిల్లలు బడి బయట ఉన్నారని, వీరిలో 593 మంది వలస వెళ్లినట్లు గుర్తించామని తెలిపారు. ఈ పిల్లలు చదువుతున్నది, లేనిది ఆరాతీయాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారి జి.నర్సింహులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఏఐఈ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయిని పినకాన రాణి, కో-ఆర్డినేటర్ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థి గణనపై సమీక్షిస్తున్న ఏఎంవో

సినిమాలు

సోంపేట
శ్రీనివాస.. గౌతమ్‌నంద
శివ...... ఫిదా

ఇచ్ఛాపురం
పూర్ణ .... ఫిదా
శ్రీమణికంఠ... గౌతమ్‌నంద

కవిటి
మహాలక్ష్మి.. గౌతమ్‌నంద
అశోక్..... ఫిదా

పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటండి



ఇచ్ఛాపురం రూరల్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీపీ దక్కత ఢిల్లీరావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. సంరక్షణ బాధ్యతను కార్యాలయ సిబ్బందికి అప్పగించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ఎ.లింగరాజు, ఏఎంసీ చైర్మన్ ఎస్.సహదేవురెడ్డి, డి.కామేష్, దీనబంధ్‌రెడ్డి పాల్గొన్నారు.



పార్వతికి నగదు అందిస్తున్న అధికారులు

చంద్రన్న బీమా పంపిణీ

సోంపేట: స్థానిక హరిజనవీధికి చెందిన శ్రీకాకుళం యర్రయ్య మృతి చెందడంతో నామినీగా ఉన్న ఆయన భార్య పార్వతికి మంగళవారం చంద్రన్న బీమాను అందజేశారు. తక్షణ సాయం కింద రూ.5వేలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం నాయుడు, టీడీపీ నాయకులు చిత్రాడ శేఖర్, జోగుపల్లి దానయ్య, బీమామిత్ర రాధ, బెండి సుజాత పాల్గొన్నారు.

బిన్నాలకొత్తూరు(కంచిలి): బిన్నాలకొత్తూరు గ్రామానికి చెందిన గునిశెట్టి కృష్ణారావుకు చంద్రన్న బీమా పథకం ద్వారా రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పల్లి ఆరోగ్య కేంద్రం అధ్యక్షుడు బి.కామేష్‌రెడ్డి జన్మభూమి కమిటీ సభ్యులు మాదిన రామారావు, మన్మథరావు, వెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కృష్ణారావుకు చంద్రన్న బీమా అందిస్తున్న దృశ్యం

సాగునీటికి అన్నదాత ఆరాటం

● బాహుదాలో పూర్తికాని గ్రోయిన్స్ నిర్మాణం
● వృథాగా పోతున్న సాగునీరు ● ఇసుక బస్తాలను అడ్డుగా వేస్తున్న రైతులు

ఇచ్ఛాపురంరూరల్: బాహుదా నదిలో గ్రోయిన్స్ నిర్మాణాలు పూర్తికాకపోవడంతో రైతులు సాగునీటిని కాపాడుకునేందుకు తీవ్ర ప్రయాస పడుతున్నారు. ఇసుక బస్తాలను అడ్డుగావేసి నీటి వృథాను అరికట్టేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. దీనికోసం మూడు రోజులుగా ఈదుపురం, కేశుపురం, డొంకూరు, బూర్జపాడుకు చెందిన సుమారు 300 మంది రైతులు వంతుల వారీగా శ్రమిస్తోన్నారు. అయినా ఫలితం ఆశించినంతగా ఉండడం లేదు. గ్రోయిన్స్ పూర్తికాకపోవడంతో నదిలోకి వచ్చిన నీరంతా వృథాగా సముద్రంలో కలిసిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రోయిన్స్‌కు తలుపులు పెట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. నదిలో ఉన్న కొద్దిపాటి నీటిని కాపాడుకోవడానికి రైతులు ఇసుక బస్తాలను అడ్డుగా వేస్తున్నారు. మరోపక్క వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరి నాట్లు ఎండిపోతున్నాయి. వచ్చే ఏడాదికైనా అధికారులు గ్రోయిన్స్ పనులు పూర్తి చేసి నీరు వృథా కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



ఇసుక బస్తాలను వేస్తున్న రైతులు

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



రైతు సంక్షేమమే ధ్యేయమని చెబుతున్న ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు.వేసవిలో పూర్తి చేయాల్సిన గ్రోయిన్స్ పనులను అధికారులు అర్థాంతరంగా నిలిపేశారు. దీంతో బాహుదాలోని నీరంతా వృథాగా సముద్రంలో కలిసిపోతుంది. సాగునీరు అందక వరి నాట్లు ఎండిపోతున్నాయి. ప్రతి ఏడాదిలాగే ఈదుపురం, కేశుపురం, డొంకూరు, బూర్జపాడ రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు.

-ఎన్.చంద్రయ్య సర్పంచ్, కేశుపురం.

సగంలో పనులు ఆపేశారు



బాహుదా నదిలో ఈదుపురం వద్ద గత నెలలో ప్రారంభించిన గ్రోయిన్ పనులను సగంలో ఆపేశారు. దీంతో నదిలోని నీటిని కాపాడుకునేందుకు ఇసుక బస్తాలను అడ్డుగా వేస్తున్నాం. అయినా నీరు వృథాగా వెళ్లిపోతుంది. వేసవిలోనే ఈ పనులను పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు.

-దున్న లోకనాథం, ఎంపీటీసీ ప్రతినిధి డొంకూరు.

సాంకేతికతను ఉపయోగించుకోండి

● ఎమ్మెల్యే అశోక్ ● జగతిలో ఏపీ ఫైబర్ గ్రిడ్ ప్రారంభం

కవిటి: మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను ప్రజలు ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మంగళవారం జగతిలో ఏపీ ఫైబర్ గ్రిడ్‌ను ఆయన ప్రారంభించారు. చింతామణి కేబుల్ ఆపరేటర్స్ సంఘం ఆధ్వర్యంలో అక్షయ నెట్‌వర్క్ యజమాని బాబూరావు ఈ ఫైబర్ గ్రిడ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ, ఈ ఫైబర్ గ్రిడ్‌తో ఇంటర్నెట్, ఫోన్, కేబుల్ సదుపాయాలను తక్కువ ధరకు అందిస్తున్నట్టు తెలిపారు.కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బి.రమేష్, సర్పంచ్ జి.దాశరథి, ఎంపీటీసీ సభ్యుడు ఎం.వెంకటరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు రమణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.కృష్ణారావు, బి.చినబాబు, హెచ్.భీమారావు, మణిచంద్రప్రకాష్, పి.నేతాజి, ఎస్.జయప్రకాష్, పి.జోగయ్య, టి.హరనాథ్, గీతా కేబుల్ ఓనర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ● నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు వేయనున్నట్టు ఎమ్మెల్యే అశోక్ తెలిపారు. జగతిలో రూ.3లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డును మంగళవారం ప్రారంభించారు.



ఫైబర్ గ్రిడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



ప్రగడపట్టుగలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే అశోక్

మొక్కలతోనే మానవ మనుగడ

ప్రగడపట్టుగ (కవిటి రూరల్) : మానవులు మనుగడ సాధించాలంటే తప్పనిసరిగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే అశోక్ అన్నారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రగడపుట్టుగలో మొక్కలు నాటారు. బావితరాలకు మంచి వాతారణం అందించాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రమేష్, కవిటి, బొరివంక సర్పంచ్‌లు శేఖర్, శ్రీరామ్‌ప్రసాద్, చిన్నబాబు, బి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

‘ఇక నుంచి నేరుగా ఇంటికే రేషన్’

జర్జంగి(కోటబొమ్మాళి): మంచంపట్టిన, వేలిముద్రలు పడని వారికి ఇకనుంచి ‘మీ ఇంటికి మీ రేషన్’ ద్వారా రేషన్ డీలరు లేదా వీఆర్‌వో లేదా వీఆర్‌ఏ నేరుగా లబ్ధిదారుని ఇంటికే సరుకులు అందజేస్తారని సివిల్‌సప్లైస్ డీటీ డి.వి.వి.ఎన్.రాజు చెప్పారు. మంగళవారం ఆయన కోట బొమ్మాళి మండల పరిధి జర్జంగిలో బెడ్‌రిడెన్ కేసులకు సంబంధించి 20 మంది ఇళ్లకు వెళ్లి రేషన్ అందజేశారు. ఈ విధానం ద్వారా కచ్చితంగా ప్రతి ఇంటికి సరుకులు చేరుతాయని, బినామీల సమస్య ఉండదని, ఎవరికీ సరుకులు అందలేదనే విమర్శలు ఉండబోవని అన్నారు. డీలర్‌తో పాటు వీఆర్‌వో, వీఆర్‌ఏ ఇందులో ప్రధాన భూమిక పోషిస్తారని, వేలిముద్రలు పడకపోయిన వారిని గుర్తించి సరుకులు అందజేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌వో ఏ కాశి, రేషన్‌డీలర్ దానయ్య, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం సమీపంలోని తులసి గెడ్డలో సన్యాసిపుట్టుగ రైతులు గ్రోయిన్ నిర్మించడంపై ఐదు గ్రామాల రైతులు ఆందోళన చేపట్టారు. ఈ గ్రోయిన్‌తో తమకు నీరు రావడం లేదని పెద్దలక్ష్మీపురం, చిన్నలక్ష్మీపురం, శివకృష్ణాపురం, డొంకూరు, బూర్జపాడుకు చెందిన రైతులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తమ పొలాలకు వచ్చే నీరంతా వృథాగా సముద్రంలో కలిసిపోతుందని, దీనివల్ల సుమారు 900 ఎకరాలు బీడుగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

తైక్వాండో విజేత సిద్దుకు అభినందనలు

ఇచ్ఛాపురం : రాష్ట్రస్థాయి తైక్వాండ్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన స్థానిక శాంతినికేతన్ పాఠశాలకు చెందిన సిద్దును పాఠశాల చైర్మన్ దక్కత కృష్ణమూర్తి, తదితరులు అభినందించారు. అనంతరం కోచ్ దుర్గాప్రసాద్‌ను సన్మానించారు.



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

● నియోజకవర్గ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు దక్కత కృష్ణమూర్తిరెడ్డి జన్మదినం సందర్భంగా 50మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కోట రామారావు, వెంకటచిన్న, పాపారావు, ఉపాధ్యాయులు కేసీపూరి, సురేఖ, శంకరరావు పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 5

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో ప్రోత్సాహకరం. ఉన్నత విద్యా విషయాలు, సమావేశాలు, చర్చల్లో సత్ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాలు, వ్యాహారచర్చలకు అనుకూలం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగవుతుంది. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. ఇంటి అవసరాలకు సకాలంలో డబ్బు చేతికి అందుతుంది. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

మిథునరాశి:(మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. బంధుమిత్రులతో సమావేశాలు ఫలిస్తాయి. ప్రియతముల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. సమావేశాల్లో, బృందకార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో సహోద్యోగులు సహకరిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. క్యాటరింగ్, రిటైల్ రంగం, హోటల్, వైద్య రంగాల వారికి ప్రోత్సాహకరం.

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభిస్తాయి. విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. సృజనాత్మక రంగాల వారికి ప్రోత్సాహకరం. చిన్నారుల విషయంలో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం. బదిలీలు, మార్పులకు సంబంధించి ముఖ్య సమాచారం అందుకుంటారు. సంస్మరణలు, ఆధ్మాత్మిక కార్యక్రమాలు సాంత్వన కలిగిస్తాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో అదనపు ఆదాయం అందుకుంటారు. పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో పెద్దల నుంచి మంచి సలహాలు లభిస్తాయి.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): అంచనాలు ఫలించడంతో మనసు ఉల్లాసంగా ఉంటుంది. కొత్త పనులు ప్రారంభిస్తాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల కోసం నిధుల సేకరణకు ప్రయత్నిస్తారు. ప్రయాణాలు, సమావేశాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు. పెట్టుబడులు ప్రోత్సాహకరం. బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. భాగస్వామి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

-విజుమళ్ళ బిందుమాధవ శర్మ

చిగురించిన ఆశలు

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కొన్ని సూచనలు చేశారు. ఈ మేరకు ప్రభుత్వం స్పందించి.. కిడ్నీవ్యాధి ప్రభావిత గ్రామాల్లో శుద్ధజలాన్ని అందజేయాలని నిర్ణయించింది. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా రూ.2కే 20లీటర్ల స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ముందుకు వచ్చింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేసింది. ఇన్నాళ్లూ కిడ్నీ బాధితులు డయాలసిస్ చేసుకునేందుకు విశాఖపట్నం వెళ్లవచ్చేవారు. రవాణా చార్జీలు, మందుల ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో జిల్లాలో టెక్కలి, పలాస, సోంపేటతోపాటు మరో రెండు చోట్ల డయాలసిస్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక ప్రధానంగా కిడ్నీ బాధితులకు పింఛన్ అందజేయనున్నట్టు ప్రకటించింది. ఇలా ఇప్పటికే బాధితులను ఆదుకునే చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. తాజాగా కిడ్నీ వ్యాధి మూలాలు కనుగొనేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా అమెరికాకు చెందిన హార్వర్డ్ వైద్యనిపుణుల బృందం ఉద్దానంలో శనివారం పర్యటించింది. అనంతరం విశాఖపట్నంలో పవన్‌కల్యాణ్‌తో ఆదివారం సమావేశమై.. బాధితుల ఆహారపు అలవాట్లు.. ఎదుర్కొంటున్న సమస్యలను వివరించింది. వీటన్నింటినీ క్రోడీకరించి సమగ్ర నివేదిక తయారుచేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సోమవారం ఈ బృందం సమావేశమై నివేదికను సమర్పించింది. ఈ నేపథ్యంలో భారతీయ వైద్య మండలి సహకారంతో అంతర్జాతీయ వైద్యనిపుణులతో కిడ్నీ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంగీకరించారు. మూడేళ్లలో రూ.15కోట్లు మంజూరు చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు హామీ ఇచ్చారు. ఈక్రమంలో పరిశోధన సంస్థ ఏర్పాటుకు ఉద్దానంలో పర్యటించిన హార్వర్డ్ వైద్యనిపుణులు జోసఫ్.. ముఖ్యమంత్రి సహకారం కోరారు. దీనికి సానుకూల స్పందన రావడం బాధితుల్లో సంతోషాన్ని నింపుతోంది. పవన్‌కల్యాణ్ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం.. కిడ్నీ మూలాలు కనుగొని.. వ్యాధి నివారణకు చేస్తున్న కృషిని అభినందిస్తూ.. బాధితులు ధన్యవాదాలు తెలుపుతున్నారు. మరోవైపు అనాథ పిల్లల కోసం ఉద్దానంలో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేస్తామన్న సీఎం హామీని త్వరగా నెరవేర్చాలని కోరుతున్నారు. పింఛన్లు అందించేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మొత్తమ్మీద ఈ అంశంపై కదలిక రావడం ఉద్దానం వాసుల్లో ఆనందానికి కారణమవుతోంది.



కిడ్నీ బాధితులతో మాట్లాడుతున్న పవన్(ఫైల్)

సానుకూలంగా స్పందించారు

ఉద్దానంలో పట్టిపీడిస్తున్న కిడ్నీవ్యాధిపై ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతంలోనే డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసి.. ఆర్థికంగా ఉపశమనం కల్పించింది. పింఛన్ సదుపాయం కల్పిస్తూ.. ఎంతో మందికి అండగా నిలవడం శుభపరిణామం.

-గనగళ్ల భారతమ్మ, ఇద్దివానిపాలెం.

ముందడుగు

పవన్‌కల్యాణ్ కృషితో రాష్ట్రప్రభుత్వం ఉద్దానంలో కిడ్నీ బాధితులకు ఊరటనిచ్చే నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా కిడ్నీవ్యాధి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం ఆనందదాయకం. దీనిని ఏర్పాటు చేస్తే.. కిడ్నీ రావడానికి గల కారణాలు తెలిసే అవకాశముంది. తద్వారా సమస్యకు పరిష్కారం లభించనుంది.

-లమ్మత శేషగిరి, శ్రీరాంపురం

మనోరమ సస్పెన్షన్!

(మొదటిపేజీ తరువాయి)

సహోద్యోగులపై వేధింపులు, ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులపై అలసత్వం, ప్రభుత్వ భవనంలోకి మారడంలో అలక్ష్యం ఇలా పలు కారణాలతో ఆమె తీవ్ర వివాదాస్పదంగా మారారు. వివరకు శనివారం నాటి జిల్లాపరిషత్ సమావేశంలోను మంత్రి దగ్గరనుంచి ఇతర ప్రజాప్రతినిధులు వరకు ఆమె తీరుపై నిప్పులు కక్కిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్టుడైరెక్టర్ లీలావతి.. ఇప్పటికే మనోరమ నిర్లక్ష్యపు వ్యవహారంపై తయారుచేసిన నివేదికను సోమవారం ఏజేసీకి అందజేశారు. ప్రభుత్వ నిధుల వినియోగం, విడుదలలో అలవిమాలిన నిర్లక్ష్యం ప్రదర్శించారని, విధుల్లో కూడా బాధ్యతారాహిత్యంగా ఉన్నారని అందులో పేర్కొన్నారు. దీంతో ఆమెను సస్పెండ్ చేయడమే సరైందని పేర్కొంటూ ఫైలు పంపించారు. దీన్ని పరిశీలించిన ఏజేసీ.. కలెక్టర్ ధనుంజయరెడ్డికి మంగళవారం ఫైలును పంపించారు. అనంతరం మనోరమపై తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్‌తో చర్చించారు. సస్పెండ్ చేయాలని దాదాపు నిర్ణయానికి వచ్చారు. సస్పెండ్ చేసి విచారణ చేపట్టాలా? లేదా విచారణ చేపట్టిన తర్వాత సస్పెండ్ చేయాలా? అనే సందేహం నెలకొంది. సాక్షాత్తూ ఐసీడీఎస్ పీడీ స్వయంగా తన నివేదికలో మనోరమ తీరుపై నివేదిక ఇచ్చిన నేపథ్యంలో సస్పెండ్ చేస్తేనే మేలనే నిర్ణయించారు. దీంతో కలెక్టర్ త్వరలో ఈమెను సస్పెండ్ చేయనున్నారు. కాగా ఈమెపై విచారణ చేయడానికి జిల్లాస్థాయి అధికారిని ఒకరిని నియమించే అవకాశాలున్నాయి. జిల్లాపరిషత్‌లో తనపై చెలరేగిన వివాదాలు.. 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన 'ఇదేమి తీరు' కథనం నేపథ్యంలో మంగళవారం మనోరమ.. కలెక్టర్‌ను కలిసి వివరణ ఇచ్చేందుకు కలెక్ట రేట్‌కు రావడం విశేషం.

కౌలు కష్టం!

(మొదటిపేజీ తరువాయి)

మా సహకారం తీసుకోండి' అంటూ బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ ధనుంజయరెడ్డి ఆదేశించారు. కానీ బ్యాంకర్లకు ఇవేమీ పట్టడం లేదు. కౌలు రైతులకు రుణాల మంజూరు విషయంలో అదే నిర్లక్ష్యం చూపుతున్నారు.

జిల్లాలో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. 80 శాతం మంది కౌలు రైతులు ఆరుగాలం శ్రమించి సాగుభూమిని సస్యశ్యామలం చేస్తున్నారు. కానీ ప్రభుత్వ రుణాలు, రాయితీలు వీరి దరికి చేరడం లేదు. భూములను కౌలుకు ఇచ్చిన యజమానులే వాటిని అందుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా సాగుతున్న ఈ ధోరణి నుంచి బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు బయటపడలేకపోతున్నారు. భూమి పత్రాలు ఉన్నవారికే పంట రుణం అని బ్యాంకర్లు అంటుంటే.. ఏం చేయాలో పాలుపోక కౌలురైతులు బేలగా చూస్తున్నారు. నిర్దిష్టమైన ప్రణాళిక లేక, లోపభూయిష్టమైన విధానాలతో బ్యాంకుల నుంచి పంట రుణాలు మంజూరు కావడం లేదు. కౌలు రైతులు కావడంతో వడ్డీ వ్యాపారులు సైతం వీరి పంట మదుపులకు అప్పు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కౌలు రైతుల పరిస్థితి కన్నీళ్లు తెప్పిస్తోంది. కౌలు రైతులు అర్హత గుర్తింపు కార్డులు పొంది జాయింట్ లయబిలిటీ గ్రూపులు (జెఎల్‌జీలు)గా ఏర్పడిన వారికి వ్యవసాయ పర్యవేక్షణలో బ్యాంకులు పంట రుణాలు ఇవ్వాల్సి ఉండగా అది జిల్లాలో సక్రమంగా అమలు కావడం లేదు. మరో పక్క రూ.లక్ష వరకూ పంట రుణాలకు ఎటువంటి ఆటంకాలు కలిగించవద్దని ప్రభుత్వం బ్యాంకులకు స్పష్టంచేసినా సంబంధిత ఉత్తర్వులు తమకు రాలేదని చెప్పి రుణాలకు వచ్చిన సాధారణ, కౌలు రైతులకు శ్రీముఖం పట్టిస్తున్నారు.

● ఆదుకుంటున్న బ్యాంకర్లు...

కౌలు రైతులతో బ్యాంకర్లు చెలగాటమాడుతున్నారు. గతంలో మంజూరుచేసిన పంట రుణాల రెన్యువల్‌కు కూడా బ్యాంకర్లు అనేక ఆంక్షలు పెడుతున్నారు. 1బీ, ఈసీ, అడంగల్ కాపీలు కోరుతున్నారు. ఒకే సర్వే నెంబర్‌పై ఇద్దరికి పంట రుణం ఇవ్వడం సాధ్యం కాదని చెబుతూ సాగుచేయని భూయజమానికి పంట రుణం ఇస్తూ వాస్తవ సాగుదారుడు(కౌలు రైతు)కు మొండిచేయి చూపుతున్నారు. కౌలు రైతులు వ్యవసాయ పెట్టుబడులకు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని నష్టపోతున్న పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. 2011 భూ అధీకృత చట్టం ప్రకారం పంట రుణం కౌలుదారులకే ఇవ్వాల్సి ఉన్నా అలా జరగడం లేదు. భూమి కౌలుకు ఇచ్చిన యజమానికి పంటేతర రుణం ఇవ్వాలని చట్టం చెబుతోంది.

● పెట్టుబడి లేక అవస్థలు....

పెద్ద నోట్ల రద్దు తర్వాత ఎవరి వద్దా భారీ మొత్తంలో నగదు ఉండడం లేదు. దీనివల్ల గ్రామాల్లో అప్పులిచ్చే వారు తగ్గిపోయారు. అలాగే ధాన్యం లెవీ విధానాన్ని ప్రభుత్వం రద్దుచేసింది. గతంలో లెవీ విధానం ఉన్నప్పుడు కమిషన్‌దారులు మిల్లర్ల ద్వారా రైతులకు అప్పులు ఇచ్చేవారు. ఇప్పుడు మిల్లర్లు పెట్టుబడి పెట్టడం లేదు. కమిషన్‌దారులు అప్పులు ఇచ్చే పరిస్థితి ఉండడం లేదు. దీంతో కౌలు రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఆ తర్వాత అప్పుల ఊబిలో కూరుకుపోయి విలవిల్లాడుతున్నారు.

మానవత్వంతో ఆలోచించాలి

ఇటు బ్యాంకుల నుంచి రుణం అందక, అటు ప్రైవేటు అప్పులు దక్కక కౌలు రైతులు విలవిల్లాడుతున్నారు. బ్యాంకర్లు మానవత్వంతో ఆలోచించాలి. కౌలు రైతుకు రుణాలు అందించకపోతే సాగు ఎలా సాధ్యమవుతుంది. బ్యాంకర్లు భూ యజమానుల రుణాలను రెన్యువల్ చేయడానికే ప్రాధాన్యమిస్తున్నారు. లక్ష్యాల గణాంకాల్లోనూ వీటినే చూపుతున్నారు. తద్వారా నిజమైన సాగుదారునికి న్యాయం జరగడం లేదు.

బుడితి అప్పలనాయుడు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి

● సేద్యానికి ఎలా ముందుకెళ్లేది?

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 2.08లక్షల హెక్టార్లలో వరి పంట సాగవుతుందని వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. వరితోపాటు చెరకు, మొక్కజొన్న పంటలు సాగవుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రుణ ప్రణాళిక లక్ష్యం.. రూ.1,580 కోట్లు. జిల్లాలో 80శాతం మంది కౌలు రైతులు ఉన్న నేపథ్యంలో వారి కోసమే.. సుమారు రూ.వెయ్యికోట్లకు పైగా రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకూ కేవలం రూ.1.13 కోట్లు మాత్రమే బ్యాంకర్లు మంజూరు చేశారు. జిల్లాలో రెండంకెల వృద్ధి సాధించాలంటే ఈ తరహా పరిస్థితులతో ఎలా సాధ్యం అన్న ప్రశ్న తలెత్తుతోంది. రుణాల మంజూరులో బ్యాంకర్లువెనుకంజ వేయడంపై నిరసన వ్యక్తమవుతోంది.

లోప భూయిష్టమైన విధానాలే కారణమా...

కౌలు రైతులకు రుణాలు బ్యాంకులు అందజేయకపోవడంలో లోపభూయిష్టమైన విధానాలే కారణమని రైతు సంఘాల నేతలు విశ్లేషిస్తున్నారు. రుణఅర్హత గుర్తింపుకార్డులు పొంది గ్రూపులుగా ఏర్పడిన వారికి వ్యవసాయ శాఖ అధికారుల ధ్రువీకరణ ద్వారా బ్యాంకులు పంట రుణాలు అందివ్వాల్సి ఉండగా... సక్రమంగా అమలుకావడం లేదని కౌలురైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా బ్యాంకర్లు.. స్పందించి.. రుణాలు మంజూరు చేయాలని, ఇందుకు అధికారులు చొరవచూపాలని కోరుతున్నారు.

గ్రూపులుగా ఏర్పాటు చేస్తాం

జిల్లాలో కౌలురైతులను జేఎల్‌జీ (జాయింట్ లయబులిటీ గ్రూప్)లుగా ఏర్పాటుచేస్తాం. ఒక్కో గ్రూప్‌లో నలుగురు రైతులు ఉంటారు. గ్రూపులుగా ఏర్పడితే పంటరుణాలు పొందేందుకు అవకాశాలు మెరుగుపడతాయి. ఒర్వకల్లు మాదిరిగా కౌలురైతులతో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటుచేయిస్తాం. ఇందుకోసం జిల్లాకేంద్ర సహకారబ్యాంక్ సహకారం తీసుకుంటున్నాం. ఈ తరహాలో మొత్తం జిల్లావ్యాప్తంగా 18 డీసీసీబీల పరిధిలో 320 గ్రూపులు ఏర్పాటుచేసేందుకు నిర్ణయించాం. అర్హులైన సాగుదారులకు రుణాలు అందేలా బ్యాంకులను కోరుతున్నాం.

జె.రామారావు, సంయుక్త సంచాలకుడు, జిల్లా వ్యవసాయశాఖ

సూక్తి

లక్ష్య సాధనలో ఎన్నిసార్లు ఓడినా సరే.. మరోసారి ప్రయత్నించు.



వావ్.. చార్లెస్ వంతెన

స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వతాల్లో పచ్చదనం పరుచుకున్న అందాలతో, ప్రకృతి శోభతో అలరారే రెండు కొండ ప్రాంత గ్రామాలే.. జెర్మట్, గ్రెచెన్. వాటి మధ్యలో లోతైన గ్రాబెంగూఫర్ లోయ. గ్రెచెన్ నుంచి జెర్మట్‌కు చేరుకోవాలంటే ఆ లోయతో పాటు, చిన్న చిన్న కొండలూ ఎక్కి దిగాల్సిందే. మొత్తంగా మూడు గంటల సమయం పడుతుంది. అక్కడి ప్రజలకు ఇప్పుడు ఆ సమస్య తీరిపోయింది. కేవలం పది నిముషాల్లోనే ఇరు గ్రామాలకు చకచకా వెళ్లిపోవచ్చు. ఎలానో తెలుసా? ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెన అక్కడ ప్రారంభించారు.



ఆల్ప్స్‌పర్వతాల్లోని రెండు కొండల మధ్య ఓ పొడవాటి వంతెన నిర్మించారు. దాని పేరు "చార్లెస్ కువోనెన్'. గాలికి ఊగుతూ, తూగుతూ ఉండే ఆ వంతెనను చూస్తుంటే.. కొందరికి కొండల మధ్య వెండి ఊయల్లా తోస్తుంది. ఇంకొందరికి నడిచే రోలర్ కోస్టర్‌లా కనిపిస్తుంది. ఇది సస్పెన్షన్ మోడల్ బ్రిడ్జి. వంతెనపై నడుస్తుంటే కాస్త ఊగుతూ ఉంటుంది.

జూలై 29న ప్రారంభమైన ఈ వంతేన ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనగా రికార్డుల్లోకి ఎక్కింది. దీని పొడవు 494 మీటర్లు.

ఈ వంతెన భూ ఉపరితలానికి 85 మీటర్ల ఎత్తులో ఉంది.


ఇప్పటివరకు జర్మనీలోని 'టైటాన్ -ఆర్‌టీ' వంతెనను అతి పొడవైనదిగా పేర్కొనేవారు.

ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనల్లో రష్యాలోని 'స్కైపార్క్ బ్రిడ్జ్' మూడో స్థానంలో ఉంది. 2016 సోచి ఒలింపిక్స్ సందర్భంగా దీన్ని నిర్మించారు.


ఎత్తయిన ప్రదేశాలను చూసి భయపడేవారు, 'చార్లెస్ కువోనెన్' వంతెన దాటాలంటే కళ్లు మూసుకోవాల్సిందేనని జెర్మట్ ట్రావెల్ బోర్డు ప్రతినిధి అంటున్నారు.

రోడ్డు మార్గంలో వంతెన కట్టాలంటేనే ఓ నెల రోజుల సమయం పడుతుంది. కానీ రెండు కొండల మధ్యలో నిర్మించిన ఈ బ్రిడ్జిని కేవలం 10 వారాల్లోనే పూర్తి చేయడం విశేషం.

రంగులు వెయ్యండి



బొమ్మ గీయండి



టంగ్ ట్విస్టర్స్



1. I would if I could, and if I couldn't, how could I? You couldn't, unless you could, could you?
2. The crow flew over the river with a lump of raw liver.
3. National Sheepshire Sheep Association

ఒకే అక్షరం

1. TOTAL	మొ	
2. BUD	మొ	
3. PLANT	మొ	

నవ్వుల్ నవ్వుల్


రాహుల్ : కుట్టేముందు దోమలు ఎందుకు శబ్దం చేస్తాయి?
రోహిత్ : దాడి చేయబోతున్నాను అని వర్తమానం ఇవ్వడం యుద్ధనీతిలో భాగం.



చుక్కలు కలపండి



దారి కనుక్కోండి



చెప్ప గలరా?

జాలిలో ఉన్నా కానీ గాలిలో లేను
బిరుదులో ఉన్నా కానీ అరుదులో లేను
లిపిలో ఉన్నా కానీ తాపిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?


ఔనా!



వందలో డెబ్బై శాతం మంది 'హైపనిక్ జెర్క్' ఎదుర్కొన్నవారే. ఇదేదో కొత్త వ్యాధి అని అనుకుంటున్నారా? అదేం కాదు. మాంచి నిద్రలో ఉన్నప్పుడు ఎక్కడ నుంచో కింద పడుతున్నట్లు అనిపించి చటుక్కున మెలకువ వస్తుంది. అదే 'హైపనిక్ జెర్క్'.

మీకుతెలుసా?

మీకు చెట్లతో కూడిన అరణ్యాలే తెలుసు.. మరి శిలలతో ఉన్న అడవి తెలుసా? చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో ఉన్న పొడవైన శిలల సముదాయాన్నే 'స్టోన్ ఫారెస్ట్' అని పిలుస్తారు.



జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. ఐత్యంకమ ▸ ....
2. సందనపా ▸ ....
3. పిగూడుట్ట ▸ ....

- పత్తిపాక అంకిత, కోరుట్ల

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. IRAN ▸ ....
2. IDWE ▸ ....
3. DMBU ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

జవాబులు

జంబ్లింగ్ వర్డ్స్ : 1.RAIN 2.WIDE 3.DUMB
జంతర్‌మంతర్ : 1. ఐకమత్యం 2. సంపాదన 3. పిట్టగూడు
చెప్పగలరా? : జాబిలి
ఒకే అక్షరం : 1. మొత్తం 2. మొగ్గ 3. మొక్క

తట్టు, పొంగు తరిమికొట్టేందుకే ఎంఆర్ వ్యాక్సిన్

● జడ్పీ ఛైర్‌పర్సన్ ధనలక్ష్మి

డేఅండ్‌నైట్ జంక్షన్: తట్టు, పొంగు వ్యాధులను తరిమికొట్టేందుకు ఎంఆర్ వ్యాక్సిన్ ఉపయోగపడుతుందని జడ్పీ ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె ఈ వ్యాక్సినేషన్‌ను శ్రీకాకుళంలోని టీపీఎంహెచ్ స్కూల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ చిన్నారుల ప్రాణాలు కాపాడేందుకు ఈ టీకా ఎంతో ఉపయుక్త మన్నారు. 9 నెలల నుంచి 15 ఏళ్లలోపువారు ఈ టీకాను తప్పనిసరిగా వేయించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ ఎంతో ఖరీదైన టీకాను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ కె.ధనుంజయరెడ్డి మాట్లాడుతూ తట్టు, పొంగు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరికీ టీకా వేయించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టీకా విలువ రూ.4500 నుంచి 5000 వరకు ఉంటుందని చెప్పారు. ఈ టీకా వేయడానికి జిల్లాలో 5,85,875 మంది చిన్నారులను గుర్తించామని చెప్పారు. 107 ఎంఆర్ కేంద్రాలు ప్రారంభించడమే కాకుండా 80 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 478 ఉప అరోగ్య కేంద్రాలు, 4,247 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో టీకా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 1,117 టీకా అవుట్‌రీచ్ కేంద్రాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో ఏర్పాటు చేసిన 2,140 కేంద్రాల ద్వారా టీకా అందించుటకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ వ్యాక్సినేషన్ పర్యవేక్షించేందుకు 8 మంది ప్రోగ్రాం అధికారులను నియమించామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య శాఖ జేడీ జి.సావిత్రి, డీఎంహెచ్‌వో ఎస్.తిరుపతిరావు, డీఈవో ఎ.ప్రభాకరరావు నగరపాలకసంస్థ ఆరోగ్యాధికారి డి.భాస్కరరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బి.జగన్నాథరావు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంఆర్ వ్యాక్సినేషన్ ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యే, కలెక్టర్

ర్యాగింగ్‌కు పాల్పడితే జైలే

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యామలాదేవి

శ్రీకాకుళం(కలెక్టరేట్): విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే జైలుశిక్ష తప్పదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యామలాదేవి హెచ్చరించారు. రిమ్స్ కళాశాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు' నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై అవగాహన లేక బలవుతున్నారన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడడంతో వారి భవిష్యత్‌కు తీరని నష్టం వాటిల్లుతోందని తెలిపారు. విద్యా సంస్థల యాజమాన్యాలకు కూడా శిక్ష ఉంటుందని చెప్పారు. విద్యార్థులు సోదరభావంతో నడవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ కె.కృష్ణవేణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. గురుప్రసాద్, జిల్లా బార్ అసోసియేషన్ అ ధ్యక్షుడు ఎ.సత్యనారాయణ, సీఐ తిరుపతి, వైద్యులు, రిమ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న శ్యామలాదేవి

బదిలీ ఉత్తర్వులు విడుదల

● నూతన స్థానాల్లో చేరుతున్న ఉపాధ్యాయులు

● భాషాపండితులకు బ్రేక్

● పాత స్థానాల్లోనే కొనసాగింపు

(శ్రీకాకుళం సిటీ)

బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు నూతన పాఠశాలల్లో చేరాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. దీంతో ఆ ప్రక్రియ ప్రారంభమైంది. మంగళవారం సాయంత్రం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ బదిలీ ఉత్తర్వులను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. వీటిని ఉపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకుని నూతన పాఠశాలల్లో జాయినింగ్ రిపోర్టు అందజేయాలని సూచించింది. దీంతో గురువులు కొందరు మంగళవారం పాత స్థానాల నుంచి రిలీవ్ అయ్యారు. బుధవారం నుంచి కొత్త పాఠశాలల్లో కొలువు దీరుతున్నారు.

● **భాషా పండితుల బదిలీలు రద్దు..**

ఇదిలా ఉండగా భాషా పండితుల బదిలీలను రద్దు చేస్తూ పాఠశాల విద్యాశాఖ అనూహ్య నిర్ణయం తీసుకుంది. వీరిని రిలీవ్ చేయవద్దని మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇప్పటికే కొందరు భాషాపండితులు రిలీవ్ అయి కొత్తస్థానాల్లో చేరేందుకు సమాయత్తమవుతున్నారు. కానీ వీరు కొత్తస్థానాల్లో చేరవద్దని స్పష్టత ఇచ్చింది. భాషాపండితులకు త్వరలోనే పదోన్నతులు కల్పించే అవకాశమున్నందున, ఆ ప్రక్రియ ముగిసిన తరువాత మాత్రమే బదిలీలు చేపట్టనున్నట్టు సమాచారం. దీంతో ఇప్పటికే బదిలీ అయిన 250 తెలుగు, 175 హిందీ, 50మంది ఒరియా భాషాపండితులు తిరిగి తమ పాత స్థానాలకు వెళ్లనున్నారు.



ఉత్తర్వుల కోసం ఉపాధ్యాయుల ఆతృత

● **అభ్యంతరాల పరిష్కారం వేగంగా..**

జిల్లాలో ఉపాధ్యాయులకు సకాలంలో కౌన్సెలింగ్ పూర్తయ్యేలా డీఈవో ఆబోతుల ప్రభాకరరావు, పరిశీలకుడు సాయిబాబు నిత్యం కౌన్సెలింగ్ కేంద్రంలోనే ఉంటూ ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు, సంఘాలు లేవనెత్తే అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తున్నారు. అయితే కౌన్సెలింగ్ ప్రక్రియ సాంకేతిక సమస్యలు, సీనియారిటీ జాబితాలు రాకపోవడంతో సకాలంలో జరగడం లేదు. అయితే ఎస్జీటీలు మినహా మిగిలిన అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ ముగియడం వారికి సంబంధించిన ఉత్తర్వులు నెట్‌లో అందుబాటులో ఉంచడంతో కొందరు మంగళవారం వాటిని తీసుకెళ్లారు. బుధవారం నాటికి జాయినింగ్ రిపోర్టులు అందజేయాలని సూచించడంతో ఉరుకులు పరుగులు తీస్తున్నారు.

● **మిగులు ఉపాధ్యాయులు పాత స్థానాల్లోనే..**

బదిలీలకు ముందు పాఠశాలల రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) ప్రక్రియ చేపట్టారు. అనంతరం బదిలీల ప్రక్రియ చేపట్టారు. జిల్లాలో వివిధ కేటగిరీల్లో పెద్ద సంఖ్యలో మిగులు ఉపాధ్యాయులను గుర్తించారు. వీరు ప్రస్తుతం డీఈవో పూల్(మిగులు)లో ఉన్నారు. వీరిని ఇప్పటికే బదిలీల్లో భాగంగా అవసరమున్న పాఠశాలలకు సర్దుబాటు చేశారు. అయినా ఇంకా మిగులు ఉపాధ్యాయులు ఉండడంతో వీరిని పాత స్థానాల్లోకి వెళ్లాలని సూచించారు. ఆయా పాఠశాలల్లో ప్రత్యేక రిజిస్టర్లు నిర్వహించాలని తెలిపారు. ఈ మిగులు ఉపాధ్యాయుల సేవలను ఎలా వినియోగించుకోవాలి....వారికి ఏ విధులు అప్పగించాలనే విషయమై పాఠశాల విద్యాశాఖ ఉన్నత స్థాయిలో ఆదేశాలు ఇచ్చేవరకూ ఎలాంటి విధులు కేటాయించరాదని జిల్లా విద్యాశాఖ నిర్ణయించింది.

రోజంతా సాగిన ఎస్జీటీల కౌన్సెలింగ్

● **800 మందికి పిలుపు..700 మందికి పూర్తి**

శ్రీకాకుళం సిటీ : శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు బదిలీ కౌన్సెలింగ్ మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగింది. మొత్తం 800 మందిని పిలవగా 700 మందికి పూర్తిచేయగలిగారు. మిగిలిన వారికి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. బుధవారం మరో 900మందికి బదిలీలు నిర్వహిస్తామని డీఈవో ఆబోతుల ప్రభాకరరావు తెలిపారు. 2100 నెంబర్‌వరకు ఉన్న ఎస్జీటీలు బదిలీలకు హాజరుకావాలని ఆయన సూచించారు. ఇదిలా ఉండగా ఒకేరోజు పెద్దఎత్తున బదిలీలు చేపట్టడంతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. కౌన్సెలింగ్ కేంద్రం లోపల, వెలుపల ప్రొజెక్టర్లు ఏర్పాటుచేశారు. ప్రతి రోజూ అర్ధరాత్రి వరకు కొనసాగుతుండడంతో ఆ పరిస్థితి నుంచి బయటపడడానికి వంద మందికి కుదించారు.

● **రేపటితో ఎస్జీటీలకు పూర్తయ్యేలా....**

ప్రభుత్వం జూలై 31 నాటికి అన్ని కేటగిరీల్లో బదిలీల ప్రక్రి యను పూర్తిచేసి ఆగస్టు ఒకటో తేదీ కల్లా నూతన పాఠశాలల్లో చేరాలని స్పష్టం చేసింది. అయితే ఈ షెడ్యూల్ ప్రకారం జిల్లాలో బదిలీల ప్రక్రియ పూర్తికాలేదు. జిల్లాలో ఇప్పటికీ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలు మిగిలే ఉన్నాయి. బుధవారం కల్లా పూర్తి చేసి గురువారం నాటికి నూతన పాఠశాలల్లో చేరాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నుంచి ఆదేశాలు ఉన్నాయి. దీంతో జిల్లాలో బదిలీలు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ తరువాత మాత్రమే నూతనస్థానాల్లో ఉపాధ్యాయులు చేరాల్సి ఉంటుంది. దీంతో విద్యాశాఖ యంత్రాంగం ఎలాంటి ఆటంకాలకు తావులే కుండా పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటోంది.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో ప్రభాకరరావు

మొక్కజొన్నకు ప్రాణం పోసిన వర్షాలు

పొందూరు: మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు మొక్కజొన్న పంటకు ఊపిరి పోశాయి. మండల పరిధిలో ఎక్కువమంది రైతులు అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేశారు. అయితే కొన్నిరోజుల వరకు వరుణుడు ముఖం చాటేయడంతో మొక్కజొన్న పంటవేసిన రైతులు ఆందోళన చెందారు. మూడు రోజులుగా వర్షాలు కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


మొక్కజొన్న పంట

కొరవడిన ప్రచారం..

● 'ఎంఆర్ వ్యాక్సిన్' ప్రారంభం ● ప్రజాప్రతినిధులకు అందని సమాచారం ● అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం ● పర్యవేక్షణ నిల్


ఆమదాలవలస, పొందూరు పాఠశాలల్లో చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ఆమదాలవలస/రూరల్: 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు రుబెల్లా, తట్టు వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈమేరకు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. అయితే మండలం, మున్సిపాలిటీ పరిధిలో ఈ కార్యక్రమానికి ప్రచారం కొరవడింది. చిన్నారులకు అందించే ఎంఆర్ వ్యాక్సిన్‌పై ముందుగా తల్లి దండ్రులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉంది. మండలంలో ఇప్పటికీ వాటిపై ప్రచారం చేసిన ఆనవాలు కనిపించడంలేదు. గ్రామాల్లో ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్లు ప్రజాప్రతినిధులకు సమాచరం లేకపోవడంతో వ్యాక్సిన్ సరఫరాపై నీలినీడలు కనిపిస్తున్నాయి. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వైద్య సిబ్బంది ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం అందించిక పోవడంతో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమంపై పలు అనుమానాలకు దారితీస్తోంది.

పొందూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభమయ్యింది. మండలంలో తాడివలస, కింతలి పీహెచ్‌సీల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. కింతలి పీహెచ్‌సీ పరిధిలో 12 పాఠశాలల్లో 15 బృందాలు వ్యాక్సిన్లు వేశాయి. పీహెచ్‌సీ వైద్యులు వి.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మొదలవలస గ్రామంలో సర్పంచ్ ఎం.ధనలక్ష్మి, కింతలిలో సర్పంచ్ డి.గణపతి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాడివలస పీహెచ్‌సీ పరిధిలో పొందూరు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వైద్యాధికారి ఆకాశం రాము ఆధ్వర్యంలో చిన్నారులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం ప్రారంభించారు. తాడివలస పరిధిలో 1,085 మందికి, కింతలి పరిధిలో 1,031 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో...

బూర్జ: రుబెల్లా, తట్టు వ్యాధుల నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఎంఆర్ టీకాలను ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు వేయించాలని ఎంపీపీ బి.సూర్యారావు, జడ్పీటీసీ సభ్యుడు ఎ.రామకృష్ణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్ టీకా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులందరికీ ఈ టీకాలను వేయించాలన్నారు. ప్రతి గ్రామంలోను, పాఠశాలల్లోను అంగన్‌వాడీ కేంద్రాల్లోను టీకా కార్యక్రమం ఏర్పాటు చేస్తారని తెలిపారు. బూర్జ, గుత్తావిల్లి పీహెచ్‌సీల పరిధిలో ఎంఆర్ టీకాలు వేయించినట్టు వైద్యాధికారులు చిరంజీవి, ప్రసన్నకుమార్ భట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

91 శాతం చిన్నారులకు..

సరుబుజ్జిలి: మండలంలోగల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 91శాతం మంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్‌వీ రాజేష్ తెలిపారు. మండలంలోని వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయం, శ్రీవెంకటసాయి విద్యాలయం, సరుబుజ్జిలి జిల్లా పరిషత్ హైస్కూల్, గోనెపాడు జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం నిర్వహించారు. తొలుత సరుబుజ్జిలి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసి వైద్యాధికారి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది నెలల నుంచి పదిహేను సంవత్సరాల మధ్య వయసులో గల పిల్లలందరికీ ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలన్నారు. మంగళవారం 1,251 మందికి వేయాల్సి ఉండగా 1,119 మందికి వేసినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ సిబ్బంది సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పాఠశాలల సిబ్బంది హాజరయ్యారు.


సరుబుజ్జిలి, బూర్జలలో ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

నాట్లు వేయడంలో మెలకువలు ముఖ్యం


రైతులకు సూచనలు చేస్తున్న ఏవో

కొర్లకోట(ఆమదాలవలస రూరల్): ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు వేయడంలో మెలకువలు ముఖ్యమని మండల వ్యావసాయధికారి దుంపల ఉషారాణి అన్నారు. కొర్లకోట గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె రైతులకు వరినాట్లు వేయడంలో మెలకువలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాట్లు వేసే ముందుగా నారు మొక్కల చివర్లలను తృంచి వేయాలన్నారు. దీని వల్ల వరినారులో కాండం తొలిచే పురగుల అవశేషాలను పూర్తిగా నివారించవచ్చునని సూచించారు. దమ్ములో ఎకరానికి 20 కిలోల జింక్‌సల్ఫేట్ వేసుకోవాలని దీనివల్ల జింక్ లోపం సరిదిద్దుకోవచ్చునని తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో ఉచితంగా జింక్ పంపిణీ చేస్తామని తెలిపారు. జింక్ కావాల్సిన రైతులు భూసార పరీక్ష పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకాలతో పాటు ఆధార్ కార్డులను తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో బొడ్డేపల్లి ఝాన్సీరాణి, ఎంపీఈవోలు సాయితేజ, వరప్రసాద్, సత్యసాయి తదితరులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యంలేక ఇబ్బందులు


నరసాపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి..

పొందూరు: మండలం నరసాపురం గ్రామస్థులు గ్రామానికి నడిచి చేరుకొనే పరిస్థితి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేకపోవడం దురదృష్టకరం. రాష్ట్రరహదారికి పక్కనే గ్రామం ఉన్నా గ్రామానికి కనీస రోడ్డు సౌకర్యం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నందివాడ పంచాయతీ నరసాపురం గ్రామస్థులు దశాబ్దాలుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదు. గ్రామానికి ప్రధాన రహదారితో పాటు గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉండడంతో వర్షాకాలంలో గ్రామస్థులు బయటకు వెళ్లలేని దుస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో రహదారులపై దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దేవాంగుల కాలనీలో నీరు నిల్వ

● కాలనీ వాసులకు ఇబ్బందులు


కాలనీలో నిల్వ ఉన్న వర్షం నీరు

పొందూరు: మండలంలోని తోలాపి గ్రామంలో దేవాంగుల కాలనీలో నీరు నిల్వ ఉండిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీ లోతట్టులో ఉండడమే కాలనీ వాసుల ఇబ్బందులకు కారణం. వర్షం పడితే కాలనీ చెరువును తలపిస్తుంది. రోడ్డు మీద నీటితో పాటు, చుట్టు పక్కల నీరు కాలనీలోకి చేరుతోంది. మూడేసి రోజులపాటు కాలనీలో నీరు నిల్వ ఉండిపోతుంది. నిల్వ ఉన్న నీటి వల్ల దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. తమ కాలనీ పరిస్థితి పరిశీలించి సమస్యను పరిష్కరించాల్సిందిగా కాలనీవాసులు కోరుతున్నారు.

పన్ను చెల్లించకుండా తరలిస్తున్న రడీమేడ్ వస్త్రాలు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి రైలు ద్వారా దిగుమతి చేస్తున్న రడీమేడ్ వస్త్రాలు పన్ను చెల్లించకుండా తరలిస్తున్నట్టు గుట్టు బయటపడింది. మంగళవారం సాయంత్రం రైల్లో తెచ్చిన దుస్తులను ఆటోలో తరలిస్తుండగా ఖైనా, గుట్కాలు తరలిపోతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆటోలో వెళ్తున్న సరుకును పరిశీలించగా ఇవి రడీమేడ్ వస్త్రాలనీ ఆటో డ్రైవర్ చెప్పారు. పోలీసులు ఆరా తీయగా.. తమ వద్ద బిల్లులు లేవని చెప్పడంతో ఆటోతోపాటుగా సరుకును స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో పరిశీలించగా ఎటువంటి ట్యాక్స్ చెల్లించకుండా రడీమేడ్ వస్త్రాలు తరలిస్తున్నట్టు బయటపడింది. విషయం తెలుసుకున్న వ్యాపారి పోలీసుస్టేషన్‌కు వచ్చి నఖిలీ బిల్లులు చూపించడం విశేషం. వీటిపై కమర్షియల్ ట్యాక్స్ అధికారులు చర్యలు తీసుకోవల్సి ఉంది.

సంతోషిమాత విగ్రహ ప్రతిష్ఠ ప్రారంభం

పొందూరు: మండలంలోని కింతలి గ్రామంలో నూతనంగా నిర్మించిన జ్ఞానసరస్వతి సహిత కనకమహలక్ష్మి పూర్వక సంతోషిమాత ఆలయ ప్రతిష్టా కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమయ్యింది. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య యజ్ఞం నిర్వహించారు. 4వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టీ పి.నాగభూషణరావు తెలిపారు.

ఊరిస్తున్న వరుణుడు..

● ఎండుతున్న నారుమడులు ● విచార వదనంలో రైతన్నలు

ఆమదాలవలస రూరల్: గత నాలుగు రోజులుగా చుట్టు పక్కల ప్రాంతాల్లో వర్షాలు పడినా.. తమ ప్రాంతంలో వరుణుడు కరుణించడం లేదని ఆమదాలవలస మండల రైతులు లబోదిబోమంటున్నారు. కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో నారుమళ్లు ఎండిపోతున్నాయి. కావడి, ఇంజన్లు, కాలువద్వారా వచ్చిన నీటితో నారుమళ్లను దక్కించుకునేందుకు రైతులు రాత్రి పగలు తేడా లేకుండా ప్రయత్నిస్తున్నారు. మంగళవారం సాయింత్రం కూడా వరుణదేవుడు ఊరించడంతో రైతన్నలు ఉసూరుమంటున్నారు. చేసిదిలేక వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు.




ఎండుతున్న నారుమళ్లను చూపిస్తున్న రైతు


▲ కావిడితో నీరు తెచ్చి.. పొలంలో వెదజల్లుతున్న రైతులు

మురుగు కాలువల పరిశీలన

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల, జరజాం గ్రామాల్లో మురుగు కాలువలను మంగళవారం ఈవోపీఆర్డీ మోహన్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అపరిశుభ్ర వాతావరణం వల్ల దోమలు, ఈగలు విజృంభించే అవకాశం ఉందన్నారు. దీనివల్ల రోగాలు ప్రబలుతాయని తెలిపారు. చెత్తాచెదారం కాలువల్లో వేయరాదన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి తిరుపతిరావు ఉన్నారు.

ప్రతి ఇంటికీ జియోట్యాగింగ్


తంగివానిపేటలో జియోట్యాగింగ్‌ను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ

ఎచ్చెర్ల: గ్రామాల్లో పూరిళ్లతో సహా ప్రతి ఇంటికీ అధికారులు జియో ట్యాగింగ్ చేస్తున్నారు. భూ వివరాలు వెబ్‌ల్యాండ్‌లో ఉన్నట్టుగానే ఇంటి వివరాలన్నింటినీ వీడియోలో బంధిస్తున్నారు. దీనిలో భాగంగా ప్రతి ఇంటి పొడవు, వెడల్పు కొలుస్తున్నారు. షాపులు, హోటళ్ల తదితర వాటిని జియో ట్యాగింగ్‌చేసే పనిలో పంచాయతీ కార్యదర్శులు బిజీబిజీగా ఉన్నారు. అయితే దీనిపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పన్నులు పెంచేందుకే ఇదంతా చేస్తున్నారని వారు భావిస్తున్నారు. ఈ విషయంపై ఈవోపీఆర్డీ మోహన్‌కుమార్‌ని అడగ్గా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈ నెల 15 నాటికి జియో ట్యాగింగ్ పూర్తి చేస్తామని ఆయన చెప్పారు.

పాలిటెక్నిక్ కళాశాలలో రేపు క్యాంపస్ ఇంటర్వ్యూలు

కుశాలపురం(ఎచ్చెర్ల): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టీవీ రాజశేఖర్ తెలిపారు. సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ సిస్టమ్ మరియు సర్వీసెస్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2017లో రిలీవ్ అయిన విద్యార్థులు అర్హులని చెప్పారు. డీసీఎంఈ,డీఈసీఈ, డీఈఈఈ పూర్తి చేసిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

వర్సిటీలో ర్యాగింగ్‌పై యూజీసీకి ఫిర్యాదు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో కొంత మంది సీనియర్ విద్యార్థులు వికృత చేష్టలకు పాల్పడుతున్నారని ఓ అజ్ఞాత వ్యక్తి పేరిట యూజీసీకి ఫిర్యాదు అందింది. కొంతమంది విద్యార్థులు చేపడుతున్న చర్యల వల్ల ఇబ్బంది పడుతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు మఫ్టీలో వర్సిటీలో విద్యార్థుల కార్యకలాపాలపై నిఘా పెట్టారు. ప్రథమ విద్యార్థులను కలిసి విషయాన్ని రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. వంశధార, నాగావళి హాస్టల్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నామని వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చిరంజీవులు తెలిపారు. చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య ఇతర సిబ్బందితో కలిసి హాస్టల్ విద్యార్థులతో సమావేశమయ్యామని...ర్యాగింగ్ పాల్పడడం వల్ల భవిష్యత్ నాశనమవుతుందని హెచ్చరించినట్టు చెప్పారు.

ఆధునిక యంత్రాలతో ప్రయోజనం


వరినాట్లు వేస్తున్న దృశ్యం

కొంగరాం(ఎచ్చెర్ల): యాంత్రీకరణతో సాగు లాభదాయకమని రైతు శిక్షణ కేంద్రం ఏవో పి.రేవతి అన్నారు. మండలం కొంగరాంలో రైతు గోపిన నాగేంద్రకుమార్ వ్యవసాయ క్షేత్రంలో ఆధునిక యంత్రంతో వరి నాట్లు వేసే కార్యక్రమంపై పూడివలస, అంబేద్కర్ నగర్ రైతులకు అవగాహన కల్పించారు. 15 నుంచి 21 రోజుల్లో వరి నాట్లువేయాలన్నారు. కూలీల కొరత వల్ల వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా ఆధునిక యంత్రాలను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో బాడాన ఉషారాణి, ఏఈవో శ్రీ దీప్తి, ఎంపీఈవో జగన్, సీఆర్‌పీలు, సీఏలు పాల్గొన్నారు.

శంకర్ చెరువును పర్యాటక స్థలంగా గుర్తించండి


ఇదే శంకర్ చెరువు

రణస్థలం : మండల కేంద్రానికి అతిసమీపంలో ఉన్న శంకర్ చెరువును పర్యాటక స్థలంగా గుర్తించాలని ఆర్‌సీఎఫ్ ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, సీహెచ్ రమణలు కోరారు. చెరువుకు ఆనుకొని పురాతనమైన శివాలయం ఉందని... నిత్యం అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారని చెప్పారు. అందుకే చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ మేరకు పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియకు లేఖ రాసినట్టు వారు పేర్కొన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్‌తో..

ప్రాణాంతక వ్యాధుల నివారణ

ఎచ్చెర్ల: ఎంఆర్ వ్యాక్సిన్‌తో ప్రాణాంతక వ్యాధులను నివారించొచ్చని ఎంపీపీ బీవీ రమణారెడ్డి అన్నారు. ఎచ్చెర్ల, పొన్నాడ పీహెచ్‌సీల పరిధిలో మంగళవారం నిర్వహించిన ఎంఆర్ వ్యాక్సిన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు విధిగా ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. ఒకే వ్యాక్సిన్‌తో తట్టు, రుబెల్లా అనే రెండు వ్యాధులను నివారించొచ్చని చెప్పారు. అంగన్‌వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో పాటు బయట ఉన్న పిల్లలు కూడా వ్యాక్సిన్ వేసేలా చూడాలని సూచించారు. ఎచ్చెర్ల పీహెచ్‌సీ పరిధిలో 11,146, పొన్నాడ పీహెచ్‌సీ పరిధిలో 7,986 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేసేందుకు గుర్తించినట్టు చెప్పారు. ఈ కారక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, సీహెచ్‌వో లక్ష్మణరావు, పీఆర్ఐ ఏఈ పి.శ్రీవల్లి, సర్పంచ్ మెండ రాజారావు తదితరులు పాల్గొన్నారు. పొన్నాడ పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారి డాక్టర్ సీహెచ్.బాలసుందర్, నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి సత్యనారాయణ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పంచిరెడ్డి కృష్ణారావు, విస్తరణాధికారి వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాతర్లపల్లి (రణస్థలం) : ఎంఆర్ వ్యాక్షిన్ చిన్నారులకు విధిగా వేయించాలని డాక్టర్ కృష్ణచైతన్య అన్నారు. పాతర్లపల్లి, సురంపేట, పాపారావుపేట, కోటపాలెం, అల్లివలస పాఠశాలల్లో చదువుతున్న 1300 చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఒక టీకా రూ.4,500 ఉంటుందని, దీనిని పిల్లలకు ఉచితంగా వేస్తున్నామని స్పష్టం చేశారు. రావాడ, తెప్పలవలస, పీఎస్‌పాలెం సబ్‌సెంటర్ పరిధిలోని 1875మంది చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్లు డాక్టర్ రాకేష్ తెలిపారు.


పొన్నాడలో పర్యవేక్షిస్తున్న ఎంపీపీ

లావేరు : ఎంఆర్ వ్యాక్సిన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎచ్చెర్ల ఏఎంసీ ఛైర్మన్ ఐ.తోటయ్య దొర కోరారు. లావేరు జడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లావేరు మండలంలో 581 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేయనున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.లావణ్య తెలిపారు. ఇతర వివరాలకు ఆయా గ్రామాల్లోని ఏఎన్ఎంలు, ఆశ వర్క్‌ర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులను సంప్రదించాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు.


రణస్థలం: వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది...లావేరు: వ్యాక్సిన్ వేస్తున్న ఏఎంసీ ఛైర్మన్ తోటయ్యదొర

ఈఎస్ఐ ఆసుపత్రి సమస్యలపై 11న చలో కలెక్టరేట్


కార్మిక కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న సీఐటీయూ నేతలు

అరిణాం అక్కివలస(ఎచ్చెర్ల): ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణంతో పాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11 చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, డివిజన్ అధ్యక్షుడు ఎన్‌వీ రమణ తెలిపారు. అరిణాం అక్కివలస పరిధిలోని శ్యాంక్రగ్ పరిశ్రమ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. శ్రీకాకుళం, పైడిభీమవరంలో లోకల్ పే ఆఫీసును ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యాలు కుమ్మక్కై ఈఎస్ఐ

సీఐటీయూ నేతల వెల్లడి

అమలుచేయడం లేదని విమర్శించారు. దీనివల్ల ఎంతోమంది నష్టపోతున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కార్మికులందరికీ ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు ఎం.శ్యామసుందర్, పి.దుర్గాప్రసాద్, కె.శ్రీనివాసరావు, ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనారోగ్యానికి గురైన కార్మికుడు జి.శ్రీనివాస్ కుటుంబానికి రూ.26,260ల ఆర్థిక సాయం అందజేశారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం

ఎచ్చెర్ల: ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాన్ని పాడు చేసుకోవద్దని సీనియర్ సివిల్ జడ్జి శ్యామలాదేవి అన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో ర్యాగింగ్ నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ స్నేహపూర్వక వాతావరణంలో చదువుకోవాలన్నారు. తోటి విద్యార్థులను శారీరకంగా, మానసికంగా హింసించినా ర్యాగింగ్ పరిధిలోకి వస్తుందని తెలిపారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

ర్యాగింగ్ అనేది దుశ్చర్య అని, దీనివల్ల విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడడం, చదువు మధ్యలో మానేయడం తదితర సంఘటనలు గతంలో జరిగినట్టు చెప్పారు. 1997 ఏపీ ర్యాగింగ్ నిరోధక చట్టం రూపొందించారని, హేళనగా మాట్లాడినా, గాయపర్చినా, కిడ్నాప్ చేసినా ఈ చట్టం పరిధిలోకే వస్తుందని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసేలా ముందుకు సాగాలని సూచించారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల జీవితాలు పాడవుతున్నాయన్నారు. ఇందుకు సంబంధించి ఆంధ్రాయూనివర్సిటీలో జరిగిన సంఘటనను ఉదహరించారు. ర్యాగింగ్‌కు పాల్పడడం వల్ల శిక్షలు తీవ్రంగా ఉంటాయన్నారు. శ్రీకాకుళం డీఎస్పీ కె.భార్గవరావునాయుడు మాట్లాడుతూ ఇదే క్యాంపస్‌లోనే తాను కూడా పీజీ చదివానన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడి కెరీర్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.తులసీరావు మాట్లాడుతూ వర్సిటీలో ర్యాగింగ్ నిరోధానానికి వివిధ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చిరంజీవులు మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడినట్టు రుజువైతే తీసుకోబోయే చర్యలను వివరించారు. చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య మాట్లాడుతూ సాధారణంగా హాస్టల్స్‌లో ర్యాగింగ్ జరిగే అవకాశముందని, దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాగింగ్‌కు పాల్పడమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో జేఆర్ పురం సీఐ వై.రామకృష్ణ, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ టి.కామరాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ పి.సుజాత, బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


హాజరైన బోధనా సిబ్బంది, విద్యార్థులు

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

ఉర్లాం (నరసన్నపేట): ఉర్లాం జిల్లా ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉప్పాడ వాసుదేవరావు, శివరామ కృష్ణ, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, రమణ, సత్యవతి, రమేష్, రామ్మోహన్‌రావు, ఎల్.రవిలను ప్రధానోపాధ్యాయులు చెంచల వైకుంఠరావు ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఉర్లాం పాఠశాలలో అందించే విధంగా బదిలీపై వెళ్లిన పాఠశాలలో సేవలను అందించి మంచిపేరు తెచ్చుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించండి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కోమర్తి పంచాయతీ లకిమేర గ్రామంలో మంగవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రతి కుటుంబం ఒక్కొక్క మొక్కను నాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శిమ్మ పార్వతి, మండల ప్రత్యేకాధికారి కిషోర్, మండల ప్రత్యేక ఆహ్వానితులు శిమ్మ పాపినాయుడు, సర్పంచ్ శిమ్మ జగన్నాథం, ఎంపీటీసీ సభ్యులు కింజరాపు సూర్యనారాయణ, జామి వెంకట్రావు, పీస కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో:

పట్టణంలోగల నారాయణ పాఠశాల విద్యార్థులు ఆధ్వర్యంలో చేపట్టే మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ప్రతీ విద్యార్థి ఒక్కొక్క మొక్కను దత్తతగా తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణంలో నిర్వహించే ర్యాలీలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు చింతు శకుంతల, సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, నారాయణ పాఠశాల ఏజీఎం రమేష్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు

నరసన్నపేట: మేజర్ పంచాయతీలో ఈఏడాది సుమారు రూ.4 కోట్లతో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని సర్పంచ్ గొద్దు చిట్టిబాబు అన్నా రు. మారుతీనగర్‌లో సీసీ రోడ్డు పనులను ఆయన మంగళవారం ప్రారంభిం చారు. మేజర్ పంచాయతీలో 14 ఆర్థిక సంఘ నిధులతో పాటు, ఎమ్మెల్యే మంజూరు చేసిన ఎస్‌డీఎఫ్ నిధులతో ప్రతి ప్రాంతానికి సీసీ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రఘుపాత్రుని శ్రీధర్, ఎంపీటీసీ సభ్యుడు కింజరాపు చిన్నవాడు తదితరులు పాల్గొన్నారు.


మారుతీనగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ చిట్టిబాబు

వైభవంగా అమ్మతల్లి ప్రతిష్ఠోత్సవం

జమ్ము (నరసన్నపేట): జమ్ము గ్రామ దేవత ప్రతిష్ఠోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సత్యవరం రుత్వికులు నవమాలి బుచ్చి రామయ్య వజ్జులు, గ్రామపురోహితుడు మావుడూరు జగదీష్‌బాబు ఆధ్వర్యంలో గ్రామ దేవత ప్రతిష్ఠోత్సవం జరిపించారు. అమ్మతల్లి ఉత్సవమూర్తి ఊరేగింపులో 1001 మంది మహిళలు ముర్రాట్లతో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వానగోవిందరాజులు, సర్పంచ్ రెడ్డి సంధ్య తదితరులు పాల్గొన్నారు.


ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

పింఛన్‌దారుల అవస్థలు

జలుమూరు: నగరికటకం పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంతో పింఛన్‌దారులు అవస్థలకు గురయ్యారు. పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం పింఛన్లు పంపిణీ చేస్తామన్న సమాచారంతో నగిరికటకం గ్రామానికి చెందిన పింఛన్‌దారులు ఉదయం 9 గంటలకే కార్యాలయానికి చేరుకున్నారు. 9 గంటలకు రావాల్సిన పంచాయతీ కార్యదర్శి 12 గంటలకు వచ్చారు. కొత్త సాఫ్ట్‌వేర్ డౌన్‌లోడ్ చేయాలి.. పాత పద్ధతిలో పింఛన్ల పంపిణీ జరగదని పంచాయతీ కార్యదర్శి చెప్పడంతో అంతవరకు నిరీక్షించిన పింఛన్‌వారులు అవాక్కయ్యారు. ఇంతలో శ్రీముఖలింగం ఉత్సవాలు పర్యవేక్షించుకుని వస్తున్న ఈవోపీఆర్డీ ఈ తంతును చూసి వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేయాలని సూచించడంతో మధ్యాహ్నం 2 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించారు.

ముఖం చాటేసిన వర్షాలు

- ఎండుతున్న నారు మళ్లు
- కన్నీరు పెడుతున్న రైతులు


సారవకోటలో ఎండుతున్న వరి నారు మడులు

సారవకోట/జలుమూరు: వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో వరి నారు మళ్లు, ఎద పొలాలు ఎండి నాశనమవుతున్నాయి. ప్రతి రోజూ చిరు జల్లులే కురుస్తున్నాయి.. కాని వరి నారు బతకడానికి అవసరమైన వర్షాలు కురవడంలేదు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉంటాయనుకున్న అన్నదాతలకు నిరాశే మిగిలింది. చెరువుల్లో నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. పల్లం ప్రాంతాల్లో నీరు ఉన్న చోట వరి నాట్లు వేసి వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. సారవకోట మండలంలో ఒక వైపు వంశధార కాలువ ప్రవహిస్తుండడంతో రైతులు ఆనందంగా ఉన్నారు. మరో మైపు వర్షాధారం పైనే ఆధారపడి వరి పంటను పండిస్తున్న రైతులు వర్షాలు అనుకూలంగా లేకపోవడంతో విచార వదనాలతో చూస్తున్నారు. జలుమూరు మండలంలో 21 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇందులో 80 శాతం వరిఎదలు వేయగా, వంశధారనది తీరప్రాంతాల్లో 20 శాతం వరినారు వేశారు. వరిఎదల్లో కలు పు నివారణకు మదుపులు పెట్టిన తరువాత వర్షాలు లేక పొలాలు ఎండిపోతున్నారు. నేటివరకు చెరువుల్లో నీరు చేరక పోవడం వల్ల వర్షాధార ప్రాంతాలైన సుబ్రమణ్యపురం, జోనంకి, దరివాడ, తలతరియా, రావిపాడు, ఏనేటికొత్తూరు, యలమంచిలి తదితర గ్రామాలకు చెందిన వరిఎదలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతుకు మిగిలేది కాయకష్టమే..



వరిఎదలకు మొక్క స్థాయిలోనే ఎండదెబ్బ తగిలితే దిగుబడులు తగ్గుపోతాయి. రైతులకు మిగిలేది కాయకష్టమే.

- పట్ట నూకయ్య, జలుమూరు

ఏటా ఇదేతంతు



వర్షాభావ పరిస్థితులు వల్ల రైతులు ప్రతిఏటా నీటి సమస్యను ఎదుర్కోవాల్సి వస్తోంది. సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు ముందుకు రావాలి.

- కొండా కేశవరావు, జలుమూరు

కరుణించని వరుణుడు



ఈ ఏడాది మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు మదిని కలిచి వేస్తున్నాయి. వరుణుడు కరుణించడంలేదు. దీంతో ఖరీఫ్ పంట నిరాశ కలిగిస్తోంది.

- ముంజి సోమేశ్వరరావు, సారవకోట

పిల్లలకు రక్షణ కవచంగా ఎంఆర్ వాక్సిన్

- ఎమ్మెల్యే బగ్గు
- లాంఛనంగా కార్యక్రమం ప్రారంభం



నరసన్నపేటలో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, సారవకోటలలో చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

మాకివలస (నరసన్నపేట): పిల్లలకు రక్షణ కవచంగా ఎంఆర్ వాక్సిన్ ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మాకివలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎంఆర్ వాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ఆయన మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. చిన్నారులకు రూబెల్లా, తట్టు తదితర వ్యాధుల నుంచి పూర్తిగా రక్షణ కల్పించేందుకు ఎంఆర్ వ్యాక్సిన్ దోహదపడుతుందన్నారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శిమ్మ పార్వతి, శిమ్మ పాపినాయుడు, సర్పంచ్ యాళ్ల వేణుగోపాలరావు, వైద్యులు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సారవకోట: స్థానిక కేజీబీవీలో చిన్నారులకు మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమాన్ని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వరుదు రాఘవేంద్ర మంగళవారం ప్రారంభించారు. మండలంలో 18 బృందాలు వ్యాక్సిన్ వేసే కార్యక్రమంలో పాల్గొన్నాయని వైద్యాధికారి తాడేల శ్రీకాంత్ తెలిపారు. మండలంలో 9,071మందికి ఈ వ్యాక్సిన్ వేయించాలనే లక్ష్యంగా నిర్ణయించామని చెప్పారు. కార్యక్రమంలో సూపరువైజర్లు రామకృష్ణ, లలితాంబ, ప్రత్యేకాధికారి అరుణనాయుడు, పీహెచ్‌ఎన్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


జలుమూరు చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

జలుమూరు: ఒకే టీకాతో తట్టు, రుబెల్లా వ్యాధులు నివారించుకోవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వైద్యభూషణ మురళీమోహనరావు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో మీజల్స్ రుబెల్లా టీకాలు వేసే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. జలుమూరు వైద్యాధికారి ఆర్.నిహారిక మాట్లాడుతూ స్థానిక పాఠశాలల్లో మంగళవారం 564 మందికి ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కైలాసరావు, ఆరోగ్య విస్తరణాధికారి చిన్నరాజులు, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావు, ఉపాధ్యాయులు వేణుగోపాలరావు, పలువురు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని పోలాకి, గుప్పెడుపేట, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మంగళవారం చిన్నారులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం ప్రారంభమయ్యింది. తొలుత వైద్యాధికారి శిమ్మ ఇందు సింహ పోలాకి విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో 400 మంది విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మెట్ట జనార్దనరావు, ప్రధానోపాధ్యాయుడు చంద్రరావు, మురళీకృష్ణ రమేష్ పాల్గొన్నారు. అలాగే గుప్పెడుపేట ఆరోగ్య కేంద్ర పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యాధికారి బలగ మురళి, విస్తరణాధికారి నల్లి రవికుమార్ పర్యవేక్షణలో వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో నారాయణమ్మ, ధనలక్ష్మి, ఇందిర కమల, చిన్నవాడు తదతరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సాగులో ఆధునిక పద్ధతులు పాటించండి

'పొలం పిలుస్తోంది'లో రైతులకు వ్యావసాయాధికారుల సూచనలు

రహిమాన్‌పురం(పోలాకి): గ్రామీణ ప్రాంత రైతులు వ్యవసాయ సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటరావు సూచించారు. రహిమాన్‌పురం పంచాయతీ కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ సాగుకోసం ఉడుపు యంత్రాన్ని అద్దెకు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పూజారి సోమేశ్వరరావు, డీలర్ వెంకటేశ్వరరావు, ఆదర్శ రైతులు, విస్తరణాధికారులు రమేష్, రాజేష్, రమ పాల్గొన్నారు.

జలుమూరు: వరిఎదల్లో కలుపు నివారణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి డి.విజయభాస్కరరావు తెలిపారు. మండలం యలమంచిలి, కొండపోలవలస గ్రామాల్లో మంగళవారం నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కలుపు నివారణలో ఏమాత్రం అజాగ్రత్త వహించిన పంట దిగుబడులు తగ్గుతాయని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం పాగోటి రాజశేఖర్, ఎంపీఈవో చైతన్య, రైతులు పాల్గొన్నారు.



పోలాకి, జలుమూరులలో రైతులకు సూచనలిస్తున్న ఏవోలు

గ్యాస్ సమాచారం

నరసన్నపేట: స్థానిక హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు గతనెల 31న బుక్‌చేసిన వారికి, గతనెల 30న బుక్ చేసిన ఇండియన్ గ్యాస్ వినియోగదారులకు బుధవారం గ్యాస్ పంపిణీ చేయనున్నారు.

నరసన్నపేటలో సినిమాలు

శ్రీదేవి	రారండోయ్ వేడుక చూద్దాం
రాజేశ్వరి	ఫిదా
శ్రీవెంకటేశ్వర	గౌతమ్‌నంద

బీపీఎంపై చర్యలు తీసుకోండి

పాలకొండ రూరల్: పోస్టాఫీసుకు వచ్చే వారిపై బ్రాంచి పోస్టుమాస్టర్ చంద్రశేఖర్ దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని దళిత ప్రజాదరణ సంక్షేమ సంఘం నాయకులు సబ్బ నాని, యామక ఈశ్వరరావు కోరారు. ఈమేరకు మంగళవారం పార్వతీపురం డివిజన్ పోస్టుమాస్టర్ సత్యనారాయణకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రేగిడిలో పోస్టల్ ఈడీఎంసీగా పనిచేస్తున్న పెంట సీతారాంను కులంపేరుతో దూషించడంతోపాటు ఇతరులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

భూసార పరిరక్షణకు జింకు సల్ఫేట్ అవసరం

కత్తుల కవిటి (వీరఘట్టం): భూసార పరిరక్షణకు జింకు సల్ఫేట్ వినియోగించాల్సిన అవసరం ఉందని వ్యవసాయాధికారి ఎం.అశోక్ అన్నారు. మంగళవారం కత్తుల కవిటిలో 'పొలంపిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయన ఎరువులు అధికంగా వినియోగించడంతో భూసారం తగ్గిపోతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని సేంద్రియ ఎరువులను ఉపయోగించాల న్నారు. అనంతరం పొలంలో జింకు సల్ఫేట్‌తో పాటు తెగుళ్ల నివారణకు ప్రయోగాత్మకంగా సుడో మోనస్ స్ప్రే చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రౌతు దామోదరరావ పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

పాలకొండ రూరల్: వసతిగృహాల్లోని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని బీసీ సంక్షేమాధికారి బి.ప్రకాశరావు అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో డివిజన్‌లోని బీసీ సంక్షేమ వసతిగృహాల అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా బయోమెట్రిక్ తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కాచి వడబోసిన నీటిని అందించాలన్నారు. రాత్రి సమయాల్లో విద్యార్థులు బయటకు రాకుండా చూసుకోవాలన్నారు.

పట్టణంలో పచ్చదనానికి కృషి

పాలకొండ రూరల్: పాలకొండ పట్టణం పచ్చదనంగా ఉండేందుకు మొక్కలు నాటి పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని నగరపంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, అభివృద్ధి కమిటీ సమన్వయకర్త పల్లా కొండలరావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో ఎస్‌వీడీ కల్యాణమండపం నుంచి ఏలాం కూడలి వరకు 'వనం-మనం' కార్య క్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. బోరు ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏఈ సురేష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, కౌన్సిలర్ అంపోలు శ్రీనివాసరావు, సుంకరి అనిల్‌దత్, అడపా బాబ్జీ, రామారావు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న నాయకులు, అధికారులు


మూసివేత దిశలో సూపర్ బజార్

- నిర్వహణ వ్యయమే అధికం
- అధిక ధరలతో కొనుగోలు శూన్యం

గిరిజన ఉత్పత్తులను తక్కువ ధరలకు విక్రయించడం ద్వారా కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు ఉద్దేశించి జీసీసీ ఆధ్వర్యంలో సూపర్ బజార్‌ను ఏర్పాటు చేశారు. లక్షలాది వ్యయంతో ఏర్పాటు చేసిన దీని నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోజురోజుకూ విక్రయాలు దిగజారుతున్నాయి.. ఒకప్పుడు రోజుకు రూ.10 వేల వరకు జరిగిన విక్రయాలు నేడు రూ.100 కూడా సాగని దుస్థితి ఏర్పడింది.. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే కొనుగోలు దారులకు సూపర్ బజార్ సేవలు దూరమవుతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం...

సీతంపేట: సీతంపేటలో నిత్యావసరాల వస్తువుల విక్రయానికి గాను 2010 అక్టోబర్‌లో జీసీసీ ఆధ్వర్యంలో సూపర్ బజార్‌ను ఏర్పాటు చేశారు. రూ.17 లక్షల వ్యయంతో దీనిని జిల్లాలో ప్రప్రథమంగా ఇక్కడ ఏర్పాటు చేశారు. వివిధ రకాల అటవీ ఉత్పత్తులతో పాటు ఇతర నిత్యావసర సరుకులు గిరిజనులకు అందుబాటు ధరల్లో ఉంచాలన్న లక్ష్యంతో దీనిని ప్రారంభించగా మొదటిలో బాగానే నడిచిన సూపర్‌బజార్ ఆ తరువాత అ. దికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మూసివేసే స్థాయికి చేరకుంది.. బహిరంగ మార్కెట్‌లో కన్నా ఇక్కడి ధరలు ఎక్కువగా ఉండడం, సిబ్బందిలో సమన్వయ లోపం, సరుకులు అందుబాటులో ఉంచకపోవడం వంటి సమస్యలలో వినియోగదారులు లేక సూపర్‌బజార్ దీనావస్థకు చేరుకుంది. దీని నిర్వహణకు వేలాది రూపాయలు ఖర్చవుతున్నా ఆ స్థాయిలో కూడా అమ్మకాలు సాగడం లేదు.. దీంతో సూపర్‌బజార్‌లో సరుకులు నిండుకోగా, స్టాండ్లు ఖాళీగా కనిపిస్తు న్నాయి.





వస్తువులు లేక ఖాళీగా ఉన్న స్టాండ్లు (ఇన్‌సెట్‌లో) సీతంపేటలోని సూపర్‌బజార్

జీసీసీలో ప్రసిద్ధి చెందిన తేనె, కరక్కాయ పౌడర్, కుంకుడు కాయలు, సీకాకాయపౌడర్, కొండ చీపుర్లు, హెర్బల్ సబ్బు లు తదితర ఉత్పత్తులకు డిమాండ్ ఉన్నప్పటికీ వీటిని ఒక్కడ అందుబాటులో ఉంచ కపోవడంతో వినియోగదారులు నిరాశతో వెనుదిరిగే పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో సీతంపేట వచ్చే ఇతర ప్రాంతాల వారు ఇక్కడికి వచ్చి వస్తు వులను కొనుగోలు చేసుకునే వారు. అయితే ప్రస్తుతం అటువంటి పరిస్థితి కానరావడం లేదు. అందరికీ అవసరమైన సరుకులు అందుబాటులో ఉంచి మరలా పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రతి ఉద్యోగి కొనుగోలు చేసేలా చర్యలు



సూపర్‌బజార్‌లో సరుకులను ఉంచేందుకు చర్యలు తీసు కుంటున్నాం. జీసీసీలో పనిచేసే ప్రతి ఉద్యోగి ఇక్కడ నెలలో రూ. 1000 వరకు సరుకులు కొనుగోలు చేయాల్సిందే. అలాగే మొబైల్ వ్యాన్ ద్వారా సంతల్లో విక్రయించనున్నాం. దీని ద్వారా సూపర్‌బజార్‌కు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

-పి.లిల్లీ పుష్పనాథం, జీసీసీ మేనేజర్

అవసరమైన వస్తువులు దొరకడం లేదు



సూపర్‌బజార్‌లో అవసరమైన వస్తువులు దొరకడం లేదు. అన్ని రకాల వస్తువులను అందుబాటులో ఉంచాలి. మార్కెట్ ధరల కంటే ఇక్కడ ధరలు తక్కువగా ఉంటే ఎక్కువ మంది కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తారు. ఆ దిశగా ఐటీడీఏ అధికారులు చర్యలు చేపట్టాలి.

-పి.సాంబయ్య, గిరిజన సంఘ నాయకుడు

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం





మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో, ఎంఆర్ వ్యాక్సిన్ వేయిస్తున్న పీవో శివశంకర్

సీతంపేట: గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా అనేక చర్యలు చేపడుతున్నామని ఐటీడీఏ పీవో ఎల్.శివశంకర్ అన్నారు. మల్లి గురుకుల పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ఆదివాసీ గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు 'యూ నెట్' అనే సంస్థకు బాధ్యతలు అప్పగించినట్టు చెప్పారు. ఆశ్రమాలు, గురుకులాల్లోని విద్యార్థులపై ఈ సంస్థ ప్రత్యేక శ్రద్ధ వహి స్తుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖతో సంబంధం లేకుండా ఈ సంస్థ బాధ్యతలను నెరవేరుస్తుందని చెప్పారు. వచ్చే నెల ఒకటి నుంచి ఈ ఆదివాసీ ఆరోగ్య కార్యక్రమం అమలులోకి వస్తుందన్నారు. విద్యార్థులకు సంబంధించి పూర్తి ఆరోగ్య సమాచారం ట్యాబ్‌లలో నమోదు చేస్తారన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులకు ఎటువంటి అనారోగ్యం చేసినా గతంలో ఆ విద్యార్థి పూర్తి డేటా పరిశీలించి చికిత్సలు అందజేయడం జరుగుతుందన్నారు. ఏఎన్ఎంలకు ట్యాబ్‌లను అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఎంఆర్ వ్యాక్సిన్‌వేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పి.రాజబాబు, ఎంపీపీ సవర లక్ష్మి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సవరతోట మొఖలింగం, ప్రజాప్రతి నిధులు బిడ్డిక దమయంతినాయుడు, బి.జయలక్ష్మి, జి.పగడాలు, మలేరియా నివారణా ధికారి అరుణ్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఈఎన్‌వీ నరేష్‌కుమార్, మలేరియా నివారణా విభాగం కన్సల్టెంట్ శ్రీకాంత్, డీడీ ఎం.రోజారాణి, యూనెట్ సంస్థ ప్రతినిధి ఎ.అలెగ్జాండర్, డిప్యూటీ డీఈవో జి.రామ్మోహన్ రావు, వైద్యాధికారి గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

భామిని: ఒకే టీకాతో రెండు వ్యాధులను నివారించవచ్చని ఎంపీపీ భూపతి ఉషారాణి కోరారు. మంగళవారం ఆదర్శ పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. భామినిలో ఆదర్శ, కస్తూర్బా పాఠశాలల్లో టీకాలను వేశారు. కార్యక్ర మంలో ఎంపీడీవో నిమ్మల మాస, సర్పంచ్ పొట్నూరు దేవి, ప్రిన్సిపాల్ మంజు బహుదూర్, హెచ్‌వో శ్రీదేవి సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలో మంగళవారం ప్రారంభించిన ఎంఆర్ వ్యాక్సిన్ ప్రక్రియ విజయవంతమైంది. వీరఘట్టం పీహెచ్‌సీ పరిధిలోని 18 పాఠశాలల్లో 1,475 మంది పిల్లలకు గాను 1286 మందికి, బిటివాడ పీహెచ్‌సీ పరిధిలో 11 పాఠశాలల్లో 837 మంది విద్యార్థులకు గాను 747 మందికి వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఆర్.సూర్యకుమారి, ఎస్.ఎస్.వర్మ తదితరులు పాల్గొన్నారు.



భామిని: టీకాలు వేస్తున్న సిబ్బంది

రోగులకు మెరుగైన వైద్యసేవలందించండి

- ఐటీడీఏ పీవో శివశంకర్
- ఎం.సింగుపురం పీహెచ్‌సీ సందర్శన



రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీస్తున్న పీవో

ఎం.సింగుపురం (పాలకొండ టౌన్): ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఐటీడీఏ పీవో ఎల్.శివశంకర్ ఆదేశించారు. మంగళవారం ఎం.సింగుపురం పీహెచ్‌సీని సందర్శించారు. మైదాన ప్రాంతాలతో పాటు ఏజెన్సీలోని గిరిజనులు ఈపీహెచ్‌సీకి వస్తుంటారని, వారికి అవసరమైన అన్ని రకాల వైద్యసేవలు అందించాలన్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు ఎం.సింగుపురానికి చెందిన పక్కి సీతమ్మ గిరిజన దర్బార్‌లో ఫిర్యాదు చేసిన లచ్చరాయుని చెరువుపై ఆరా తీశారు.

ఎస్టీల అధీనంలో ఉన్న చెరువు వారు కొన్నాళ్లుగా వలస వెళ్లడంతో అదే గ్రామానికి చెందిన రజక కులస్థులు ఆ చెరువులో చేపలు పెంపకం చేపడుతూ జీవనాధారం సాగిస్తు న్నామని చెప్పడంతో పీవో ఇరువర్గాలతో చర్చించారు. ఇరువర్గాలను సోమవారం సీతంపేటలో నిర్వహించే గిరిజన దర్బార్‌కు హాజరు కావాలని సూచించారు. ఆయనతోపాటు ఎంపీడీవో తిరు పతి రావు, తహసీల్దార్ జి.మంగు, మత్స్యశాఖ అధికారి గంగాధర్, ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

పాలకొండ

శ్రీరామ కళామందిర్: గౌతమ్ నంద

వెంకటగౌరి: ఫిదా

వీరఘట్టం

బీఎంఆర్ థియేటర్: గౌతమ్ నంద

హిరమండలం పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా శ్రీకృష్ణ



హిరమండలం: తెలుగుదేశం పార్టీ హిరమండలం పట్టణ శాఖ అధ్యక్షుడిగా లాడె శ్రీకృష్ణను నియమిస్తూ పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గేదెల జగన్మోహనరావు చెప్పారు. ఐవీఆర్ఎస్ ద్వారా కార్యకర్తల అభిప్రాయం సేకరించి ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా మీసాల షణ్ముఖరావును నియమించనట్లు తెలిపారు.

'ఆధునిక వ్యవసాయమే ఉత్తమం'



కొసమాళలో ఆధునిక వ్యవసాయంపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

కొసమాళ(మెళియాపుట్టి): ఆధునిక వ్యవసాయం మంచిదని వ్యవసాయాధికారి వై.విద్య అన్నారు. మంగళవారం ఆమె కొసమాళ, వసుంధర, రట్టిణిల్లో పొలం పిలుస్తోంది నిర్వహించి మాట్లాడారు. ఆధునిక వ్యవసాయంతో లాభాలు అధికంగా వస్తున్నాయని, దీన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. యదలు వేసుకుంటే ప్రయోజనకరమన్నారు. ఈమె వెంట ఏఈవో ప్రభావతి, తదితరులు ఉన్నారు.

'సేంద్రియంతో అధిక దిగుబడులు'



శ్రీవరి సాగుపై సూచనలు ఇస్తున్న ఏవో గాయత్రి

హిరమండలం: సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి గాయత్రి చెప్పారు. మంగళవారం ఆమె గులుమూరు, దెప్పిగూడల్లో పొలం పిలుస్తోంది నిర్వహించి మాట్లాడారు. దెప్పిగూడలో తోట సుందరరావు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా ఎకరా పొలంలో బాస్మతి సాగు చేస్తున్నాడని అన్నారు. తమ సూచనలమేరకు సేంద్రియ విధానంలో సాగు చేస్తూ ఆదర్శంగా నిలిచాడని తెలిపారు.

ఘనంగా లక్ష్మీదుర్గ ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న భక్తులు

కొత్తూరు: స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లోని లక్ష్మీదుర్గ ఆలయ 13వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త టంకాల మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

కాలువలను పరిశుభ్రంగా ఉంచాలి


పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం

వసుంధర(మెళియాపుట్టి): పంచాయతీలో ప్రతి కాలువ పరిశుభ్రంగా ఉంచాలని ఈవోపీఆర్‌డీ ప్రసాద్‌పండా అన్నారు. మంగళవారం ఆయన వసుంధర పంచాయతీలో పరిశుభ్రతా కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఇంటికీ జియోట్యాగింగ్ చేస్తున్నామని, దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. వర్షాలు పడుతున్నందున ఏరోజు చెత్త ఆరోజే డంపింగ్ యార్డులకు తరలించాలని చెప్పారు. పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యకరంగా ప్రజలు ఉంటారని తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి రాజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

'ప్రతి పిల్లవాడికి టీకా వేయించాలి'


మెళియాపుట్టి: విద్యార్థికి టీకా వేస్తున్న దృశ్యం


కొత్తూరు: వ్యాక్సిన్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


హిరమండలం: టీకా వేస్తున్న చిట్టిబాబు

మెళియాపుట్టి: ప్రతి పిల్లవాడికి రోటా వైరస్ టీకా వేయిస్తే మంచిదని స్థానిక వైద్యాధికారి శివకుమార్ అన్నారు. మంగళవారం ఆయన నలంద పబ్లిక్ స్కూల్, స్థానిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బసవ భాస్కరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లలకు మంచి అవకాశాన్ని ఇచ్చిందని, దీన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అనపాన రాజశేఖరరెడ్డి, ఉపాధ్యాయుడు ప్రతాప్‌నందా, సర్పంచ్ టి.భారతిగోపి, వైద్య సిబ్బంది రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధానికి ఎంఆర్ వ్యాక్సిన్

కొత్తూరు: పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకే ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్నట్లు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పొత్రకొండ మోహన్‌రావు చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్ వేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ టీకాతో రుబెల్లా, తట్టు వ్యాధులు దూరమవుతాయని చెప్పారు. ఒకే టీకాతో రెండు వ్యాధులు నయం అవుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎ.భైరాగినాయుడు, వైద్యులు కృష్ణమోహన్, జానకిరామయ్య, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఒకే టీకాతో రెండు వ్యాధులు దూరం'

హిరమండలం: ఒకే టీకాతో రెండు వ్యాధులను దూరం చేసేందుకు మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్‌ను 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పనిసరిగా వేయించాలని మండల ప్రత్యేక ఆహ్వానితుడు గవర చిట్టిబాబు అన్నారు. హిరమండలం, చొర్లంగి పీహెచ్‌సీల్లో ఎంఆర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రాణాంతక వ్యాధుల నుంచి పిల్లలను ఈ టీకా కాపాడుతుందని చెప్పారు. వైద్యాధికారులు పవన్, రాజేష్‌ప్రధాన్ మాట్లాడుతూ హిరమండలం పీహెచ్‌సీ పరిధిలో 8464 మంది పిల్లలకు టీకాలు వేయడానికి 14 వైద్య బృందాలను, చొర్లంగి పీహెచ్‌సీ పరిధిలో 4228 మంది పిల్లలకు టీకాలు వేసేందుకు 6 బృందాలను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.కాశీవిశ్వనాథరావు, నార్యాణరావు, నూకం నాయుడు, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకూ పంట రుణాలు

● లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావు



ప్రసంగిస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావు

పాతపట్నం: అర్హులైన కౌలు రైతులందరికీ పంట రుణాలివ్వాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడారు. నిబంధనల మేరకు భూమిపై భూయజమాని రుణం తీసుకో కుంటే రుణార్హత కార్డులున్న కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని చెప్పారు. జిల్లాలో రూ.1580 కోట్లు పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకూ రూ.900 కోట్లు మాత్రమే ఇవ్వగలిగినట్లు తెలిపారు. సెప్టెంబర్ నెలాఖరులోగా ఖరీఫ్ పంట రుణాలు ఇవ్వాల్సిఉందన్నారు. ఈ నెల 21తో ఫసల్ బీమా యోజనకు గడువు ముగియనున్నందున రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రతి బ్యాంక్ పరిధిలో కనీసం 25 మందికి కొత్తగా పంట రుణాలివ్వాలని ఆదేశించారు. ఈ విషయమై ఆయన అధికారులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.చిన్నమ్ముడు, భారతీయ స్టేట్ బ్యాంక్ పాతపట్నం శాఖ మేనేజర్ డి.వి.డి.ప్రసాద్, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లోని అన్ని బ్యాంక్‌ల అధికారులు పాల్గొన్నారు.

'అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు'


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీ విజయకుమార్

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ ధరలకే ఎరువులు విక్రయించాలని వ్యవసాయ శాఖ కొత్తూరు డివిజన్ ఏడీ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక శ్రీ వేణుగోపాల ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు ఎరువులు విక్రయించే దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. వంశధార నిర్వాసిత గ్రామాల రైతులకు ఎరువులు అమ్మకూడదన్నారు. డిసెంబర్ నెలఖారుకి ప్రాజెక్టులో నీటిని పంపించి వచ్చే ఖరీఫ్‌కు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హిరమండలం మండలంలో 13, కొత్తూరు మండలంలో 6, ఎల్.ఎన్.పేట మండలంలో ఒకే గ్రామంలో నిర్వాసితులున్నారని చెప్పారు. ఎవరైనా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే 8886614012, 8886612690 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయాధికారి బొడ్డేపల్లి పద్మనాభం ఉన్నారు.

నేడు నిర్వాసితుల సంఘ సమావేశం

హిరమండలం: వంశధార నిర్వాసితుల విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు బుధవారం ఉదయం 9 గంటలకు తలగాం రహదారి జంక్షన్‌లో నిర్వాసితుల సంఘ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘ నాయకుడు పి.రాంప్రసాద్ చెప్పారు. నిర్వాసితులంతా తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

'శిరస్త్రాణం లేదంటే జరిమానా'

పాతపట్నం: శిరస్త్రాణం ధరించకపోతే జరిమానా తప్పదని ఎస్ఐ ఎం.హరికృష్ణ చెప్పారు. మంగళవారం ఆయన స్థానిక బస్‌స్టాండ్‌కు చేరువలో వాహన తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. హెల్మెట్ ధరించాల్సిన ఆవస్యకతను వివరించారు. రవాణా శాఖ ఆదేశాల మేరకు గతంలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించామన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆదేశించడంతో నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నామని తెలిపారు. హెల్మెట్ ధరించకపోతే జరిమానా తప్పదని స్పష్టం చేశారు.


ద్విచక్రవాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ హరికృష్ణ

పాతపట్నంలో సినిమాలు

ఉమామహల్: గౌతమ్‌నంద

హిరమండలంలో..

వరలక్ష్మి : గౌతమ్‌నంద

కొత్తూరులో..

గౌరీశంకర : ఫిదా
ఉమాశంకర: గౌతమ్‌నంద

'మద్యం దుకాణం వల్ల ఇబ్బంది లేదు'

బొద్దాం(రాజాంరూరల్): బొద్దాం, కొరారిపురం మధ్యలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వల్ల విద్యార్థులకు, ప్రజలకు ఎంటువంటి ఇబ్బంది లేదని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం బొద్దాంలో మద్యం దుకాణాన్ని పరిశీలించారు. మద్యం దుకాణం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించేందుకు వచ్చినట్లు చెప్పారు. షాపు ఏర్పాటుతో విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు దుకాణ నిర్వాహకులు కంచె ఏర్పాటు చేసినట్లు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పేర్కొన్నారు. నివేదికను కలెక్టర్‌కు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం రాజాంలో పలు మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రోడ్డే డంపింగ్‌యార్డు..



చీపురుపల్లి మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న చెత్త

రాజాంఅర్బన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో సేకరించిన చెత్తా చెదారాలను రోడ్డు పక్కనే వేసేస్తున్నారు. ఇక్కడి నుంచి డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉండగా రోజుల తరబడి ఇలా వదిలేస్తుండడంతో దుర్గంధం అలముకుంటోంది.. దీంతో బాటసారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకొక్క సారి రోజుల తరబడి ఉంచేస్తుండడంతో రోడ్డుపై నడిచేవారు. ప్రయాణం చేసేవారు చెడువాసనతో ఇబ్బందులు పడుతున్నారు. చీపురుపల్లి రోడ్డు, పాలకొండ రోడు, బొబ్బిలిరోడ్ల పక్క చెత్త నిల్వ చేస్తుండడంతో ఆ మార్గంలో వెళ్లేవారు దుర్గంధంతో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది.. నగరపంచాయతీ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

జోరుగా... హుషారుగా!



వరి నారును కట్టలుగా కడుతున్న వ్యవసాయ కూలీలు

రాజాంఅర్బన్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా ఆదివారం కురిసిన వర్షంతో వరి ఆకు బతికిందని రైతులు సంబర పడుతున్నారు. వరి ఆకు బాగా ఉన్నప్పుడు తదుపరి పనులు చేసుకోవాలన్న ఉద్దేశంతో పనులు చేపడుతున్నారు. ట్రాక్టర్లతో పొలం పనులు చేస్తున్నారు. రాజాం మండలంలోని వ్యవసాయ భూములకు తోటపల్లి సాగునీరుతో పాటు చెరువు లే ఆధారం. అయితే వర్షాలు లేకపోవడం, తోటపల్లి ప్రాజెక్టుకు సంబంధించి పిల్ల కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రాజాం మండల రైతులు వర్షాధారంపై వ్యవసాయం చేస్తున్నారు.



ట్రాక్టర్‌తో దున్నుతున్న దృశ్యం

దాహం..దాహం!



పూర్తి స్థాయిలో నీటినివ్వని ట్యాంకు

● నీటి పథకం ఉన్నా ప్రయోజనం నామమాత్రం ● పనిచేయని వీధి కొళాయిలు ● ఇబ్బంది పడుతున్న ప్రజలు ● ఇదీ మారేడుబాక పరిస్థితి

సుమారు 300 కుటుంబాలున్న గ్రామం.. అందులో కేవలం 30 కుటుంబాలకే నీటి సదుపాయం.. ఎదురుగా నీటి పథకం ట్యాంకు కనిపిస్తున్నా ప్రయోజనం శూన్యం.. వీధి కొళాయిలు పనిచేయకపోవడంతో నీటికోసం పరితపిస్తున్నారు మారేడుబాక గ్రామస్థులు.. సమస్యను అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించడం లేదని వాపోతున్నారు.. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం...





ట్యాంకు వద్ద ఈ కొళాయిలే ఆధారం.. వీధిలో పనిచేయని కొళాయి...

మారేడుబాక(రాజాంఅర్బన్): మారేడుబాకలోని ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు.. సుమారు మూడువేల జనాభా ఉన్నప్పటికీ అందరికీ తాగునీరు అందడం లేదు. గ్రామంలో నీటి పథకం ఉన్నా నీటి సామర్థ్యం లేక కొద్దిమందికే నీటి పథకం పరిమి తమైంది. గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీలుగా ఆరేడు వీధులున్నప్పటికీ ఏ కాలనీకిగాని, వీధికి గాని నీటి సరఫరా జరగడం లేదు. నీటి కోసం మహిళలు నీటి పథకం వద్ద ఏర్పాటు చేసిన కొళాయిల వద్దకు మాత్రమే వెళ్లాల్సి వస్తోంది.. మిగిలిన వీధుల్లో ఏర్పాటు చేసిన కొళాయిలు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో వేసవితో పాటు ఇతర కాలాల్లోనూ నీటి కోసం అల్లాడుతున్నామని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కొళాయిలున్నా ఫలితం సున్నా..



గ్రామంలో నీటి సమస్య ఉంది. నీటి పథకం ఉన్నా ఇంతవరకు పథకం ద్వారా నీటి సరఫరా కాలేదు. వీధుల్లో ఏర్పాటు చే సిన కొళాయిలు దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి.

-బి.రామారావు, మారేడుబాక

నీటి సమస్యను పరిష్కరించండి



తాగునీటి సమస్య పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామంలో పథకంతో పాటు వీధుల్లోని కొళాయిలు పనిచేసేలా చూడాలి. నీటి సామర్థ్యం లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి.

-బి.లక్షుమమ్మ, గృహిణి, మారేడుబాక

పన్ను భారాన్ని ఉపసంహరించుకోండి

పాలకొండ టౌన్: నగరపంచాయతీ ప్రజలపై పన్ను భారం మోపే 159, 160, 279 జీవోలను రద్దు చేయాలని సీఐటీయూ నాయకుడు దావాల రమణారావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పడాల భాస్కరావు, చింతల క్రైసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ జీవోలను రద్దు చేయాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. 279 జీవో అమలులోకి వస్తే పట్టణాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర పనులన్నీ ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తారన్నారు. 151 జీవో ప్రకారం మున్సిపాలిటీల్లోని అన్ని విభాగాల్లో ఉన్న ఉద్యోగులకు జీతాలు చెల్లించాలన్నారు. నగరపంచాయతీలో మూడేళ్లుగా పీఎఫ్ గురించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీ.హెచ్.సింహాచలం, సీ.హెచ్ రఘు, పి.శ్రీను. సురేష్, మధు, వి.గిరి. శ్రీదేవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

11 నుంచి జీవన నైపుణ్య తరగతులు

శ్రీకాకుళం సిటీ: లైఫ్ స్కిల్స్ (జీవన నైపుణ్యాలు)పై వారం రోజులపాటు తరగతులు నిర్వహిస్తున్నట్టు ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కోర్సు సమన్వయకర్త బీకే జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ సౌజన్యంతో ప్రజాపతి బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలం వారం రోజులపాటు ఈ కోర్సును నిర్వహిస్తుందని చెప్పారు. ఆగస్టు 11 నుంచి 17 తేదీవరకు చినమండలవీధిలోగల తమ సంస్థ భవనంలో తరగతులు జరుగుతాయని చెప్పారు.

నెహ్రూ యువకేంద్రంలో స్వచ్ఛత పక్షోత్సవాలు

శ్రీకాకుళం సిటీ: నెహ్రూ యువకేంద్రం , శ్రీకాకుళం ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్షోత్సవాలు ప్రారంభించినట్టు కోఆర్డినేటర్ కెవీ రమణ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 30 మంది యువత శ్రమదానం చేసి నెహ్రూ యువకేంద్రం కార్యాలయం ఆవరణను శుభ్రం చేశారు.గణాంకాధికారి ప్రమోద్, వివేకానంద యూత్ గ్రూప్, గంగమ్మతల్లి యువజన సంఘప్రతినిధులు కె.విజయ్‌కుమార్, ఎల్.ప్రసన్నకుమార్, ఎస్.దేవిప్రసాద్, ఎల్.లావణ్య, కె.మోహిని, ఇతర వలంటీర్లు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కాలువలిలా.. సాగునీరెలా?

● ఇబ్బంది పడుతున్న రైతులు

చిత్రాల్లో చూస్తున్నారుగా.. ఇవి సాగునీరందించే కాలువలు..వీటిని అభివృద్ధి చేయకపోవడంతో ఇలా పిచ్చిమొక్కలు మొలిచి సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై వర్షాలు కురుస్తున్నా సాగునీరందకపోవడానికి కాలువల పరిస్థితే కారణమని రైతులు వాపోతున్నారు. రాజాం- చీపురపల్లి రోడ్డులో గాయత్రీకాలనీ సమీపంలో ఉన్న సాగునీటి కాలువలు పూర్తిగా ముళ్ల పొదలతో నిండిపోయాయి. కొత్తవలస, మారేడుబాక తదితర గ్రామాల్లో ఉన్న చెరువుల నుంచి సారధి గెడ్డ, గుర్రాల చెరువులకునీరు వెళ్లే ఈ కాలువలపై అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది..

-రాజాంఅర్బన్





కాలువల్లో మొలిచిన పిచ్చిమొక్కలు

జేఈ, ఆర్ఐల నియామకం


ప్రసాదరావు

రేగిడి: పంచాయతీరాజ్ శాఖ జేఈ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ల నియామకం ఎట్టకేలకు చేపట్టారు. జూలై 18న 'ఆంధ్రజ్యోతి'లో 'పలు శాఖల అధికారులు లేక ఇబ్బందులు' అనే శీర్షికతో వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ జేఈగా రియాజ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐ-2గా బి.ప్రసాదరావు బాధ్యతలు చేపట్టారు. ఈయన పాలకొండ నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రూ. 80లక్షల ఆదాయం


మాధవరావు, కార్యదర్శి, ఏఎంసీ

రాజాంఅర్బన్: రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న రెండు చెక్ పోస్టుల ద్వారా రూ.80 లక్షలు ఆదాయం వస్తోందని కార్యదర్శి వైసీహెచ్ మాధవరావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పేర్కొన్నారు.

ప్రశ్న: ఏఎంసీ పరిధిలో ఎన్ని మండలాలున్నాయి?

జవాబు: రాజాం, వంగర, సంతకవిటి, రేగిడి మండలాలు ఉన్నాయి.

ప్ర: చెక్‌పోస్టులు ఎన్ని ఉన్నాయి? ఆదాయం ఎంత వస్తోంది?

జ: డోలపేట వద్ద, చీపురుపల్లి రోడ్డులో ఉన్న చెక్‌పోస్టుల ద్వారా ఏడాదికి సుమారు రూ.80 లక్షల వరకు ఆదాయం వస్తోంది.

ప్ర: మిగిలిన ఆదాయ వనరులు పరిస్థితి ఏమిటి ?

జ: ఏఎంసీ ఆవరణలో ఉన్న గొడౌన్‌లు, రైపనింగ్ ఛాంబర్ అద్దెకివ్వడంతో లక్షల ఆదాయం వస్తోంది.

ప్ర: రైతులకు ఎటువంటి ప్రయోజనాలు కల్పిస్తున్నారు?

జ: ఇటీవల పశువైద్య శిబిరాలను అన్ని మండలాలలో నిర్వహించాం.

ప్ర: సిబ్బంది కొరత ఉందా?

జ: సుమారు పది మంది సిబ్బంది కొరత ఉంది. ఈ విషయమై ఉన్నతాధికారులకు తెలియజేశాం.

పన్నులను చెల్లించండి

● ఇన్‌చార్జి కమిషనర్

రాజాంఅర్బన్: నగరపంచాయతీ పరిధిలో ప్రజలు ఇంటి నీటి పన్ను చెల్లించాలని ఇన్‌చార్జి కమిషనర్ బొడ్డేపల్లి రాము కోరారు. పన్నుల వసూలుతో నగరపంచాయతీ అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందన్నారు. సిబ్బంది ఇంటికి వచ్చి డిమాండ్ నోటీసు ఇస్తారని నిబంధనల మేరకు గడువులోగా చెల్లించాలన్నారు. పన్ను చెల్లించకపోతే నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆయన స్పష్టంచేశారు.

గ్యాస్ సమాచారం

లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో ఉన్న వినియోగదారులు ఈనెల 1 వరకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి బుధవారం గ్యాస్ సరఫరా చేస్తామని నిర్వాహకుడు సాయి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఏవైనా గ్యాస్ సమస్యలుంటే 08941- 251016, 251160, 94905 96519 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

సినిమాలు

రాజాం

అప్సర (ఎ.సి)- ఫిదా

సీతారామా (ఎ.సి)- గౌతమ్‌నంద

సీతారామా (మినీ)- వాసుకి

మీజిల్స్-రూబెల్లా వ్యాక్సిన్‌తో సంపూర్ణ ఆరోగ్యం


సంతకవిటి: వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ భార్గవి



రాజాం, వంగర కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థినులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

సంతకవిటి: ఎంఆర్ వ్యాక్సిన్ వేయించడం ద్వారా విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని సంతకవిటి, మండాకురిటి పీహెచ్‌సీ వైద్యాధికారులు గట్టి భార్గవి, భార్గవ్ అన్నారు. మంగళవారం తొమ్మిది నెలల నుంచి 15ఏళ్లలోపు విద్యార్థులకు 2500 ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్లు వారు పేర్కొన్నారు. తొలిరోజు మండాకురిటి, సిరిపురం, మా మిడపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 2500 మంది విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేగిడి: తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్ల లోపు చిన్నారులకు మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్ వేయడం వల్ల ప్రయోజనం చేకూరుతుందని ఎంపీడీవో బాసూరి శంకరరావు, వైద్యాధికారి పి.పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం రేగిడి, ఆర్ఆమదాలవలస, తునివాడ తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నెల రోజుల పాటు రూబెల్లా వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఇప్పటి వరకు 6,900 మందికి వ్యాక్సిన్ వేసినట్లు వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ఎంవీ ప్రసాదరావు, హెల్త్ సూపర్‌వైజర్ జనార్దనరావు, వైద్యసిబ్బంది, పాల్గొన్నారు.

వంగర: మీజిల్స్-రూబెల్లా వ్యాక్సిన్ వేయడంలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని వైద్యాధికారి డి.అనిల్ అన్నారు. మంగళవారం వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని పాఠశాలల్లో శతశాతం వ్యాక్సిన్ వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పది రోజుల వ్యవధిలో మండలంలో తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్ల మధ్య ఉన్న పిల్లలకు తప్పకుండా ఈ వ్యాక్సిన్ వేయాలని సూచించారు.

రాజాంరూరల్: ఎంఆర్ వ్యాక్సిన్ తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల లోపు బాలబాలికలు విధిగా వేయించుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం గురవాం కస్తూర్బా, బొద్దాం, పోగిరి పీహెచ్‌సీ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఆర్ వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల రక్తహీనత తగ్గే అవకాశం ఉందన్నారు. వ్యాక్సిన్ వేయించుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. నెలరోజుల పాటు వ్యాక్సిన్ ప్రతి పాఠశాలలోను వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బొద్దాం పీహెచ్‌సీ పరిధిలో 12 పాఠశాలల్లో 1,580 మంది విద్యార్థులకు వ్యాక్సిన్ వేసినట్లు వైద్యాధికారులు విద్యాసాగర్, బి.సునీత తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.వెంకటేశ్వరరావు, కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి పి.శారద, వైద్యసిబ్బంది రవిచంద్రపాడే, ఆచారి, ఈశ్వరరావు, డీపీఎంవో పాలవలస శ్యామసుందరరావు తదితరులు పాల్గొన్నారు.



రేగిడి, సంతకవిటి మండలాల్లో వాక్సినేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది

బాలింతలూ.. జాగ్రత్తలు తీసుకోండి

చినశిర్లాం(రేగిడి): ప్రసవ సమయంలో ఇబ్బందులున్న తరుణంలో బాలింతలు జాగ్రత్తలు పాటించాలని రేగిడి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజనీదుర్గ అన్నారు. మంగళవారం చిన్నశిర్లాం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చంటి పిల్లలకు ముర్రిపాలు ఆరు నెలల వరకు అందించాలని, దీనివల్ల వారు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పిల్లలకు పాలు పట్టేటప్పుడు శుభ్రం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, క్యారెట్, బీట్‌రూట్ వంటి పోషకాలున్న కూరలు వండి తినాలన్నారు. బాలింతలు పరిశుభ్రంగా ఉంటేనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతిరోజు ఉతికిన దుస్తులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు పాల్గొన్నారు.


బాలింతలకు అవగాహన కల్పిస్తున్న రజనీదుర్గ

విలువైన బోటు.. ఇలా!


బోటు

వంగర: విపత్కర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు గాను లక్ష లాది రూపాయలు వ్యయమయ్యే బోటును తహసీల్దార్ కార్యాలయంలో ఇలా పడేశారు.. రెడ్‌క్రాస్, డీఆర్‌డీఏల ద్వారా రూ.6 లక్షలు విలువ చేసే రెండు బోట్లను రెండేళ్ల కిందట తహసీల్దారు కార్యాలయానికి పంపించారు. గత ఏడాది వరదల సమయంలో తహసీల్దారు కార్యాలయ సిబ్బంది హడావుడిగా ఒక బోటును మడ్డువలస గెస్ట్‌హౌస్ వద్దకు తెచ్చి వదిలేయడంతో దానిని కొందరు ఆకతాయిలు తగుల బెట్టారు. మరో బోటును తహసీల్దారు కార్యాలయంలో ఇలా వదిలేయడంతో పాడయ్యే అవకాశం ఉందని, దీనివల్ల అత్యవసర సమయాల్లో వినియోగించే పరిస్థితి ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సేంద్రియ విధానంతో అధిక దిగుబడులు

మునకలవలస (రేగిడి): సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి ఎం,మధుసూదనరావు అన్నారు. మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మునకలవలస, పనసలవలస గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌లో ఆరోగ్యకరమైన వరి నాట్లు వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విత్తనశుద్ధి చేయాలని సూచించారు.

రైతులు కాలిబాటలు తీసుకోవడం ద్వారా పంట ఆరోగ్యకర మైన పంట పండుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు కంబాల జగదీష్, దమయంతి, దమయంతి, ఎఈవోలు హరిప్రసాద్, చాందిని, వినీత, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నందబలగ (రాజాంరూరల్): కాలిబాట, సేంద్రియ విధానాలను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సిబ్బంది వరలక్ష్మి, సంధ్య, వనజ అన్నారు. మంగళవారం నందబలగలో కొర్ను బాలాజీ పొలంలో చంద్రన్న రైతు క్షేత్రం లో వరి విత్తనాలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పథకంలో రైతులకు అన్ని విధాలా సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. విత్తనాలు నాటి నప్పటి నుంచి పంట చేతికి వచ్చేంతవరకు వ్యవసాయ సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈసందర్భంగా కంబైన్ ఆర్వోసింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో రైతు క్షేత్రం ద్వారా విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రాజాంరూరల్: కాలిబాటలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


రేగిడి: రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖాధికారులు

11 నుంచి జీవన నైపుణ్య తరగతులు

శ్రీకాకుళం సిటీ: లైఫ్ స్కిల్స్ (జీవన నైపుణ్యాలు)పై వారం రోజులపాటు తరగతులు నిర్వహిస్తున్నట్టు ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కోర్సు సమన్వయకర్త బీకే జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ సౌజన్యంతో ప్రజాపతి బ్రహ్మాకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలం వారం రోజులపాటు ఈ కోర్సును నిర్వహిస్తుందని చెప్పారు. ఆగస్ట్ 11 నుంచి 17 తేదీవరకు చినమండలవీధిలోగల తమ సంస్థ భవనంలో తరగతులు జరుగుతాయని చెప్పారు.



మాట్లాడుతున్న పీడీ కళావతి

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

శ్రీకాకుళం లీగల్ : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకులు కరణం లీలావతి చెప్పారు. నగరంలోని శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం తల్లిపాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన లీలావతి మాట్లాడుతూ తల్లిపాలలో ఎన్నో పోషక విలువలున్నాయని చెప్పారు. బిడ్డ జన్మించిన వెంటనే అరగంటలోపు ముర్రుపాలను ఇవ్వాలన్నారు. ఏడాది వయసు వచ్చేవరకు తల్లిపాలను అందించాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో సీడీపీవో ఎంఎన్ రాణి, సూపర్‌వైజర్లు యశోధ, మంగమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గూనపాలెం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, కల్యాణి, ఆదిలక్ష్మి, రత్నలక్ష్మి, బేబి, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రైతుబజార్ ధరలు

కూరగాయలు	ధర(కిలో) రూ...
టమోటా	రూ. 68
వంకాయలు	రూ. 26
బెండకాయలు	రూ. 20
పచ్చిమిర్చి	రూ. 45
బీరకాయలు	రూ. 27
కాలీఫ్లవర్	రూ. 32
క్యాబేజీ	రూ. 17
క్యారెట్	రూ. 27
దొండకాయలు	రూ. 24
పచ్చిబఠాని	రూ. 32
ఉల్లి	రూ. 13
బీన్స్	రూ. 45
గోరుచిక్కుడు	రూ. 26
బంగాళదుంప	రూ. 11
అరటికాయ(జత)	రూ. 18
చామదుంప	రావడం లేదు
ఎర్రదుంపలు	రూ. 20
నూల్‌కోల్ దుంప	రూ.20
బీట్‌రూట్	రూ. 28
కీర	రూ. 25
ఫ్రెంచ్‌బీన్స్	రూ. 34
కాకరకాయలు	రూ. 29
అల్లం	రూ. 50
గోల్కొండచిక్కుల్లు	రూ. 32
స్వీట్‌పొటాటో	రూ. 16
వెల్లులి	రూ. 70
క్యాప్సీకం	రూ. 58



ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలోకి చేరిన వరద నీరు..ప్రయాణికుల పాట్లు

నగరంలో భారీ వర్షం

శ్రీకాకుళం నగరంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సుమారు గంటన్నర పాటు కురిసిన ఈ వర్షం సాధారణ జనజీవనాన్ని స్తంభింపజేసింది. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. కాలువల నిర్వహణ సరిగాలేక మురుగు నీరు రహదారులపై ప్రవహించింది. లోతట్టుప్రాంతాల్లోనికి భారీగా నీరుచేరింది. అక్కడ నివసిస్తున్న ప్రజలు ఇక్కట్లు పడ్డారు. అయితే నగరంలో సగంప్రాంతంలో మాత్రమే వర్షం కురవడం... మిగిలిన ప్రాంతాల్లో కురవకపోవడంతో ప్రజలు విభిన్న పరిస్థితులు చవిచూశారు.

-శ్రీకాకుళం సిటీ

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అదే సీన్

నగరంలో కురిసిన భారీవర్షానికి ఎప్పటిమాదిరిగానే ఆర్టీసీకాంప్లెక్స్ జల దిగ్బంధనంలో చిక్కుకుంది. కాంప్లెక్స్ ప్రాంగణం మొత్తం సిమెంట్ కట్టడాలతో నిండిపోవడంతో నీరు ఇంకే పరిస్థితి లేదు. నీటిపారుదల వ్యవస్థ ఇక్కడ లోపించింది. ఫలితంగా వర్షం కురిసిన ప్రతిసారి ఇదే పరిస్థితి. మంగళవారం కూడా ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణీకులు అవస్థలు ఎదుర్కొన్నారు. రెండడుగుల లోతున నీరు ప్రవహించడంతో భారీ చెరువును తలపించింది. బస్సుల, వాహనాల, పాదచారుల, ప్రయాణీకులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఎదురైంది.



బలగ ప్రధాన రహదారిలో నిలిచిన వరద నీరు..వాహన చోదకులకు ఇక్కట్లు


ర్యాలీ నిర్వహిస్తున్న నగరపాలక సంస్థ కార్మికులు

కదంతొక్కిన నగరపాలక సంస్థ కార్మికులు

● నగరంలో భారీ నిరసన ర్యాలీ

శ్రీకాకుళం సిటీ: ఉద్యోగ భద్రత కల్పించి తక్షణం జీతాలు పెంచాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. నగరంలోని ఏడురోడ్లజంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. అంతకుముందు నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి ర్యాలీగా అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి టి.తిరుపతిరావు మాట్లాడుతూ కార్మికులకు తక్షణమే జీవో 151 ప్రకారం జీతాలు పెంచాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో 151 జీవో అమలుచేస్తుండగా ....శ్రీకాకుళం నగరపాలక సంస్థలో మాత్రం అమలుచేయకుపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇంజనీరింగ్ కార్మికులకు, స్కిల్డ్, సెమిస్కిల్డ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, నగరపాలక సంస్థ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు జీపీఎఫ్ అకౌంట్లు, హెల్త్‌కార్డులు, 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలన్నారు. 279 జీవోను వెనక్కితీసుకుంటామని హామీ ఇచ్చిన ప్రభుత్వం మరోపక్క టెండర్ల ప్రక్రియ తెలవాలని చూడడం కపటనాటకానికి నిదర్శనమన్నారు. నగరపాలక సంస్థలో గత ఐదేళ్లుగా పీఎఫ్, ఈఎస్‌ఐ నిధులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. పోలీసులు కార్మికులను అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.యూనియన్ కార్యదర్శి ఎం.బలరాం, కె.వే ణు, కె.రాజు, పార్థసారధి, గణేష్, నరసమ్మ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ పెంటారావు

శ్రీకాకుళం సిటీ:శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపడుతున్నామని ట్రాఫిక్ ఇన్‌చార్జ్ డీఎస్పీ సీహెచ్ పెంటారావు తెలిపారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలపై వైఎస్‌ఆర్ కల్యాణ మండపంలో మంగళవారం స్థానిక వ్యాపారులు, వాహన యజమానులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీటీ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై మంచి సలహాలు సూచనలు అందించాలని కోరారు. జీటీరోడ్డులో కేవలం ద్విచక్రవాహనాలకు మాత్రమే పార్కింగ్ ఏర్పాటుచేసి ఆటోలు, కార్లు, ఇతర వాహనాలకు ఎన్‌టీఆర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానంలో పార్కింగు ఏర్పాటు చేయుటకు చర్యలు చేపట్టాలని వ్యాపారులు సూచించారు. జీటీ రోడ్డులో ద్విచక్రవాహనాలు పార్కింగును రహదారికి మధ్యలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. త్రిచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలను ఎన్‌టీఆర్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. అదేవిధంగా తోపుడుబళ్ల వ్యాపారులకు ఎన్టీఆర్ ఉన్నత పాఠశాల వద్ద విక్రయించుకునే అవకాశం కల్పిస్తామని తద్వారా జీటీ రోడ్డుపై ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సాఫీగా సాగుతుందన్నారు.

● ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించి సహకరించాలని డిఎస్పీ ఆటోడ్రైవర్లను కోరారు. ట్రాఫిక్ నిబంధనలపై ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఆటోడ్రైవర్లతో అవగాహన సదస్సును నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించరాదని ఆయన స్పష్టం చేశారు. జాతీయ రాష్ట్ర రహదారులపై ద్విచక్ర వాహనాదారులు విధిగా హెల్మెట్‌ధారణ చేయాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు ఈ.శ్రీనివాసరావు, ఎస్.లక్ష్మణరావు, వి.నాగరాజు, కోటేశ్వరరావు, రవికుమార్, వర్తక ప్రముఖులు, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుర యాప్‌పై అవగాహన అవసరం

శ్రీకాకుళం సిటీ:పురసేవయాప్‌పై అవగాహన పెంపొందించుకోవాలని నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ నూకేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో పురసేవ యాప్ పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర సేవ యాప్ ను ఏవిధంగా మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి, ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ యాప్ ద్వారా సమస్యను అధికారులకు తెలియజేయవచ్చునని తెలిపారు. కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త జి.శంకరనారాయణరావు, ఎన్ఎస్ఎస్ పీవో కుమారికరుణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత : ఎస్పీ



మొక్కలు నాటుతున్న ఎస్పీ

మొక్కలు నాటడమే కాకుండా సంరక్షించే బాధ్యత తీసుకోవాలని విద్యార్థులకు ఎస్పీ త్రివిక్రమ వర్మ సూచించారు. మంగళ వారం ఎస్పీ బంగ్లాల్లోని గార్డెన్‌లో తన కుమార్తె సీఎం మహ్మిన చే మొక్కలు నాటించారు. ఎస్పీ మాట్లాడుతూ మొక్క ల పెంపకం సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు.

(శ్రీకాకుళం క్రైం)



రిలే నిరాహార దీక్షల్లో నినాదాలు చేస్తున్న కార్మికులు

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

శ్రీకాకుళం సిటీ:సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం కొనసాగించాలని రిమ్స్ కార్మికులకు ఏపీ ప్రభుత్వ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, టీచర్స్ ఫెడరేషన్ (జేఏసీ) రాష్ట్ర అర్గనైజింగ్ కార్యదర్శి సాయిప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మహిళలను, ఉద్యోగులను రోడ్డున పడేయడం తగదన్నారు. ప్రభుత్వవిధానాలను గుర్తించి వచ్చే ఎన్నికల్లో ఉద్యోగులు తమ సత్తా చూపాలన్నారు. తొమ్మిదిరోజులుగా రిలే నిరాహారదీక్షలు జరుగుతుంటే జిల్లా అధికారయంత్రాగం స్పందించకపోవడం దారుణమన్నారు. దీక్షలో కార్మికులు ఆర్.చిన్నారావు, కె.రాజశేఖర్, డి.వామనరావు, జి.ఉషారాణి, సీహెచ్ రాజులమ్మ కూర్చున్నారు. సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు ఎం.ఆదినారాయణమూర్తి, రిమ్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు డి.గణేష్, యూనియన్ అధ్యక్షకార్యదర్శులు శ్యామల, సింహాచలం పాల్గొన్నారు.

వసుధ ఫౌండేషన్ వితరణ



చిన్నారులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం సిటీ: హైదరాబాద్‌కు చెందిన వసుధ ఫౌండేషన్ శ్రీకాకుళంలోని శాంతాకల్యాణ్ అనురాగనిలయం లోని చిన్నారులకు సోమవారం స్టేషనరీ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త ఎంవీ నాగరాజు, జిల్లాసభ్యులు నడిపిల్లి కస్తూరికుమార్‌రావ్, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ప్రతినిధులు నిక్కు అప్పన్న, ఊన్న నాగరాజు, బరాటం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ అధికారుల ఫోన్ నంబర్లు

పీఏ శోభ ఐఏఎస్	కమిషనర్	9849905787
నూకేశ్వరరావు	సహాయ కమిషనర్	9849908099
డి.భాస్కరరావు	ప్రజారోగ్య అధికారి	9849906972
జి.వేంకటేశ్వరరావు	ఇంజనీర్	9000902338
దేవకుమార్	సహాయ సిటీ ప్లానర్	9949996081
కిశోర్‌కుమార్	ప్రణాళిక అధికారి	8897626999
జగన్మోహనరావు	మెప్మా అధికారి	9701385743
అప్పలస్వామి	పట్టణ సర్వేయర్	9849906967
డి.గణేష్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	8919228847
ప్రకాష్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	9849908966

శ్రీకాకుళం నగరీకరణ వైపు అడుగులు వేస్తున్నా.. అందుకు తగ్గట్టు వసతులు మాత్రం సమకూరడం లేదు. అభివృద్ధి పనులు ఆరంభశూరత్వంగా మిగులుతున్నాయి. ఆర్భాటంగా ప్రకటించడం...తరువాత మరుగున పడేయడం పరిపాటిగా మారుతోంది. దీంతో ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న ప్రజలకు తీవ్ర నిరాశే ఎదురవుతోంది. నగరపాలక సంస్థగా మారిన తరువాత ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్న తమ ఆశలు నీరుగారిపోతుండడంతో నగరవాసులు నిట్టూరుస్తున్నారు.



ఇంకెంత కాలం?

- ఆరంభశూరత్వంగా అభివృద్ధి పనులు
- పట్టాలెక్కని ఇన్నర్ రింగ్ రోడ్డు
- విస్తరణ పనులు మార్కింగ్‌తో సరి
- గట్టెక్కని ట్రాఫిక్ ఇక్కట్లు

(కలెక్టరేట్)

నగరపాలక సంస్థగా మారింది. వసతులు పెరుగుతాయి. నగరం సుందరీకరణ తథ్యమని నమ్మిన ప్రజలకు నిరాశే మిగిలింది. విద్య, వాణిజ్య, వైద్యపరంగా జిల్లా కేంద్రం గణనీయమైన అభివృద్ధి చెందుతోంది. దీంతో ఉద్యోగులు, వ్యాపారులు ఇక్కడికే మకాం మారుస్తున్నారు. నగరానికి ప్రజల రాకపోకలు కూడా అధికమయ్యాయి. నగరానికి చుట్టూ ఉన్న గ్రామాల వరకూ భవనాల నిర్మాణం విస్తరిస్తోంది. ఇన్నీ జరుగుతున్నా అభివృద్ధి విషయంలో ప్రభుత్వం, నగరపాలక సంస్థ నుంచి మాత్రం ఆశించినస్థాయిలో సహకారం లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. హడావుడిగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారంచుట్టడం, తరువాత మరుగున పడేయడం అలవాటుగా మారిందన్న అపవాదు ఉంది. ఇందుకు చక్కటి ఉదాహరణ నగరంలోని ప్రధాన కూడళ్లను కలుపుతూ ఏర్పాటుచేయతలపెట్టిన రింగురోడ్డు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి మార్కింగ్ చేసి సంవత్సరాలు గడుస్తున్నా పనులకు అతీగతీ లేదు. ఫలితంగా ప్రజలు కూడా నమ్మకాన్ని, ఆశలను వదులుకుంటున్నారు.

● ఇదీ పరిస్థితి..

నగరంలోని అతి ప్రధాన కేంద్రాలైన డేఅండ్‌నైట్, ఏడురోడ్ల కూడలి, సూర్యమహాల్ కూడలి, రామలక్ష్మణ కూడలి తదితర రద్దీ కలిగిన ప్రాంతాలను కలుపుతూ ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి సంకల్పించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు వుడాకు పంపించారు. పెరిగిన అవసరాల రీత్యా రింగ్‌రోడ్డు నిర్మాణం తప్పనిసరి అని వుడా కూడా భావించింది. ఇన్నర్ రింగ్ రోడ్డుతో పాటు సూర్యహాల్ నుంచి అరసవిల్లి జంక్షన్ మీదుగా పాతబస్టాండ్ నుంచి ఏడురోడ్లు కూడలిని కలుపుకొని రహదారులు విస్తరణ చేపట్టాలని యోచించింది. మొత్తం ఎనిమిది కిలోమీటర్ల మేర నిర్మాణపనులకుగాను రూ.50 కోట్లు అవసరమని గుర్తించారు. ఇందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. ఇది జరిగి నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు మాత్రం పారంభం కాలేదు. ఈ నేపథ్యంలో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ధనుంజయరెడ్డి దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. రెండు, మూడు సార్లు అధికారులుతో సమీక్షలు కూడా నిర్వహించారు. త్వరగా పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కానీ ఆయన ఆదేశాలను సైతం బేఖాతరయ్యాయి. అధికారులు పెడచెవిన పెట్టారు.



● మాసిపోతున్న మార్కింగ్‌లు

ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియదు కానీ...రోడ్ల విస్తరణకుగాను అధికారులు మార్కింగ్ పూర్తిచేశారు. ప్రధాన రహదారిలో వేసిన మార్కింగ్‌లు చెరిగిపోతున్నాయి. ఫలితంగా వేలాది రూపాయల ఖర్చుతో చేపట్టిన మార్కింగ్ ప్రక్రియ నిష్ఫలమవుతోంది. నగరంలో మార్కింగ్ ప్రక్రియ రివాజుగా మారిందని...ఇదంతా జరగని పనియంటూ నగరవాసులు నవ్వుకుంటున్నారు.

● రాజకీయంగా ఇబ్బందనే..

ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న జాప్యం రాజకీయంగా ముడిపడి ఉందన్న వాదన ఉంది. నగరపాలక సంస్థ ఎన్నికలు ఉండడం...ప్రభావం ఉంటుందన్న సాకు వల్లే పనుల్లో పురోగతి లేదని తెలుస్తోంది. రింగ్ రోడ్డుతో పాటు రోడ్ల విస్తరణ చేపడితే చాలా మంది వ్యాపారులు నష్టపోతారు. ప్రధాన కూడళ్లలో బడాబాబుల కట్టడాలకు నష్టం జరుగుతుందని...అదే జరిగితే వారంతా ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపిస్తారన్న భావనతోనే అధికార, ప్రతిపక్ష పార్టీలు వీటి జోలికి వెళ్లడం లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



రోడ్డు విస్తరణకు వేసిన మార్కింగ్

● జనానికి తప్పని ఇక్కట్లు

ఉదయం ఎనిమిది గంటల నుంచే డేఅండ్‌నైట్ జంక్షన్, ఏడురోడ్ల కూడలి, సూర్యమహాల్ కూడలి, రామలక్ష్మణ్ జంక్షన్, పొట్టిశ్రీరాముల కూడళ్లు ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటున్నాయి. ఒక్కో కూడలి నుంచి బయటపడాలంటే వాహన చోదకులు పడుతున్న ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. ఒక్కోసారి గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు నరకయాతన పడుతుంటారు. ముఖ్యంగా డేఅండ్‌నైట్ కూడలిలో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణంతో పాటు రహదారుల విస్తరణ చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.



నగరంలోని ప్రధాన కూడళ్లలో వాహనాల రద్దీ

నెహ్రూ యువకేంద్రంలో స్వచ్ఛత పక్షోత్సవాలు

శ్రీకాకుళం సిటీ: నెహ్రూ యువకేంద్రం , శ్రీకాకుళం ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్షోత్సవాలు ప్రారంభించినట్టు కోఆర్డినేటర్ కెవీ రమణ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 30 మంది యువత శ్రమదానం చేసి నెహ్రూ యువకేంద్రం కార్యాలయం ఆవరణను శుభ్రం చేశారు.గణాంకాధికారి ప్రమోద్, వివేకానంద యూత్ గ్రూప్, గంగమ్మతల్లి యువజన సంఘప్రతినిధులు కె.విజయ్‌కుమార్, ఎల్.ప్రసన్నకుమార్, ఎస్.దేవిప్రసాద్, ఎల్.లావణ్య, కె.మోహిని, ఇతర వలంటీర్లు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు తరుణ్ ఎంపిక



వమరవెల్లి(గార) : వమరవెల్లికి చెందిన యు.తరుణ్ ఏసీఏ అంతర్‌జిల్లాల అండర్-16 జిల్లా బాలుర క్రికెట్ జట్టుకు ఎంపికైనట్టు కోచ్ ఎం.రాజుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3 నుంచి 23 వరకూ గుంటూరులో జరగనున్న ఏసీఏ అంతర్‌జిల్లాల క్రికెట్ పోటీలకు తరుణ్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. తరుణ్ ఎంపికపై సర్పంచ్ ఎల్.భవాని రాధాకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సుగ్గు లక్ష్మీనర్సింహదేవి, జేసీ దేవదాస్, వి.సాంబమూర్తి తదితరులు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం తరుణ్ కె.మత్స్యలేశం పరిధిలోగల ఏసీఏ, ఎస్‌డీసీఏ క్రికెట్ శిక్షణ ఉపకేంద్రంలో శిక్షణ పొందుతున్నారన్నారు.

సిస్టమ్ విద్యార్థుల సేవానిరతి


పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

అంపోలు(గార) : అంపోలు సమీపంలోని శారాద ఇంజనీరింగ్ కళాశాల (సిస్టమ్) ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని వృద్ధ జనాశ్రమంలో మంగళవారం స్వచ్ఛ భారత్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.ప్రసాదరావు ఆధ్వర్యంలో వృద్ధాజనాశ్రమాన్ని శుభ్రం చేశారు. వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి బౌరోతు శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ బాలభాస్కరరావు, సీఎస్ఈహెచ్ వోడీ జయంతిరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కళింగపట్నంలో పొలం పిలుస్తోంది

కళింగపట్నం(గార) : కళింగపట్నంలో మండల వ్యవసాయాధికారి పైల నవీన్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ సాగులో జింక్ సల్ఫేట్ వినియోగం, దాని అవసరం గురించి అవగాహన కల్పించారు. సాగు ధ్రువీకరణపత్రాల వినియోగం, చంద్రన్న భూసార పర్యవేక్షణ పథకం కింద భూసార పరీక్ష విశ్లేషణ పత్రా గురించి, ఎరువుల వాడకం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ పొట్నూరు కృష్ణమూర్తి, ఏఈఓ కె.శిరీష పాల్గొన్నారు.

రాగోలులో రామ్‌మనోహర్‌నాయుడు జన్మదిన వేడుకలు

రాగోలు(శ్రీకాకుళం రూరల్) : వైసీపీ యువజన నాయకుడు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు తనయుడు రామ్‌మనోహర్‌నాయుడు జన్మదిన వేడుకలు మంగళవారం రాగోలులో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ యజ్జల గురుమూర్తి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో గుండ భాస్కరరావు, చింతపల్లి హరి, పెద్దిన హరికృష్ణ, గొడ్డు లక్ష్మణరావు, బొచ్చిన రాజేష్, కింజరాపు రామ్మూర్తి, శివసేన యువజన సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

గార మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎ.సింహాచలం	తహసీల్దారు	8499886055
పక్కి కాంతారావు	ఎంపీడీవో	8790007906
బి.గణేష్	సబ్ ఇన్‌స్పెక్టర్	9440795821
పైల నవీన్	వ్యవసాయాధికారి	8886612700
రామ్మోహనరావు	ఈవోపీఆర్డీ	8978914770
జి.శ్రీధర్	వెలుగు ఏపీఎం	8008803885
సీహెచ్ నారాయణరావు	ఏపీవో	8790007882
ఎం.భాస్కరరావు	ఎంఈవో	9502599890
ఫణీంద్రకుమార్	ట్రాన్స్‌కో ఏఈ	9440812431
శంకరరావు	హౌసింగ్ ఏఈ	7093930244
పి.గోవిందరావు	మండల ఇంజనీర్	9441478870
సీహెచ్ గోవిందరావు	ఆర్అండ్‌బీ ఏఈ	9440416921
కె.నారాయణమూర్తి	పశు వైద్యాధికారి	9985109363
డాక్టర్ పి.జగదీష్	ఆయుష్ వైద్యులు	9493764553


కళింగపట్నంలో వ్యాక్సిన్ వేస్తున్న సర్పంచ్ కృష్ణమూర్తి


శ్రీకూర్మంలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి

- తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి
- అధికారులు, ప్రజాప్రతినిధుల పిలుపు

శ్రీకూర్మం(గార): ఎమ్మార్ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేసుకోవాలని అధికారులు సూచించారు. శ్రీకూర్మం, గార, కళింగపట్నం పీహెచ్‌సీల వద్ద ఆయా అభివృద్ధి కమిటీల చైర్మన్‌లు మైగాపు ప్రభాకరరావు, కొంక్యాన రమణమూర్తి, పొట్నూరు విజయలక్ష్మి, సర్పంచ్‌లు బరాటం రామశేషు, బడగల వెంకటప్పారావు, పొట్నూరు కృష్ణమూర్తి, ఏఎంసీ డైరెక్టర్ పొట్నూరు వైకుంఠరావు, ఇతర పెద్దలు ప్రారంభించారు. వైద్యాధికారులు ప్రియరంజిత పట్నాయక్, ఎం.యుగంధర్, జి.వెంకటరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా పంచాయితీ కేంద్రాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గార జెడ్పీహెచ్‌స్కూల్, గార బాలుర గురుకుల పాఠశాలల వద్ద హెచ్ఎం ఎస్.దాలయ్య, యు.గణపతి పర్యవేక్షణలో చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు.

● కె.మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం), తూలుగు, అంబటివానిపేట, అంపోలు, బూరవెల్లి, శాలింహుండం, పూసర్లపాడు, బోరవానిపేట తదితర పంచాయతీల్లో సర్పంచ్‌లు మైలిపిల్లి లక్ష్మీజనార్ధనరావు, కొయ్యాన జగదీష్, అంబటి అంబిక, జీవీ రమణమూర్తి, మల్లా ఆగ్నేయ, కొంక్యాన ఆదినారాయణ, ఆరవల ఇందిరాగాంధీ, బోర మనోరమ, తదితరులు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

విద్యా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట


మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటప్పారావు

గార: విద్యాసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని...ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరముందని సర్పంచ్ బడగల వెంకటప్పారావు అన్నారు. గారలో ఉన్న బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వార్డెన్ దుర్యోధనరావు అధ్యక్షతన జరిగిన సమాశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ వసతిగృహానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం ఎస్.దాలయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై...ఉత్తమ ఉత్తీర్ణత పొందాలని సూచించారు. వార్డెన్ దుర్యోధనరావు మాట్లాడుతూ వసతిగృహంలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో ట్యూటర్ రమణమూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతా నుంచి నగదు డ్రా

పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

శ్రీకాకుళం క్రైం: చిన్నపాటి నిర్లక్ష్యం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. నగరంలోని రాజీవ్‌గృహకల్ప కాలనీకి చెందిన దాట్ల సాయికుమారి అనే మహిళ రెండురోజుల కిందట తన ఏటీఎంకార్డుతో పాటు పిన్ నంబర్ రాసి కుమారుడికిచ్చి నగదు డ్రా చేయమంది. అయితే ఆ కార్డు తోవలో పడిపోయిందని కుమారుడు చెబుతున్నాడు.ఈ నేపథ్యంలో సాయికుమారి ఖాతా నుంచి రూ.16 వేలు డ్రా అయినట్టు సెల్ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితురాలు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు మంగళవారం ఆశ్రయించింది. ఎస్ఐ చిన్నంనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల సైబర్ నేరాలు అధికమవుతున్నాయని.. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నా మార్పురావడం లేదని ఎస్ఐ అన్నారు.

ఒక్క టీకాతో రెండు వ్యాధులు దూరం

గీతాశ్రీకాంత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన

శ్రీకాకుళం సిటీ: ఒక్క టీకా వేయడం ద్వారా తట్టు, రుబెల్లా వ్యాధుల నుంచి ప్రతి చిన్నారిని రక్షించుకోవచ్చునని గీతాశ్రీకాంత్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు యార్లగడ్డ గీతాశ్రీకాంత్ పేర్కొన్నారు. ఎంఆర్ వ్యాక్సిన్‌పై నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో సోమవారం అవగాహనా సదస్సులు నిర్వహించారు. కమిషనర్ పీఏ శోభ ఆదేశాలు మేరకు గీతా శ్రీకాంత్ ఫౌండేషన్ ద్వారా ఎంఆర్ వ్యాక్సిన్‌పై స్థానిక చేపల వీధిలో ఉన్న నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, పుణ్యపు వీధిలోని ప్రాథమిక పాఠశాలల్లో అవగాహన కల్పించారు. తమకు అప్పగించిన పాఠశాలల్లో ఈ నెల 7,8 తేదీల్లో టీకాలు వేస్తారని. అందుకు ముందుగా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఎంఆర్ టీకాలు చిన్నారులందరికీ వేసేలా కృషి చేయాలని, అందుకు ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. ప్రముఖ సంఘసేవకుడు మంత్రి వెంకటస్వామి మాట్లాడుతూ పోలియోను తరిమికొట్టినట్టే తట్టు, రుబెల్లాను తరిమికొట్టి ఆరోగ్యవంతమైన సమాజనిర్మాణంలో అందరూ భాగస్వులు కావాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వార్డ్ ఇన్‌చార్జ్ బస్వా రాజేష్‌రెడ్డి, పాఠశాలల హెచ్ఎంలు డి.విజయ్‌కుమార్, బీవీ రమణమూర్తి, తవిటమ్మ, విజయకుమారి ఉపాధ్యాయులు పున్నయ్య, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి వెంకటస్వామి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కోటబొమ్మాళి: మండల పరిధి హరిశ్చంద్రపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వరహాలమ్మపేట గ్రామానికి చెందిన లారీ క్లీనర్ చదునపల్లి అప్పన్న తీవ్రంగా గాయపడ్డాడు. ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో అప్పన్న కుడికాలుకు బలమైన గాయం కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.నారాయణస్వామి తెలిపారు.

రోడ్డు విస్తరణ సరే... వంతెన మాటేమిటి?

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేట జంక్షన్ నుంచి సంతబొమ్మాళి మండలం పాలేశ్వరస్వామి ఆలయం వరకు రూ.12 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు ఎంతో ఆర్భాటంగా చేపట్టారు. అయితే కోటబొమ్మాళి శివారున ఉన్న వంతెన సింగిల్ వేలో ఉండడంతో ఇప్పటికీ అక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటునే ఉన్నాయి. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా వంతెనలు తొలగించి పునఃనిర్మాణం చేపడితే తప్ప ఇటువంటి ప్రదేశాల్లో ప్రమాదాలు నివారించడం కష్టమని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. రోడ్డు బాగుంది కదా అని వేగంగా వెళ్లి ఈ మలుపు వద్ద అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇదే పరిస్థితి కొత్తపల్లి రోడ్డులో కూడా దంత జంక్షన్ వద్ద ఉంది. రోడ్డు ఎంతో విశాలంగా ఉన్నప్పటికీ ఇక్కడ గెడ్డపై క్రాస్‌వే అలాగే ఉంచేయడంతో ఇక్కడ కూడా అదే పరిస్థితి నెలకొంది. కనీసం వీటికి రైలింగ్ కూడా లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇటువంటి వంతెనలు విస్తరించే పనులు చేపట్టాలని సర్వత్రా కోరుతున్నారు.


కోటబొమ్మాళి శివారులో గెడ్డపై ఉన్న క్రాస్‌వే వంతెన

'ఆసుపత్రిని అభివృద్ధి చేద్దాం'


పారిశుధ్య కార్మికులకు చెక్ అందజేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: ఆసుపత్రికి వచ్చే నిధులతో అభివృద్ధి పరుద్దామని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అనపాన రాజశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పారిశుధ్య కార్మికులకు చెక్కులను అందజేసి మాట్లాడారు. వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. వైద్యసేవలు సక్రమంగా అందించకపోతే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, అందరం కలిసికట్టుగా పనిచేద్దామని అన్నా. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శివకుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బసవ భాస్కరరెడ్డి, సర్పంచ్ భారతీగోపి, రవీంద్రనాథ జెన్నా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం: మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలితో కూడిన వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. కొరసవాడలోని సాయిగాయత్రి స్కూల్‌కు చేరువలో చెట్టు పడిపోవటం, పలుచోట్ల చెట్టుకొమ్మలు పడిపోవడంతో కొరసవాడలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలిసిన వెంటనే విద్యుత్ శాఖ సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఏడు పాఠశాలల స్థాయి కుదింపు

హిరమండలం: మండలంలో 7 ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక స్థాయికి కుదించినట్టు ఎంఈవో రాంబాబు చెప్పారు. 6, 7, 8 తరగతుల్లో విద్యార్థుల నమోదు తక్కువగా ఉన్నందున ఆయా పాఠశాలలను 3 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలల్లో కలిపేసినట్టు తెలిపారు. కల్లట, చొర్లంగి ప్రాథమిక పాఠశాల విద్యార్థులను అవలంగి ఉన్నత పాఠశాలకు, దుర్భలాపురం, కొండరాగోలు పాఠశాలల వారిని గులుమూరు ఉన్నత పాఠశాల, చిన్నకొల్లివలస వారిని హిర మండలం హైస్కూల్, రెల్లివలస పాఠశాల విద్యార్థులను అంబావల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చేర్పించినట్టు వివరించారు. కొరాడ ఆర్ఆర్ కాలనీలో విద్యార్థులు లేరని చెప్పారు.

'యెరుకోల సేవలు శ్లాఘనీయం'


విద్యార్థులకు క్రీడాపరికరాలు అందిస్తున్న నేతలు

పాతపట్నం: ప్రముఖ వ్యాపారి దివంగత యెరుకోల సుబ్బారావు సేవలు శ్లాఘనీయమని మాజీ ఎమ్మెల్యే కలమట మోహనరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఆదర్శ పాఠశాల ఆవరణలో నిర్వహించిన యెరుకోల జయంతి ఉత్సవంలో మాట్లాడారు. మరో మాజీ ఎమ్మెల్యే ధర్మాన నారాయణరావు యెరుకోలు చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులకు క్రీడాపరికరాలు, మిఠాయి, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు కొంచాడ వీరభద్రరావు, మాజీ అధ్యక్షుడు లింగాల జనార్దనరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు పైల లక్ష్మయ్య, పి.దాసునాయుడు, జి.రాజు, కె.రాజు, కె.అర్జునుడు, రేగేటి షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

తీర గ్రామాలపై దోమల దండయాత్ర

● నిద్రావస్థలో వైద్య సిబ్బంది ● వ్యాధులు ప్రబలుతాయని ప్రజల బెంబేలు

సంతబొమ్మాళి: మండలంలోని తీర గ్రామాలపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. వీటి ప్రభావంతో ఎప్పుడు ఎటువంటి అంటు వ్యాధి ప్రబలుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. మండలంలోని మేఘవరం, మర్రివాడ, లక్కివలస, కొల్లిపాడు, మలగాం మత్స్యకార పంచాయతీల్లోని సుమారు 30 గ్రామాల్లో దోమల బెడద తట్టుకోలేక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సాధారణంగా రాత్రి వేళ ల్లో అధికంగా ఉండే దోమలు ఈ గ్రామాల్లో పగటిపూటా దండయాత్ర చేస్తున్నాయి. తీరప్రాంత గ్రామాల్లో కొబ్బరి తోటలు ఎక్కువగా ఉండడం, ఇవి గ్రామాల పక్కనే ఉండడంతో దోమల ఎదుగుదల అధికంగా ఉంది. దోమల నివారణకు వైద్య శాఖ సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఏటా వివిధ పద్దుల కింద నిధులు మంజూరవుతున్నా వాటిని దుర్వినియోగం చేస్తున్నారని మత్స్యకారులు అంటున్నారు. దోమల నివారణకు మలాథిన్ స్ప్రే చేయించాలని బోరుభద్ర ప్రాథమిక వైద్యాధికారికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పెడచెవిన పెడుతున్నారని చెబుతున్నారు.

వైద్య సిబ్బంది గ్రామాల్లోకి రావడం లేదని, దోమలతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నామని మత్స్యకారులు అంటున్నా రు. వర్షాలు కురుస్తుండడంతో నీరు కలుషితమై అంటువ్యాధులు పట్టి పీడిస్తున్నాయని, అయినా వైద్య సిబ్బంది స్పందించకపోవడం శోచనీయమని వైస్ ఎంపీపీ సూరాడ భీమారావు వ్యాఖ్యానించారు. పారిశుధ్య నిర్వహణకు నిధులు మంజూరవుతున్నా అవి క్షేత్రస్థాయిలో వినియోగించకపోవడంతో దోమలను నివారించలేకపోతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

'క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం'

హిరమండలం: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని రామేశ్వరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.యుగంధర్ అన్నారు. మంగళవారం ఆయన కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డేలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ అలవరుచుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరువచ్చునన్నారు. అనంతరం విద్యార్థులు సినిమా పాటలకు నృత్యాలు చేస్తూ ఆహూతులను అలరించారు.

వాహనచోదకులూ జాగ్రత్త!


రోడ్డుపై ఏర్పడిన గోయి

ఎల్.ఎన్.పేట: అలికాం-బత్తిలి రోడ్డులో రావిచెంద్రి, చింతలబడవంజ మధ్య ఖానా నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రోడ్డుపై గోతులు ఏర్పడి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు చేపట్టి నాలుగు నెలలయింది. పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. మరమ్మతులకు గురైన ప్రాంతంలో వెంటనే పనులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని వాహనచోదకులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ భవనం వినియోగంలోకి వచ్చేదెప్పుడో?

నందిగాం: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తరగతి గదుల సమస్యను అధిగమించడానికి నిర్మించిన అదనపు భవనాలు వినియోగంలోకి తెచ్చేదెప్పుడని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ పాఠశాలలో 410 మంది విద్యార్థులు చదువుతుండగా, ప్రస్తుతం ఎనిమిది గదులే వినియోగంలో ఉన్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఆరుబయట తరగతులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ పథకం కింద రూ.23 లక్షలతో నిర్మించిన మూడు గదులు, సర్వశిక్ష అభియాన్ పథకం కింద రూ.13 లక్షలతో నిర్మించిన రెండు గదులు నిర్మాణం పూర్తిచేసుకొన్నా వినియోగంలో లేవు. దీంతో విద్యార్థులు చాలీచాలని వసతుల మధ్య చదువు సాగిసుతన్నారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న గదుల్లో మూడు శిథిలావస్థకు చేరాయి. రూ.లక్షలతో నిర్మించిన గదులు వినియోగంలో రాకపోగా ఉన్న వాటితో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేలా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఆర్ఎంఎస్ఏ నిధులతో నిర్మించిన భవనం

పెచ్చులూడుతున్నా పట్టించుకోరా?

కోటబొమ్మాళి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి పెను ముప్పు పొంచివుంది. కార్యాలయం పైకప్పు పెచ్చులూడుతున్నాయి. ద్వారాలు పుచ్చిపోతుండగా దస్త్రాలు చెదలు పడుతున్నాయి. పైకప్పు పెచ్చులు ఊడి ఎప్పుడు ఎవరిమీద పడతాయో, కంప్యూటర్లు ఏమవుతాయోనని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తుండడంపై సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యాలయాన్ని పరిశీలించి పునఃనిర్మాణానికి హామీలు ఇచ్చినప్పటికీ నేటికీ ఆచరణకు నోచుకోలేదు. ఇప్పటికైనా స్పందించి రెవెన్యూ కార్యాలయం కూడా అధునాతనంగా నిర్మించాలని కోరుతున్నారు.


పెచ్చులూడుతున్న పైకప్పు

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

హిరమండలం: మండలంలోని ధనుపురం గ్రామంలో మంగళవారం సంభవించిన అగ్ని ప్రామాదంలో మామిడి గడ్డయ్యకు చెందిన పూరిల్లు పూర్తిగా కాలి బూడిదయ్యింది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. ఆర్ఐ నీలిమ సంఘటన స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచానా వేశారు.

‘అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి’

టెక్కలిటౌన్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరమని టెక్కలి అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ బి.లక్ష్మణస్వామి చెప్పారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో స్థానిక చిన్నకంచ్రవీధిలోని ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు, సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ముఖ్యంగా గ్యాస్‌పై వంట చేస్తున్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు.

‘తట్టు, రుబెల్లాను తరిమికొడదాం’



కోటబొమ్మాళి: తిలారులో ఎంఆర్ వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ రామకృష్ణ



నందిగాం: ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఆర్ టీకాలు వేస్తున్న దృశ్యం



సంతబొమ్మాళి: విద్యార్థులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

తిలారు(కోటబొమ్మాళి): తట్టు, రుబెల్లా వ్యాధులను తరిమికొడదామని ఎంపీపీ తర్ర రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన తిలారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ వ్యాధులు పిల్లలకు దరిచేరకుండా చూసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో విలువైన వ్యాక్సిన్ వేయిస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తిలారు పీహెచ్‌సీ పరిధిలో 548 మందికి వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పి.హరికిరణ్, సూపర్‌వైజర్లు బి.కమల, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఒక టీకాతో రెండు వ్యాధులు దూరం’

టెక్కలిటౌన్: ఒక టీకాతో రెండు వ్యాధులను దూరం చేసేందుకు తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాలలోపు వారికి ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు మామిడి రాము చెప్పారు. స్థానిక సర్వ మంగళవీధిలోని విజ్ఞాన్ పాఠశాలలో తట్టు, రుబెల్లా వ్యాధులు సంక్రమించకుండా విద్యార్థులకు వ్యాధి నిరోధక టీకాను వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.మహాలక్ష్మి, ఉపాధ్యాయులు ఈశ్వరి, రత్నం, లోకేష్, అంగన్‌వాడీ కార్యకర్త జ.లత తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 15 సంవత్సరాలలోపు వారికి టీకాలు వేశారు.



టెక్కలిటౌన్: విద్యార్థులకు టీకా వేస్తున్న దృశ్యం

పిల్లలకు వ్యాక్సిన్ తప్పనిసరి

సంతబొమ్మాళి: పిల్లలకు(9 నెలల నుంచి 15 సంవత్సరాలు) మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని కర్రి విష్ణుమూర్తి అన్నారు. సంతబొమ్మాళి మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో వ్యాక్సినేషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల వ్యాధులు సోకవని చెప్పారు. ప్రతి విద్యార్థికి వ్యాక్సిన్ వేసేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. సంతబొమ్మాళిలో 220 మంది విద్యార్థులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.అప్పలరాజు, వైద్యాధికారి పి.అనిత, సర్పంచ్ పప్పు భాగ్యలక్ష్మి, కొన్న శ్రీరాములు, ఏఎన్ఎం చిన్నమ్మడు, పప్పు గణేష్, ఉపాధ్యాయులు కాంతారావు, సన్యాసి, శంకరరావు, నర్సింహమూర్తి, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, చిలకమ్మ పాల్గొన్నారు.

వ్యాధుల నుంచి కాపాడడానికే టీకాలు

నందిగాం: ప్రాణాంతక వ్యాధుల నుంచి పిల్లలను కాపాడడానికి తట్టు, రుబెల్లా టీకాలు దోహదపడతాయని ఎంపీపీ యర్ర విశ్వశాంతి, జడ్పీటీసీ సభ్యుడు కురమాన బాలకృష్ణారావు అన్నారు. నందిగాం ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఆర్ టీకాల కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు టీకాలు వేయనున్నట్లు చెప్పారు. 19 కేంద్రాల్లో 1262 మంది పిల్లలకు టీకాలు వేసినట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.చలమయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఎన్.శ్రీరామమూర్తి, వైద్య సిబ్బంది సూర్యనారాయణ, వెంకట్రావు, శంకరరావు, స్థానిక హెచ్‌ఎం ధర్మారావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘కాలిబాటలతో పంటలకు ప్రయోజనం’



హరిదాసుపురంలో పొలంపిలుస్తోంది నిర్వహిస్తున్న ఏవో

హరిదాసుపురం(నందిగాం): వరినాట్లకు సంబంధించి కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే ప్రయోజనం ఉంటుందని మండల వ్యవసాయాధికారి కొంక్యాన సురేష్ చెప్పారు. మంగళవారం ఆయన హరిదాసుపురం, భరణిగాం గ్రామాల్లో పొలంపిలుస్తోంది నిర్వహించి మాట్లాడారు. కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే వరికి దోమపోటు నుంచి రక్షణ లభిస్తుందని, గాలి, వెలుతురు మొక్కకు తగిలి ఏపుగా పెరుగుతుందని వివరించారు. ఎరువులు కూడా సులువుగా వేసుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కె.నారాయణమూర్తి, ఏఈవో పి.సురేష్, ఎంపీఈవోలు హారతి, కవిత, ఆదర్శ రైతు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

‘పిల్లలు బడుల్లోనే ఉండాలి’



విద్యార్థి గణనపై సమీక్షిస్తున్న ఏఎంవో

నందిగాం: బడిఈడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించే బాధ్యత తీసుకోవాలని సర్వశిక్ష అభియాన్ ఏఎంవో పూజారి గోవిందరావు కోరారు. మంగళవారం ఆయన స్థానిక మండల వనరుల కేంద్రంలో విద్యార్థి గణనపై ఆరాతీశారు. ఈ సందర్భంగా సీఆర్‌పీలు, ఇన్‌స్ట్రక్టర్లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రజాసాధికార సర్వే ప్రకారం మండలంలో 938 మంది పిల్లలు బడి బయట ఉన్నారని, వీరిలో 593 మంది వలస వెళ్లినట్లు గుర్తించామని తెలిపారు. ఈ పిల్లలు చదువుతున్నది, లేనిది ఆరాతీయాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారి జి.నర్శింహులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఏఐఈ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయిని పినకాన రాణి, కో-ఆర్డినేటర్ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండిన చెట్టుతో పొంచివున్న ప్రమాదం



గోపినాథపురం సమీపంలో రోడ్డుపక్కన ఎండిపోయిన చెట్టు

గోపినాథపురం(టెక్కలి): నౌపడ-మెళియాపుట్టి రోడ్డు గోపినాథపురం సమీపంలో రోడ్డుపక్కన ఎండిపోయిన చెట్టుతో ప్రమాదం పొంచివుంది. మూడేళ్లుగా చెట్టు ఎండిపోయి ఉండడం వలన ఏదైనా గాలి వానకు కొమ్మలు విరిగే అవకాశాలున్నాయి. ఈ చెట్టు కింద విద్యుత్ లైన్లు ఉండడం వలన ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఈ విషయం తెలియజేశామని, అయినా స్పందన కానరావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్టును తొలగించి ప్రమాదం జరగకుండా చూడాలని గోపినాథపురం వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

‘ఇక నుంచి నేరుగా ఇంటికే రేషన్’

జర్జంగి(కోటబొమ్మాళి): మంచంపట్టిన, వేలిముద్రలు పడని వారికి ఇకనుంచి ‘మీ ఇంటికి మీ రేషన్’ ద్వారా రేషన్ డీలరు లేదా వీఆర్‌వో లేదా వీఆర్‌ఏ నేరుగా లబ్ధిదారుని ఇంటికే సరుకులు అందజేస్తారని సివిల్‌సప్లైస్ డీటీ డి.వి.వి.ఎన్.రాజు చెప్పారు. మంగళవారం ఆయన కోటబొమ్మాళి మండల పరిధి జర్జంగిలో బెడ్‌రిడెన్ కేసులకు సంబంధించి 20 మంది ఇళ్లకు వెళ్లి రేషన్ అందజేశారు. ఈ విధానం ద్వారా కచ్చితంగా ప్రతి ఇంటికి సరుకులు చేరుతాయని, బినామీల సమస్య ఉండదని, ఎవరికీ సరుకులు అందలేదనే విమర్శలు ఉండబోవని అన్నారు. డీలర్‌తో పాటు వీఆర్‌వో, వీఆర్‌ఏ ఇందులో ప్రధాన భూమిక పోషిస్తారని, వేలిముద్రలు పడకపోయిన వారిని గుర్తించి సరుకులు అందజేయవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వీఆర్‌వో ఎం.ఏకాశి, రేషన్‌డీలర్ డి.దానయ్య, వీఆర్‌ఏ, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రేషన్ సరుకులు అందజేస్తున్న డీటీ రాజు

రోడ్డు మధ్యలో స్తంభంతో అవస్థలు

పిట్టలసరియా(టెక్కలి): గూడేం పంచాయతీ పరిధి పిట్టలసరియా గ్రామంలో వీధి మధ్యన విద్యుత్ స్తంభం ఉండడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు అంటున్నారు. జాతీయ రహదారి నుంచి పిట్టలసరియా వయా గూడేం వరకు రోడ్డు సౌకర్యం ఉండడంతో వాహనాల రాకపోకలు పెరిగాయని, అయితే రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం ఉండడం, దానికి విద్యుత్ సర్వీస్ వైర్లు అధికంగా ఉండడంతో వాహనచోదకులు ఈ స్తంభాన్ని దాటినప్పుడు ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఈ స్తంభాన్ని రోడ్డు పక్కకు మార్చాలని ఎన్నిమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా స్పందన లేదని, ఇప్పటికైనా విద్యుత్‌శాఖ సిబ్బంది దీన్ని మార్చే చర్యలు చేపట్టాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.



పిట్టలసరియాలో వీధి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

‘పదేళ్లలో మీరు ఏంచేశారు’

టెక్కలిటౌన్: అధికారంలో ఉన్న పదేళ్లలో టెక్కలి పట్టణం అభివృద్ధికి మీరు ఏం చేశారో చెప్పండి, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏమి అభివృద్ధి చేశామో చెబుతామని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని వైస్ ఎంపీపీ హనుమతు రామకృష్ణ ప్రతిపక్ష నాయకులకు సవాల్ విసిరారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అహర్నిశలు కృషి చేస్తూ టెక్కలిని నందనవనంగా తీర్చిదిద్దాలనే తలంపుతో ఉన్నారన్నారు. టెక్కలికి తాగునీరు, అంబేద్కర్ పార్కు, ఎర్రన్నాయుడు పార్కు, రోడ్ల విస్తరణ, మండల పరిషత్ కార్యాలయానికి శంకుస్థాపన వంటి పనులు చేశారని చెప్పారు. మంత్రి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

టెక్కలిలో సినిమాలు

సుదర్శన్	: గౌతమ్‌నంద
భవాని	: ఫిదా

కోటబొమ్మాళిలో..

శివకృష్ణ	: నిన్నుకోరి
అనుపమ	: గౌతమ్‌నంద